ప్రభాతనవ

సింగిడి

SINGIDI
తెలుగు దినపత్రిక

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

ఆదివారం 25 అక్టోబర్ 2026 | సంపుటి: 1 | సంచిక: 129 | పేజీలు 12 | వెల: 6.50

కదం తొక్కిన నిరసనకారులు

పారిస్‌లో లక్షమందికి పైగా ప్రదర్శన 2





2

'పీస్ బాండ్'పై సంతకానికి

నేహా బోరా నిరాకరణ

పీపల దందా.. బాసులకు తంటా!

సిఫారసుల పేరుతో పీఏల వసూళ్ల ఆరోపణలు

పోలీస్, రెవెన్యూ వ్యవహారాల్లో జోక్యం

సంక్షేమ సేవలకూ డబ్బుల డిమాండ్.. ప్రజాప్రతినిధుల ప్రతిష్ఠకు మచ్చ

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొందరు ప్రజాప్రతినిధుల వ్యక్తిగత సహాయకుల (పీఏల) వ్యవహారశైలి వివాదాస్పదంగా మారింది. మంత్రులు, ఎమ్మెల్యేల పేర్లను అడ్డుపెట్టుకుని వివిధ పనుల కోసం డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. అపాయింట్‌మెంట్ల నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వరకు సిఫారసుల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

వరంగల్ బ్యూరో - సింగిడి

2





గ్లోబల్ సమ్మిట్‌లో 'రక్షా ఎక్స్‌పో-2026'

2

రక్షణ రంగంలో భారత్‌ను అగ్రగామిగా చూడాలన్నదే నా ఆకాంక్ష: సీఎం రేవంత్‌రెడ్డి

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా 'రక్షా ఎక్స్‌పో-2026'ను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నగరంలోని తాజ్ ఫలక్‌నుమాలో నిర్వహించిన 'రక్షా ఎక్స్‌పో-2026' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు రక్షణ రంగ నిపుణులు, సాయుధ దళాల అధికారులు, డిఫెన్స్ కంపెనీల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాం. అంతర్జాతీయ వేదికపై రక్షా ఎక్స్ పోను తీర్చిదిద్దాలన్నది నా ఆలోచన. హైదరాబాద్ ఒక వ్యూహాత్మక ప్రదేశంగా దేశంలో కీలకమైన స్థానంలో ఉంది. హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరం. సముద్రం లేకపోయినా నౌకాదళానికి రాష్ట్రం కీలక మైన సేవలు అందిస్తోంది. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా తీర్చిదిద్దాం.

-హైదరాబాద్, అక్టోబర్ 24 (సింగిడి)

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చలు

సోమవారం ముంబయికి సీఎం రేవంత్‌రెడ్డి

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ముంబయిలో చర్చలు జరగనున్నాయి. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ముంబయి వెళ్లనున్నారు. తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొనున్నారు.

కేఆర్ఎంబీ సమావేశం వాయిదా

మరోవైపు సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా పడింది. అదేరోజు ముంబయిలో మహారాష్ట్ర సీఎంతో రేవంత్‌రెడ్డి సమావేశం ఉన్నందున వాయిదా వేయాలని తెలంగాణ కోరింది. ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేఆర్ఎంబీ సమావేశాన్ని వాయిదా వేశారు. సోమవారం జరగాల్సిన కృష్ణా బోర్డు సమావేశం మంగళవారానికి వాయిదా వేసింది.

-హైదరాబాద్, అక్టోబర్ 24 (సింగిడి)

2



ఏపీ మున్సిపల్ ఎన్నికల బరిలో 'మజ్లిస్'

ప్రచారానికి హైదరాబాద్ నుంచి ఎమ్మెల్యేలు

2

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు మజ్లిస్ (ఏఐఎమ్ఐఎమ్) పార్టీ ముమ్మరంగా ప్రచారం చేస్తోంది. కడప కార్పొరేషన్ మేయర్ పదవికి, హిందూపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ స్థానానికి ఆ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. విజయవాడ, కడప కార్పొరేషన్లతో పాటు మరో 5 మున్సిపాలిటీల్లో మొత్తం 21 మంది మజ్లిస్ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

-హైదరాబాద్, అక్టోబర్ 24 (సింగిడి)





కేంద్ర నిధులపై తెలంగాణ

సర్కార్ ఫోకస్

2

అధికారులకు సీఎస్ సంజయ్ జాజు కీలక ఆదేశాలు

కేంద్ర ప్రాయోజిత పథకాలపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష

నిధుల రికవరీ, వినియోగం వేగవంతం చేయాలని ఆదేశం

కేంద్ర అధికారులతో సమన్వయం పెంచుకోవాలని సూచన

అవసరమైతే కేంద్ర కార్యదర్శులతో తానే చర్చిస్తానని వెల్లడి

హైదరాబాద్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం



అల్లూరి జిల్లాలో భారీ పేలుడు

ఆరుగురు మృతి

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లాలో భారీ పేలుడు సంభవించింది. శనివారం ఉదయం అనంతగిరి మండలం పినకోట వద్ద రోడ్డు విస్తరణ పనులు కోసం బ్లాస్టింగ్ చేపట్టారు. దీనికోసం అమర్చిన జిలెటిన్ స్టిక్స్ మిస్ ఫైర్ కావడంతో అక్కడున్న ఆరుగురు దుర్మరణం చెందారు. పేలుడు ధాటికి రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి.

-అల్లూరి జిల్లా, అక్టోబర్ 24 (సింగిడి)

2

సివిల్స్ అభ్యర్థులకు ప్రభుత్వం

తీపి కబురు

ఆర్థిక సాయం పెంపు

బీసీ స్టడీ సర్కిల్ విద్యార్థుల స్టైఫండ్ రూ. 7 వేలకి పెంపు

పుస్తకాల ఫండ్ రూ. 5 నుంచి 10 వేలకు రెట్టింపు



సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న బీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. హైదరాబాద్‌లోని సైదాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న 100 మంది అభ్యర్థులకు అందించే ఆర్థిక సాయాన్ని గణనీయంగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది.

-హైదరాబాద్, అక్టోబర్ 24 (సింగిడి)

నీటి వృథాకు పాల్పడితే

రూ.5 వేల జరిమానా

జలమండలి హెచ్చరిక

2



హైదరాబాద్ నగరంలో తాగునీటి వృథాపై జలమండలి కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. జలమండలి ట్యాంకర్ల ద్వారా జరిగే నీటి వృథాపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎండీ అశోక్ రెడ్డి, వృథాను నివారించేందుకు ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేశారు. ట్యాంకర్ల ద్వారా నీటి వృథాకు పాల్పడితే నవంబర్ 1 నుంచి సంబంధిత ట్యాంకర్ యజమానికి రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదే ట్యాంకర్ రెండో సారి నిబంధనలు ఉల్లంఘిస్తే, రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. నీటి లీకేజీలు, మూతలు లేని ట్యాంకర్లను ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద ఉపయోగించవద్దని అధికారులను అశోక్ రెడ్డి ఆదేశించారు.

-హైదరాబాద్, అక్టోబర్ 24 (సింగిడి)

ఢిల్లీలో అమిత్ షా, అశ్వినీ వైష్ణవ్‌లతో

చంద్రబాబు భేటీ

2

రాష్ట్ర అభివృద్ధి, రాజకీయ అంశాలపై అమిత్ షా, చంద్రబాబు మధ్య చర్చ

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తోనూ సమావేశమైన ముఖ్యమంత్రి

ఏపీలో రైల్వే ప్రాజెక్టులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి

సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు మద్దతివ్వాలని కేంద్రానికి అభ్యర్థన



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఢిల్లీ పర్యటనలో భాగంగా శనివారం నాడు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి అందాల్సిన సహకారం, తదితర రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు.

-న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సింగిడి)

'నా ఇంట్లో అంజలి పెళ్లి వద్దు'

షర్మిల కూతురి మ్యారేజ్‌కి జగన్ నిరాకరణ

2

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన సోదరి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు రాసిన ఓ లేఖ ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. షర్మిల కుమార్తె అంజలి వివాహ వేదికకు సంబంధించి ఈనెల 9న జగన్ రాసిన ఈ లేఖ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తన మేనకోడలు అంజలి వివాహ వార్త విని ఎంతో సంతోషించానని లేఖలో జగన్ పేర్కొన్నారు. 'మన మధ్య ఎన్నో విభేదాలు, రాజకీయ పరిణామాలు ఉన్నప్పటికీ అంజలి జీవితాంతం ఎంతో సంతోషంగా ఉండాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని జగన్ ఆకాంక్షించారు.

-తాడేపల్లి, అక్టోబర్ 24 (సింగిడి)





ఇదేం చోద్యం!

2

మేనకోడలు వివాహానికి యలహంక ప్యాలెస్ ఇవ్వనని చెబుతున్నాడు..

మేనమామ కంస మామలా మారారని సీఎం చంద్రబాబువిమర్శ

గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి రాజకీయ, నైతిక, కుటుంబ విలువలు లేవన్న చంద్రబాబు



గ్లోబల్ సమ్మిట్‌లో ‘రక్షా ఎక్స్‌పో-2026’

రక్షణ రంగంలో భారత్‌ను అగ్రగామిగా చూడాలన్నదే నా ఆకాంక్ష. రక్షణ సాంకేతిక ఎగుమతులు చేసే దేశంగా భారత్ ఎదగాలి. రక్షణ రంగ పరిశ్రమలకు తెలంగాణ అతిపెద్ద కేంద్రం కావాలని ఆకాంక్షించారు.
తెలంగాణలో పెట్టుబడులపై మీ ప్రణాళికలను రెట్టింపు చేయండి. మీ లక్ష్య సాధనలో సహకరించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. తెలంగాణను 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చాలి. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలి. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యంగా.. తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతంగా సాధించాలన్నదే నా లక్ష్యం. రాజకీయంగా భేదాభిప్రాయాలున్నా.. పెట్టుబడుల విషయంలో లేవు. త్వరలోనే ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0 విడుదల చేయబోతున్నాం. రక్షణ రంగంలో దేశాన్ని అగ్రగామి శక్తిగా తీర్చిదిద్దేందుకు కలిసి పనిచేద్దాం'' అని సీఎం పిలుపునిచ్చారు.

‘పీస్ బాండ్’పై సంతకానికి
నేహా బోరా నిరాకరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సింగిడి)

భారతీయ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షురాలు నేహా బొరా, ఢిల్లీ పోలీసులు జారీ చేసిన శాంతి హామీ పత్రంపై సంతకం చేసేందుకు నిరాకరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం శాంతికి భంగం కలిగించడం ఎలా అవుతుంది? మేము ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోతే, ఎవరి శాంతిని కాపాడుతున్నట్లు అని ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇవాళ నేహా బోరా ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పౌరుల ప్రాథమిక హక్కు అని, ఈ హక్కును 'శాంతిభద్రతల ఉల్లంఘన'గా చిత్రించడం సరికాదని స్పష్టం చేశారు. పీస్ బాండ్‌పై సంతకం చేయడం అంటే తమ ప్రజాస్వామ్య నిరసన హక్కును వదులుకోవడమేనని నేహా బోరా కామెంట్ చేశారు. కాగా, అక్టోబర్ 16న 'లెహరా దో తిరంగా' ప్రదర్శన, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ జరిగిన నిరసనల్లో పాల్గొన్న క్రమంలో ఢిల్లీ పోలీసులు నేహా బొరాను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆమె విడుదలకు రూ.10 వేల విలువైన పీస్ బాండ్, పూచీకత్తు సమర్పించాలని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన నోటీసును సవాలు చేస్తూ నేహా బొరా దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు ఇటీవల కొట్టివేసింది. అయితే, తుది ఉత్తర్వులు ఇచ్చే ముందు సంబంధిత పత్రాలను బొరాకు అందించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించిన నేపథ్యంలో నేహా బోరా వ్యాఖ్యలు దేశ రాజధానిలో హాట్ టాపిక్‌గా మారాయి.

కేంద్ర నిధులపై తెలంగాణ
సర్కార్ ఫోకస్

హైదరాబాద్, అక్టోబర్ 24 (సింగిడి)

కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్రానికి అందాల్సిన నిధులను సత్వరమే రాబట్టి, వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. నిధుల విడుదలలో జాప్యాన్ని నివారించాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరును, నిధుల వినియోగాన్ని సీఎస్ సమీక్షించారు. లభ్యతలో ఉన్న నిధులను పూర్తి స్థాయిలో వాడుకోవడంపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిధుల విడుదలకు అవసరమైన పరిపాలనాపరమైన ప్రక్రియలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శులతో నిరంతరం సమన్వయం సాధించడం ద్వారా నిధుల విడుదలలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించుకోవాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో తానే స్వయంగా చర్చిస్తానని, సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ట ప్రయోజనాలను పొందడమే లక్ష్యంగా ఈ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు మహేశ్ దత్ ఎక్కా, దాన కిశోర్, రాహుల్ బొజ్జా, సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లాలో
భారీ పేలుడు

మృతుల్లో డ్రైవర్, ఇద్దరు కార్మికులు ఉండగా.. అటుగా వెళ్తున్న ఓ ఉపాధ్యాయుడు కూడా ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు గాయపడినట్లు తెలుస్తున్నది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. పేలుడు ధాటికి మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉన్నట్లు తెలుస్తున్నది. విషయం తెలుసుకున్న అధికారులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. మృతులను విశాఖకు చెందిన సునీత (టీచర్), కార్మికులు దేవరాపల్లికి చెందిన మణి, చీడికాడకు చెందిన నారాయణరావు, కడపకు చెందిన పవన్‌కుమార్‌గా గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది.

ఢిల్లీలో అమిత్ షా, అశ్విని వైష్ణవ్‌లతో
చంద్రబాబు భేటీ

దాదాపు అరగంట పాటు సాగిన ఈ భేటీలో రాష్ట్ర ప్రయోజనాలే ప్రధాన అజెండాగా చర్చలు జరిగాయి. అనంతరం, తన అధికారిక నివాసమైన 1 జన్‌పథ్‌లో కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్‌తో చంద్రబాబు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి కోరారు. అదేవిధంగా, 'ఇండియా సెమీకండక్టర్ మిషన్' కింద రాష్ట్రానికి మంజూరైన సెమీకండక్టర్ తయారీ ప్లాంటు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ పరిశ్రమ స్థాపన ద్వారా రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని, సాంకేతిక రంగంలో ఏపీ ముందంజ వేస్తుందని వివరించారు. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా పాల్గొన్నారు. ఈ రాత్రి ఢిల్లీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి విజయ్ బిష్ణోయ్ ఇంట జరిగే పెళ్లి వేడుకలో చంద్రబాబు పాల్గొననున్నారు. చంద్రబాబు శనివారం రాత్రి ఢిల్లీలోనే బస చేసి, ఆదివారం ఉదయం విజయవాడకు తిరిగి రానున్నారు.

నీటి వృథాకు పాల్పడితే రూ.5 వేల జరిమానా

బాధ్యతగా వ్యవహరించాలి

ట్యాంకర్లపై మూతలు సరిగా లేకపోవడం వల్ల రవాణా సమయంలో నీరు రోడ్డుపై వృథాగా పోతున్నట్లు జలమండలి గుర్తించింది. ఈ నేపథ్యంలో ట్యాంకర్లలో నీటిని నింపడం, రవాణా సమయంలో తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలు అమలు చేయాలని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగాల జనరల్ మేనేజర్లను ఆదేశించారు. ట్యాంకర్లలో నీటిని నింపే ముందు లీకేజీలు, మూతల పరిస్థితిని పరిశీలించాలని, లోపాలను గుర్తిస్తే వాటిని సరిచేసే వరకు నీటిని నింపరాదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని ఎండీ అశోక్ రెడ్డి సూచించారు.

నీరు, విద్యుత్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు

ఎల్‌నినో కారణంగా నీటి ఎద్దడి, తీవ్రమైన తాగునీటి కొరతను అధిగమించడం కోసం హైదరాబాద్ జలమండలి కఠినమైన నిర్ణయాలు తీసుకుంటోంది. జలమండలి పరిధిలోని అన్ని కార్యాలయాల్లో నీరు, విద్యుత్ వినియోగాన్ని కనీసం 20% మేర తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి పొదుపును ప్రజా ఉద్యమంగా మార్చాలంటే, ముందుగా జలమండలి కార్యాలయాల్లోనే ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ మేరకు అన్ని కార్యాలయాల్లో నీరు, విద్యుత్ పొదుపునకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జలమండలి కార్యాలయాల్లో ఎయిర్ కండిషనర్ల ఉష్ణోగ్రతను తప్పనిసరిగా 25 డిగ్రీల సెల్సియస్ వద్దే ఉంచాలని, సాయంత్రం 5 గంటల తర్వాత ఏసీలే వినియోగాన్ని నిలిపివేయాలని స్పష్టం చేశారు. ఏసీల నుంచి వెలువడే నీటిని వృథాగా పోనివ్వకుండా సేకరించి మొక్కల పెంపకం, శుభ్రత, తాగునీరు అవసరం లేని పనులకు పునర్వినియోగించాలని సూచించారు.

పబ్‌కు రూ.20 వేల జరిమానా

తాగునీటికి ఉపయోగించాల్సిన మంచినీటిని చాలా మంది ఇళ్ల ముందు రోడ్లు కడగడానికి, కార్లు, బైక్‌లు వాష్ చేయడానికి వాడుతున్నారు. కమర్షియల్ పబ్‌లు, హోటళ్లలో ఇష్టానుసారంగా వృథా చేస్తున్నారు. ఈ కారణంగా ఇటీవల జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-45 లోని ఫోర్ ఫాదర్స్ పబ్‌కు జలమండలి రూ.20 వేల జరిమానా విధించింది. నీటి దుర్వినియోగానికి పాల్పడిన ఆ పబ్‌కు తాగునీటి కనెక్షన్‌ను తొలగించారు. కమర్షియల్ వాటర్ ట్యాంకర్ల సరఫరా కూడా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.

ఈ నంబర్లకు ఫిర్యాదు చేయాలి

హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లలో నీటిని వృథా చేస్తే కనెక్షన్లు కట్ చేస్తామని జలమండలి అధికారులు హెచ్చరించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్క పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీటి వృథాపై ఫొటోలు, వీడియోల ద్వారా 99499 30003 వాట్సాప్ నంబర్, 155313 కు ఫిర్యాదు చేయాలని కోరారు.

పీఏల దందా.. బాసులకు తంటా!

సిఫారసుల పేరుతో వసూళ్లు

ప్రజాప్రతినిధులను కలిసేందుకు అపాయింట్‌మెంట్లు ఇప్పించడం, కాంట్రాక్టు బిల్లుల మంజూరుకు సిఫారసు లేఖలు ఇప్పించడం వంటి పనుల కోసం కొందరు పీఏలు డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలున్నాయి. ఉద్యోగాలు, పోస్టింగుల విషయంలోనూ పైరవీలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల్లో జోక్యం

పోలీస్ స్టేషన్లు, రెవెన్యూ కార్యాలయాల్లో అధికారులపై ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజాప్రతినిధుల పేర్లు ప్రస్తావిస్తూ పనులు చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు అధికార వర్గాల్లో చర్చకు కారణమవుతున్నాయి.

సంక్షేమ సేవలకూ డబ్బుల డిమాండ్

సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు, టీటీడీ దర్శనాల సిఫారసులు, గురుకుల ప్రవేశాలు, విదేశీ విద్యా స్కాలర్‌షిప్‌ల విషయంలోనూ డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రజలకు అందాల్సిన సేవల కోసం కూడా డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే విమర్శలు ఈ వ్యవహారాన్ని మరింత తీవ్రంగా మారుస్తున్నాయి.

ప్రజాప్రతినిధుల ప్రతిష్ఠకు మచ్చ

పీఏల వ్యవహారంతో ప్రజాప్రతినిధుల పేర్లు వివాదాల్లోకి వస్తున్నాయి. తమ పేరుతో వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలపై నేతల స్పందన ఏమిటన్నది స్పష్టత రావాల్సి ఉంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడినట్లు తేలిన వారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రజాసేవకు ఉపయోగపడాల్సిన వ్యవస్థలో ఇలాంటి ఆరోపణలు రావడం ఆందోళనకరం. ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకున్నప్పుడే ప్రజల్లో విశ్వాసం



కదం తొక్కిన నిరసనకారులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సింగిడి)

ఫ్రాన్స్‌లో నిరసనకారులు కదం తొక్కారు. ఒక్క పారిస్‌లోనే లక్ష మందికిపైగా ప్రజలు ప్రదర్శనలో పాల్గొన్నారు. నగర కేంద్రానికి దూరంగా ఉండే మార్గంలోనే నిరసన తెలపాలని అధికారులు ఆంక్షలు విధించినప్పటికీ.. పెద్దఎత్తున సానికులు గుమిగూడారు. దీంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు, జలఫిరంగులను ప్రయోగించారు. లియోన్, క్లెర్మాంట్-ఫెర్రాండ్, స్ట్రాస్‌బర్గ్, నీస్, మార్సెయిల్ తదితర నగరాల్లోనూ నిరసనలు జరిగాయి.

ఈగిల్స్ నెస్ట్.. మంటల్లో 'హిట్లర్' భవనం

విపరీతంగా పెరుగుతున్న జీవన వ్యయాలను నిరసిస్తూ.. పాఠశాలలకు మరిన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఫ్రాన్స్‌లో కొన్ని రోజులుగా ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ నిరసనల నేపథ్యంలో దేశవ్యాప్తంగా 70 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించినట్లు అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి లారెంట్ నునెజ్ వెల్లడించారు. పారిస్‌లో నిరసన ప్రదర్శనకు సంబంధించి 64 మందిని పోలీసులు అరెస్టు చేశారని స్థానిక ప్రాసిక్యూటర్ కార్యాలయం తెలిపింది.

సివిల్స్ అభ్యర్థులకు ప్రభుత్వం
తీపి కబురు

పెంచిన మొత్తాలను వచ్చే నెల నుంచే అమలు చేయనున్నట్లు ప్రకటించింది. వివరాల్లోకి వెళితే, సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఇప్పటివరకు నెలకు రూ.5,000గా ఉన్న స్టైఫండ్‌ను రూ.7,000కు పెంచారు. అదేవిధంగా, పుస్తకాల కొనుగోలు కోసం ఒకేసారి ఇచ్చే బుక్ ఫండ్‌ను రూ.5,000 నుంచి ఏకంగా రూ.10,000కు రెట్టింపు చేశారు. ఈ పెంచిన మొత్తాలను విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం సైదాబాద్ కేంద్రంలో 100 మంది విద్యార్థులకు మూడేళ్ల సమగ్ర సివిల్స్ శిక్షణ అందిస్తున్నామని, మరో 100 మందికి ఇతర పోటీ పరీక్షల కోసం ఫౌండేషన్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నామని హరికృష్ణ పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రైవేట్ స్టడీ హాళ్ల కోసం డబ్బు వృథా చేయకుండా, స్టడీ సర్కిల్ లైబ్రరీ వేళలను కూడా పొడిగించినట్లు తెలిపారు. ఇకపై లైబ్రరీ ఉదయం 7 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చలు

నీటిపారుదల శాఖ అధికారులకు ఆదేశాలు

సాగునీటి ప్రాజెక్టులపై శుక్రవారం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశంలో భాగంగా తుమ్మిడిహెట్టిపై ప్రధానంగా చర్చించారు. 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించేందుకు అవసరమైన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజినీర్లను సీఎం ఆదేశించారు.
గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అయితే అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకొనే వీల్లేదని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు సిద్ధమవుతోంది. అందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలని ఇప్పటికే అధికారులకు సూచించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలు, వాదనలను సమర్థవంతంగా వివరించనున్నారు.

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది

మరోవైపు రాష్ట్ర ప్రజల కష్టాలకు కారణమైన బీఆర్ఎస్ నేతలే ప్రస్తుతం అబద్ధాలు చెబుతున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలోనే మేడిగడ్డ బ్యారేజ్ కూలిపోయిందని, కేసీఆర్ తీరు వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో పరిస్థితులు ఉన్నాయని, అయినా రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.
"మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణంలో సీకెంట్ ఫైల్స్ వాడారు. సీకెంట్ ఫైల్స్ వాడకం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో సమస్యలు వచ్చాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో గేట్లు మూయవద్దని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. బ్యారేజీల గేట్లు మూయకుంటే పంపులు రన్ చేసే అవకాశమే లేదు. కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలని బీఆర్ఎస్ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. బ్యారేజీ నిర్మాణానికి ఎంత కాంక్రీట్ అవసరమైందో, అంతే కాంక్రీట్ మరమ్మతులకు అవసరం" – ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి
ఎల్‌నినో వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు కారణం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు చేసే విషప్రచారాన్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరని మంత్రి పేర్కొన్నారు.

ఏపీ మున్సిపల్ ఎన్నికల బరిలో 'మజ్లిస్'

పార్టీ అధ్యక్షుడి సూచనల మేరకు

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు మజ్లిస్ నాయకులు హైదరాబాద్‌కు వచ్చి పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీని కలిశారు. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను బరిలో దించితే కచ్చితంగా విజయం సాధిస్తామని ఆయనతో ధీమా వ్యక్తం చేశారు. అన్ని మున్సిపాలిటీ స్థానాల్లో కాకుండా కచ్చితంగా విజయం సాధిస్తామని నమ్మకం ఉన్న వార్డులు, డివిజన్లలో మాత్రమే పోటీ చేయాలని ఒవైసీ సూచించగా, అందుకు వారు అంగీకరించారు. దీంతో కడప కార్పొరేషన్ మేయర్ పదవికి, విజయవాడ కార్పొరేషన్‌లోని మూడు డివిజన్లకు అభ్యర్థులను ఖరారు చేశారు.

ప్రచారం ప్రారంభించిన మజ్లిస్ నేతలు

హిందూపురం పురపాలక చైర్‌పర్సన్ స్థానంతో పాటు మరో 5 వార్డుల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థులు బరిలో నిలుస్తున్నారు. అలాగే ఆదోని-7, రాయదుర్గం-3, పెనుగొండ, నంద్యాల మున్సిపాలిటీల్లో ఒక్కో వార్డు చొప్పున పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించేందుకు హైదరాబాద్ నుంచి ఎంఐఎం ఎమ్మెల్యేలు జాఫర్ హుస్సేన్ మిరాజ్, మాజిద్ హుస్సేన్, మహ్మద్ ముబీన్‌తో పాటు ఎమ్మెల్సీ రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీలు ఇప్పటికే ఏపీకి వెళ్లి, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

నవంబర్ 1న ఎన్నికలు

ఆంధ్రప్రదేశ్‌లోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల ప్రక్రియ కోసం ఆ రాష్ట్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ షెడ్యూల్ ప్రకారం నవంబర్ 1న 87 మున్సిపల్ కార్పొరేషన్లు, 13 మున్సిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు పోలింగ్ జరగనుంది. అవసరమైన చోట్ల నవంబర్ 2న రీ-పోలింగ్ నిర్వహించాలని సూచించింది. నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టాలని ప్రకటించింది. వాస్తవానికి అక్టోబర్ 28న పోలింగ్ జరగాల్సి ఉండగా, సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ మార్పులు చేసింది.

సుప్రీంకోర్టు ఆదేశాలతో కొత్త షెడ్యూల్

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తొలి విడతగా నోటిఫికేషన్ జారీ చేసి, ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించాలని ఏపీఎస్ఈసీ నిర్ణయించింది. ఉపసంహరణలకు ఈ నెల 21 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువునిచ్చింది. అయితే తమ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారంటూ వైఎస్సార్సీపీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు తుది జాబితాను వాయిదా వేసి నామినేషన్ వేయలేకపోయిన వారికి అవకాశం కల్పించాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఎన్నికల ప్రక్రియను ఏపీఎస్ఈసీ తాత్కాలికంగా వాయిదా వేసింది. అన్ని జిల్లాల నుంచి నివేదికలు తెప్పించుకొని కొత్త షెడ్యూల్‌ను ప్రకటించింది.

‘నా ఇంట్లో అంజలి పెళ్లి వద్దు’

అయితే అంజలి వివాహాన్ని బెంగళూరులోని తన నివాసంలో జరిపించాలని షర్మిల కోరుకుంటున్నట్లు తనకు తెలిసిందని, అయితే అక్కడ పెళ్లి నిర్వహిస్తే తీవ్ర భద్రతా సమస్యలతో పాటు వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుందని లేఖలో వివరించారు. పెళ్లికి వచ్చే వందలాది మంది అతిథులు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సిబ్బంది వల్ల భద్రతా పర్యవేక్షణ కష్టమవుతుందని పేర్కొన్నారు.

నా పిల్లలకైనా ఇదే నిర్ణయం..

తన కుమార్తెలు హర్ష, వర్షల వివాహాల విషయంలో కూడా బెంగళూరు నివాసాన్ని అనుమతించేవాడిని కానని, కుటుంబ సభ్యులందరికీ ఒకే భద్రతా ప్రమాణం వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. బెంగళూరు నివాసానికి బదులుగా హైదరాబాద్‌లోని 'లోటస్ పాండ్' నివాసంలోనే అంజలి పెళ్లిని ఎంతో ఘనంగా నిర్వహిద్దామని సూచించారు. అలా కాకపోతే అంతకుముందు రాజారెడ్డి పెళ్లి జరిపినట్లుగా ఏదైనా కన్వెన్షన్ సెంటర్ లేదా డెస్టినేషన్ వెడ్డింగ్ వేదికగా ఎంచుకోవాలని కోరారు. దయచేసి వివాహ వేదికను మార్చుకోవాలని సోదరి షర్మిలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్ కుటుంబంలో కొన్నాళ్లుగా ఆస్తి, రాజకీయ విభేదాలు నడుస్తున్న తరుణంలో, మేనకోడలి పెళ్లి వేదికపై జగన్ రాసిన లేఖ బయటకు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఒకవైపు కుటుంబ సభ్యురాలిపై ప్రేమను వ్యక్తం చేస్తూనే, భద్రత పేరుతో బెంగళూరు ఇంటికి నో చెప్పడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఇదేం చోద్యం!: సీఎం చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 24 (సింగిడి)

గొడ్డలి పార్టీ అధ్యక్షుడికి రాజకీయ విలువలే కాదు, కనీస కుటుంబ, నైతిక విలువలు కూడా లేవని ముఖ్యమంత్రి చంద్రబాబు విరుచుకుపడ్డారు. సొంత మేనకోడలి వివాహ వేడుకకు బెంగళూరులోని యలహంక ప్యాలెస్ ఇచ్చేందుకు నిరాకరించడం ఎంతవరకు సబబని, ఇదేం చోద్యమని ప్రశ్నించారు. ఆస్తిలో చెల్లెలికి భాగం ఉన్నప్పటికీ, మేనకోడలి పెళ్లిని అడ్డుకుని 'కంస మామ'గా తయారయ్యారని విమర్శించారు. ఆస్తుల కోసం కన్న తల్లిని, సొంత చెల్లిని కూడా వేధిస్తున్నారని, ఆయన ఫ్యాక్షన్ మనస్తత్వం రాష్ట్రానికి ఎంత ప్రమాదకరమో ప్రజలు అర్థం చేసుకోవాలని చంద్రబాబు హితవు పలికారు. అమరావతిలో మీడియాతో మాట్లాడిన చంద్రబాబు, ఈ మేరకు వ్యాఖ్యానించారు. "రాజకీయ ముసుగులో ఉన్న ఆ వ్యక్తి నిరంతరం అసత్యాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. బెంగళూరు నుంచి వచ్చి 'హిట్ అండ్ రన్' తరహాలో ప్రభుత్వంపై బురద చల్లి వెళ్లిపోతున్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగించడమే పనిగా పెట్టుకున్నారు" అని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతోందని ఆ పార్టీకి చెందిన మాజీ డిప్యూటీ స్పీకరే చెబుతున్నా, ఆ పార్టీ అధ్యక్షుడు మాత్రం హింస జరుగుతోందని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలో తమ పాలనలో 24 శాతం స్థానాలను ఏకగ్రీవం చేసుకున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అప్పుడు రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న వ్యక్తి, నాటి ఎన్నికల కమిషనర్‌నే బెదిరించి, ఆయన కేంద్ర బలగాలతో భద్రత ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితిని కల్పించారని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి పాలనలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయని, 28 జిల్లాల్లో 9,829 ఎంపీటీసీ స్థానాలకు 51,902... 659 జెడ్పీటీసీ స్థానాలకు 5,724 నామినేషన్ల దాఖలు కావడమే ఇందుకు నిదర్శనమని చంద్రబాబు వివరించారు.
"రాజకీయాల్లో ఇలాంటి నేరస్థులను నేనెప్పుడూ చూడలేదు. క్రిమినల్స్‌ను రా

ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించిన అదనపు కలెక్టర్



సిద్ధిపేట బ్యూరో, అక్టోబర్ 24(సింగిడి): సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో శుక్రవారం రోజున కార్మికుల హక్కులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన మీ పని.. మీ జీతం.. మీ స్వేచ్ఛ పోస్టర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ఆవిష్కరించారు. జిల్లాలో ఈ నెల 8 నుండి 28 వరకు పలు ప్రాంతాల్లో కార్మికుల హక్కులపై అవగాహన కల్పించే ప్రచార వాహనాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, పనిప్రదేశాల్లో ఎలాంటి వేధింపులు, బెదిరింపులు, అన్యాయం ఎదురైనా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, వారికి అందుబాటులో ఉన్న సహాయ సేవలపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి ప్రచార కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. పనిప్రదేశాల్లో అన్యాయం జరిగినా, బెదిరింపులకు గురైనా, తమ హక్కులకు భంగం కలిగినా బాధితులు ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. పోస్టర్‌లో సూచించిన సహాయం కోసం 080-69434343 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్మికులు తమ హక్కులను తెలుసుకొని, సమస్యలు ఎదురైనప్పుడు తగిన సహాయం పొందాలని ఈ కార్యక్రమం ద్వారా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజ్ కుమార్, జిల్లా అసిస్టెంట్ కమిషన్ శ్రీనివాస్, సిద్దిపేట లేబర్ ఆఫీసర్ జ్యోతి, అవగాహన కార్యక్రమం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగుభూమి సంరక్షణపై రైతులకు అవగాహన



సిద్ధిపేట బ్యూరో, అక్టోబర్ 24(సింగిడి): కేతే బచావ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున అక్బర్పేట/భూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి రైతు వేదికలో రైతులకు సాగుభూమి సంరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి సత్య అన్వేష్ మాట్లాడుతూ నేల ఆరోగ్యం కాపాడుతూ, నీరు ఎరువులు సస్యరక్షణ ఖర్చులను సమర్థంగా వినియోగించి రైతుకు నికర ఆదాయం సాధించడం కోసం 12 అంశాల పైన రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఎల్ నినో పరిస్థితుల వల్ల ఆరుతడి పంటల సాగు ప్రాముఖ్యత, సమగ్ర నీటి వినియోగం పై రైతులకు వివరించారు. అనంతరం పశు వైద్య అధికారి మోహన్ లాల్ మాట్లాడుతూ పంట వ్యర్థాలను ఉపయోగించి పశువులకు పోషణ సమృద్ధి దానా ఎలా చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమం లో ఏఈఓ శ్రీనివాస్, సాయి తో పాటు రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేసిన ఏఎంసీ చైర్మన్



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 24(సింగిడి): సబ్సిడీపై శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. వికారాబాద్ మండలం లోని నారాయణపూర్ రైతువేదికలో రైతులకు శనగ విత్తనాలను వైస్ చైర్మన్ మల్లేశంతో కలిసి శుక్రవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను సరైన సమయంలో వినియోగించుకోవడం ద్వారా మెరుగైన పంట దిగుబడులు సాధించవచ్చిని తెలిపారు. రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని వ్యవసాయ అధికారి ప్రసన్న లక్ష్మి పేర్కొన్నారు. సబ్సిడీపై శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 25 కిలోల బ్యాగు ధర రూ. 2,500 కాగా ప్రభుత్వ రూ. 1,000 సబ్సిడీ పోను రైతులు రూ. 1500 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ ఏ ఈ వో ను సంప్రదించి నారాయణపూర్ రైతువేదిక కేంద్రంలో విత్తనాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ వో ప్రసన్న లక్ష్మి, డైరెక్టర్ రంగారెడ్డి, ఏఈవో రమాదేవి, రైతులు, అధికారులు నాయకులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి చేయూతగా నిలిచిన అయ్యవారిగూడ కాంగ్రెస్ పార్టీ కమిటీ



ఇబ్రహీంపట్నం,అక్టోబర్ 24(సింగిడి): యాచారం మండలం అయ్యవారి గూడెం గ్రామం లో ఇటీవల మరణించిన కొప్పు పోచమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో 10,000/- రూపాయల ఆర్థిక సాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో గ్రామ శాఖ అధ్యక్షులు నక్క లక్ష్మయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్‌లు నక్క మహేందర్ యాదవ్, కొప్పు వెంకటస్వామి, జిల్లా యువ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోలమోని రామకృష్ణ యాదవ్, వార్డు సభ్యులు నక్క కలమ్మ నందు, పసులాది కరుణాకర్ రెడ్డి, పోలమోని జంగయ్య, మండలి చెన్నకేశవులు, బిఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు నక్క మహేందర్ వారి కుటుంబ సభ్యులు కొప్పు చంద్రశేఖర్ ,రామకృష్ణ , మహేష్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలోని పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించండి

చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్



జవహర్ నగర్, అక్టోబర్ 24(సింగిడి): చంద్రపురి కాలనీ డివిజన్ పరిధిలోని పట్టభద్రులను ఓటర్లుగా ఎన్రోల్ చేయించాలని చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ పిలుపునిచ్చారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ చంద్రపురి కాలనీ పరిధిలోని హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో డివిజన్ పరిధిలోని డిగ్రీ పట్టబద్రుల ఓటర్లను ఎన్రోల్ చేయించాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున ఈ మేరకు ఓటరు నమోదు కార్యక్రమం చురుగ్గా కొనసాగుతుందని ఈరోజు నుండి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని నాయకులకు సూచించారు ప్రతి ఒక్క నాయకుడు సుమారు 100 మంది డిగ్రీ పట్టభద్రులను తప్పనిసరిగా ఎన్రోల్ చేయించాలని తెలిపారు పట్టబద్రుల నమోదుకు చివరి తేదీ నవంబర్ ఆరవ తేదీ కావున ఆ తేదీ వరకు మాజీ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పూర్తి సమయాని కేటాయించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వేర్వేరు అంశాలపై కలెక్టర్ సత్యశారద సమీక్ష

పనుల పురోగతిపై సంబంధిత అధికారులకు ఆదేశం





వరంగల్, అక్టోబర్ 24(సింగిడి): జాతీయ రహదారి 163జీకి సంబంధించిన పనుల పురోగతిపై వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పనుల ప్రస్తుత స్థితి, వివిధ శాఖల సమస్యలు, పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆమె సూచించారు. సమీక్ష లో జిల్లా ఫారెస్ట్ అధికారి నిఖిత, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్, డియార్వో విజయలక్ష్మి,వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణిలు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్‌లో కార్మికులు, పరిశ్రమలకు అవసరమైన వసతుల కల్పనపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. పార్కులో అవసరమైన మౌలిక సదుపాయాలు, కార్మికులకు కల్పించాల్సిన వసతులు, సంబంధిత అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత అధికారుల తో సమీక్షించారు. కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్,వరంగల్ ఆర్డీవో సుమ,నర్సంపేట ఆర్డీవో ఉమారాణి,సంగెం తహసిల్దార్ రాజ్ కుమార్,ఆర్టీసీ డి.ఏం ధరమ్ సింగ్, జోనల్ మేనేజర్ స్వామి మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆందోల్ అభివృద్ధికి రూ.3 వేల కోట్లకు పైగా నిధులు

అలయ్-బలయ్‌లో అభివృద్ధి కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా





సంగారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 24(సింగిడి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే అలయ్-బలయ్ కార్యక్రమం ఆందోల్ నియోజకవర్గంలో ఘనంగా జరిగింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో చౌటకూరు మండలం తాడ్దాన్‌పల్లిలోని ఎం.ఎస్. ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోల్ నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి దామోదర్ రాజనర్సింహ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటివరకు రూ. 3 వేల కోట్లకు పైగా నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రధానంగా రహదారుల నిర్మాణం, ఆసుపత్రుల అభివృద్ధి, నర్సింగ్ కళాశాల, హాస్టళ్ల నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేజీబీవీల ఏర్పాటు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, సీఎస్ఆర్ నిధులతో కంప్యూటర్ ల్యాబ్‌లు, బస్సుల ఏర్పాటు, సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పన వంటి కార్యక్రమాలను వివరించారు. అదేవిధంగా ఆందోల్ స్టేడియం అభివృద్ధి, ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గిరిజన లా కళాశాల, పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదులు, జోగిపేట--ఆందోల్ పట్టణాలను అనుసంధానం చేసే వంతెనల నిర్మాణం, సింగూర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ పరిసర ప్రాంతాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం వంటి పనులను వివరించారు. రవాణా, పర్యాటక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను కూడా మంత్రి వివరించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

అలయ్-బలయ్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు శ్రీ సంగమేశ్వర్, పీసీసీ సభ్యులు శ్రీ కిషన్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు జగన్ మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీమతి లక్ష్మి శేఖర్‌రెడ్డి, ఆందోల్--జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, మాజీ చైర్మన్ సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆత్మ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, సేవాదళ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత స్వయం ఉపాధిపై దృష్టిసారించాలి

వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి



వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 24(సింగిడి): నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పై దృష్టి సారించాలని వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ హోటల్ ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన వ్యాపారాలు వికారాబాద్ అభివృద్ధికి దోహదపడతాయని, వ్యాపారంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. యువత ఈ దిశగా ఆలోచించాలని వ్యాపారాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వినోద్ కుమార్, డాక్టర్ అవినాష్, మాజీ కౌన్సిలర్ మురళి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్, కాకినాగరాజు, నారాయణ, ఏ నాగరాజు. హోటల్ యజమానులు, స్థానిక నాయకులు, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 25, 26 తేదీలలో చలో హైదరాబాద్ మహాధర్నాను జయప్రదం చేయండి

- కార్మికులకు కనీస వేతనం 26వేల నుంచి 42వేలకు పెంచాలి
- సీఐటీయూ



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 24(సింగిడి): అక్టోబర్ 25, 26 తేదీలలో నిర్వహించే చలో హైదరాబాద్ మహాధర్నాను కార్మికులందరూ ఐక్యంగా పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ బాచుపల్లి మండల కమిటీ, ముఖ్య కార్యకర్తల సమావేశంలో పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సీఐటీయూ బాచుపల్లి మండల కన్వీనర్ రాథోడ్ సంతోష్, బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి పిచ్చన్న మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ మహాధర్నాలో పారిశ్రామిక కార్మికులు, మున్సిపల్ కార్మికులు, ఆటో కార్మికులు, తోపుడుబండ్ల కార్మికులు, వారపు మార్కెట్ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని వారు విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ కార్మికుల వేతనాలు కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. అనేక పరిశ్రమల్లో కనీస వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికులకు గౌరవప్రదమైన జీవనం కల్పించాలంటే కనీస వేతనాలను పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సంక్షేమ బోర్డులు, పెన్షన్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలి. 60 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు ?9,000 పెన్షన్ అందించాలి. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, అర్హులైన కార్మికుల సేవలను క్రమబద్ధీకరించాలి. మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచి, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి. ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి. తోపుడుబండ్ల, వీధి వ్యాపారుల హక్కులను పరిరక్షించి, వీధి వ్యాపారుల చట్టం--2014ను సమర్థంగా అమలు చేయాలి. వారపు మార్కెట్ కార్మికులకు ఉపాధి భద్రత కల్పించి, ఎలాంటి వేధింపులు లేకుండా వ్యాపారాలు నిర్వహించుకునే హక్కు కల్పించాలనే డిమాండ్లతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల ఐక్యతతోనే హక్కులను సాధించుకోగలమని, ప్రభుత్వాలు, యాజమాన్యాలపై సంఘటిత పోరాటం ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని నాయకులు పేర్కొన్నారు. కార్మికులందరూ కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు వచ్చి, తమ కుటుంబాల భవిష్యత్తు, ఉద్యోగ భద్రత, గౌరవప్రదమైన జీవనం కోసం చలో హైదరాబాద్ మహాధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సీఐటీయూ సీనియర్ నాయకులు నాగభూషణ్, మండల నాయకులు నరసింహ, లింగమ్మ, ఎల్లమ్మ, మాధవులు, మద్దిలేటి, రాజేందర్, మణి, నాగలక్ష్మి, శీను, బాలమణి, ఈషా బేగం, ఏడుకొండలు, వెంకన్న తదితర మండల కమిటీ సభ్యులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు





కుత్బుల్లాపూర్, అక్టోబర్ 24(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్ లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. వారు సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళు న్నామని తెలియజేశారు. దసరా పండుగ పర్వదిన సందర్భంగా పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సార్ నాయక్ నగర్‌లో ఆగిపోయిన ఇండోర్ స్టేడియం తెరిపించాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన స్థానిక నేతలు



కుత్బుల్లాపూర్, అక్టోబర్ 24(సింగిడి): కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఎస్సార్ నాయక్ నగర్ లో ఆగిపోయిన ఇండోర్ స్టేడియం తెరిపించాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, మాజీ ప్రెసిడెంట్ ఆలూరు వెంకట శేషాచారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి ఇండోర్ స్టేడియం తెరిపించేటట్టు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు గుబ్బల లక్ష్మీనారాయణ ప్రకటనలో తెలిపారు.

సమిష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి
- ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి



కొమురవెల్లి అక్టోబర్ 24(సింగిడి): రైతుల సంక్షేమమే లక్ష్యంగా, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ గ్రామీణ ప్రాంతాలను బాట పట్టించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని చేర్యాల ఏఎంసీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కొమురవెల్లి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్పంచుల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి ద్వారానే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధిదీపాలు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక వసతులను మెరుగుపరిచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి.

సమస్యల గుర్తింపు: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి, వాటి త్వరితగతిన పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి.ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్ వర్మ, ఎంఈవో రవి, ఎస్ఐ మహేష్, వివిధ గ్రామాల సర్పంచులు, పిఏసిఎస్ చైర్మన్, డైరెక్టర్లు, వివిధ శాఖల అధికారులు మరియు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన



కొమురవెల్లి అక్టోబర్ 24(సింగిడి): పోలీస్ వ్యవస్థ పనితీరుపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించడంతో పాటు, సమాజ రక్షణలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ కొమురవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓపెన్ హౌస్' కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. గురువారం రోజు స్థానిక పాఠశాలల విద్యార్థులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు తమదైనందిన విధులు, చట్టాల పట్ల వివరణ ఇచ్చారు.దరఖాస్తు నుండి ఎఫ్ఐఆర్ వరకు ఒక బాధితుడు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు దరఖాస్తు ఇచ్చిన తక్షణమే అది ఎఫ్ఐఆర్ గా ఎలా మారుతుంది ఆపై దర్యాప్తు అధికారి కేటాయింపు, సాక్ష్యాల సేకరణ, విచారణ ప్రక్రియ ఎలా ముందుకు సాగుతుందో పూసగుచ్చినట్లు వివరించారు. ఆయుధాలు మరియు సాంకేతిక పరిజ్ఞానం: విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ రకాల ఆయుధాలు, కమ్యూనికేషన్ సాధనాలు వాకీ-టాకీలు కంట్రోల్ రూమ్ వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా చూపించారు. విద్యార్థులు అడిగిన పలు ఆసక్తికరమైన ప్రశ్నలకు పోలీసులు ఓపికగా సమాధానమిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నేరుగా పోలీస్ స్టేషన్‌ను సందర్శించి విషయాలు తెలుసుకోవడం తమకు ఎంతో ఆసందాన్ని, ధైర్యాన్ని ఇచ్చిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఎడిటోరియల్

Editorial

బ్రిటిష్ పాలన నుంచి డేటా పాలన వరకు..

స్వాతంత్ర్యం అంటే భూభాగానికేనా...?

ఒకప్పుడు బ్రిటిష్ పాలకులు భారతదేశాన్ని పాలించడానికి భూమిని ఆక్రమించారు. దేశ సంపదను కొల్లగొట్టారు. ప్రజల శ్రమను తమ సామ్రాజ్య ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారు. నేడు ప్రపంచం డిజిటల్ యుగంలోకి అడుగు పెట్టింది. భూమిని ఆక్రమించకుండానే, ప్రజల సమాచారాన్ని సేకరించి, వారి ప్రవర్తనను విశ్లేషించి, వారి నిర్ణయాలను ప్రభావితం చేసే శక్తి కొన్ని ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థల చేతుల్లో కేంద్రీకృతమవుతోంది. ఈ నేపథ్యంలో ఒక కీలక ప్రశ్న ఎదురవుతోంది. భారత్ రాజకీయంగా స్వతంత్ర దేశమేనా? మరి డిజిటల్ ప్రపంచంలోనూ అంతే స్వతంత్రంగా ఉందా?

అప్పట్లో భూమి.. ఇప్పుడు డేటా!

బ్రిటిష్ పాలనలో భూమి, ఖనిజాలు, వ్యవసాయ ఉత్పత్తులు, మానవ శ్రమ సంపదకు చిహ్నాలుగా ఉండేవి. నేడు వ్యక్తి పేరు, చిరునామా, ఆధార్‌కు సంబంధించిన సమాచారం, బ్యాంకు లావాదేవీలు, ఆరోగ్య వివరాలు, ఆన్‌లైన్ శోధనలు, కొనుగోలు అలవాట్లు, ప్రయాణ వివరాలు కూడా విలువైన డేటాగా మారాయి.

మనం స్మార్ట్‌ఫోన్ ఉపయోగించిన ప్రతిసారీ, యాప్‌లలో సేవలు పొందినప్పుడు, ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు డిజిటల్ ఆనవాళ్లు ఏర్పడతాయి. ఈ సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా వినియోగదారుల అభిరుచులు, అవసరాలు, ఆర్థిక ప్రవర్తనపై అంచనాలు వేయవచ్చు. ఈ డేటా ఆధారంగా ప్రకటనలు, వ్యాపార వ్యూహాలు, సేవల రూపక ల్పన జరుగుతుంది. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. సమాచారాన్ని సృష్టించేది ప్రజలు. దాని ద్వారా లాభాలు పొందేది ఎవరు? దానిని ఎలా వినియోగిస్తున్నారో తెలుసుకునే హక్కు ప్రజలకు ఎంతవరకు ఉంది?

డిజిటల్ వలసవాదం అంటే ఏమిటి?

ప్రపంచవ్యాప్తంగా పెద్ద టెక్నాలజీ సంస్థలు విస్తారమైన డేటాను సేకరించి, దాని ఆధారంగా ఆర్థిక ప్రయోజనాలను పొందుతున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలు ఈ డిజిటల్ వ్యవస్థలకు వినియోగదారులుగా మారినప్పుడు, వారి సమాచారం ద్వారా సృష్టించే విలువలో వారికి ఎంత ప్రయోజనం దక్కుతోందనే ప్రశ్న తలెత్తుతోంది. దీనినే కొందరు పరిశోధకులు 'డేటా వలసవాదం' (Data Colonialism) అనే భావనతో వివరిస్తున్నారు. ఇది బ్రిటిష్ పాలనకు అచ్చమైన ప్రతిరూపం కాదు. కానీ ప్రజల వనరులను సేకరించడం, వాటిపై నియంత్రణ సాధించడం, ఆ నియంత్రణ ద్వారా ప్రయోజనాలు పొందడం వంటి అంశాల్లో పోలికలు ఉన్నాయని వారు విశ్లేషిస్తున్నారు. భారత్‌లో డేటా సార్వభౌమాధికారంపై జరిగిన పరిశోధనలు మరో ముఖ్యమైన విషయాన్ని గుర్తుచేస్తున్నాయి. విదేశీ సంస్థల నుంచి డేటాను కాపాడటం మాత్రమే సరిపోదు. దేశీయ సంస్థలు లేదా ప్రభుత్వ వ్యవస్థలు సమాచారాన్ని ఎలా వినియోగిస్తున్నాయి? పౌరుల హక్కులు ఎలా రక్షించబడుతున్నాయి? అనే ప్రశ్నలకూ సమాధానాలు అవసరం.

(మూలం: Technology and Regulation, 2024Ñ SAGE, 2025 పరిశోధనలు.)

డేటా భద్రత.. ప్రజల హక్కులే అసలైన గీటురాయి

భారత్ డిజిటల్ సేవల విస్తరణలో గణనీయమైన పురోగతి సాధించింది. డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ ప్రభుత్వ సేవలు, డిజిటల్ గుర్తింపు వ్యవస్థలు ప్రజలకు అనేక సౌకర్యాలను అందిస్తున్నాయి. అదే సమయంలో వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కావడం, సైబర్ మోసాలు, అనధికార సమాచార సేకరణ, నిఘా వంటి అంశాలపై అప్రమత్తత అవసరం. డేటా దేశ సరిహద్దుల్లోనే నిల్వ ఉండటం ఒక్కటే సంపూర్ణ భద్రతకు హామీ కాదు. దాన్ని ఎవరు యాక్సెస్ చేస్తున్నారు? ఏ ప్రయోజనం కోసం ఉపయోగిస్తున్నారు? ఎంతకాలం నిల్వ చేస్తున్నారు? పొరపాటు జరిగితే బాధ్యత ఎవరిది? బాధితులకు పరిహారం, ఫిర్యాదు పరిష్కారం ఎలా అందుతాయి? ఇవన్నీ కీలకమైన ప్రశ్నలు. భారత్‌లో డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ కోసం 2023లో చట్టం రూపొందించబడింది. అయితే, చట్టం ఉనికితోపాటు దాని అమలు, ప్రజల్లో అవగాహన, జవాబుదారీతనం కూడా అంతే ముఖ్యం.

మరో వలసవాదం రాకుండా జాగ్రత్త!

బ్రిటిష్ పాలన నుంచి భారత్ రాజకీయ స్వాతంత్ర్యం సాధించింది. కానీ ఆధునిక ప్రపంచంలో స్వాతంత్ర్యానికి కొత్త కోణాలు ఏర్పడ్డాయి. సాంకేతికతపై ఆధారపడటం, డిజిటల్ మౌలిక సదుపాయాల నియంత్రణ, వ్యక్తిగత సమాచార భద్రత, కృత్రిమ మేధస్సు వినియోగం వంటి అంశాలు దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి. భారత్ డేటా బానిస అవుతుందా లేదా అన్నది ముందుగానే నిర్ణయించబడిన విషయం కాదు. మన విధానాలు, చట్టాలు, సాంకేతిక సామర్థ్యం, ప్రజల హక్కుల పరిరక్షణ, సంస్థల జవాబుదారీతనం దానిని నిర్ణయిస్తాయి.

ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్
సీనియర్ పాత్రికేయులు
కామారెడ్డి జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు,

తెలుగు సినిమా సంగీత మహారథి సాలూరి

అక్టోబర్ 25... సాలూరి జేశ్వరరావు వర్ధంతి

తెలుగు సంగీత జగత్తులో స్వరరాజుగా నిలిచిన సంగీతజ్ఞుడు సాలూరి రాజేశ్వరరావు. ఆయన పేరు వినగానే మనసు నిండా స్వర మాధుర్యం, రాగ రంజితం, భక్తి, భావగర్భితత్వం, సాహిత్యానుసంధానం అన్నీ కలసి ఒక గానసుధగా ప్రవహిస్తాయి. తెలుగు సినిమాకు స్వరమనే ఆత్మను అందించిన మహా స్వరకారుడు ఆయన.

1922 అక్టోబర్ 11న విజయనగరం జిల్లాలోని సాలూరు సమీప గ్రామమైన శివరామ పురంలో జన్మించిన రాజేశ్వరరావు చిన్నతనం నుంచే సంగీతానురక్తు డయ్యాడు. ఆయన తండ్రి సన్యాసి రాజు ప్రసిద్ధ మృదంగ విద్వాంసుడు ఆయన ప్రభావంతోనే బాల్యంలోనే రాగాలు, తాళాలు, లయలను సులభంగా అలవోకగా నేర్చుకున్నాడు. కేవలం ఆరు సంవత్సరాల వయసులోనే హార్మోనియం వాయించి ప్రేక్షకులను ఆకట్టుకున్న బాల విద్వాన్‌గా పేరు తెచ్చుకున్నాడు.

తరువాత మద్రాసుకు వెళ్లి సంగీత రంగంలో తన ప్రతిభను చాటుకున్నాడు. శాస్త్రీయ సంగీతంలో లోతైన పట్టు సాధించి హార్మోనియం, వీణ, మృదంగం, తబలా వంటి వాయిద్యాలలో నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ఆ నైపుణ్యమే ఆయనచే సినీ సంగీత జగత్తులో ఒక కొత్త అధ్యాయం రాయించ గలిగింది.



సినీ సంగీత దర్శకుడిగా ఆయన తొలి చిత్రం 1939లో వచ్చిన "జయప్రద". అది తెలుగు సంగీతానికి శాస్త్రీయ మాధుర్యాన్ని చేర్చిన ఆరంభం. ఆ తరువాత ఆయన స్వరాలు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో సుగంధాల్లా విస్తరించాయి. తెలుగు సినిమాకు శాస్త్రీయతను, సౌందర్యాన్ని, ప్రజాదరణను కలిపిన మొదటి తరం సంగీత దర్శకులలో ఆయన అగ్రగణ్యుడు.

రాజేశ్వరరావు సంగీతం అంటే కేవలం రాగ మాలిక కాదు--- ప్రాణమంత అనుభూతి. ఆయన రూపొందించిన ప్రతి పాట ఒక గానరసరాజ్యం. "మల్లీశ్వరి" (1951)లోని మనసున మల్లెల పాటలోని రాగదారధ్యం, "మిస్సమ్మ" (1955)లోని బృందావనమది అందరిది గీతంలోని సౌందర్యం, "అప్పు చేసీ పప్పు కూడు" (1959)లోని ఎచటి నుండి వీచెనో ఈ చల్లని గాలీ స్వరమాధుర్యం, " "మాయాబజార్"లోని లాహిరి లాహిరి లోని లయాత్మకత---ఇవి అన్నీ ఆయన సంగీత విశిష్టతకు అద్భుత సాక్ష్యాలు.

శాస్త్రీయ సంగీతంలోని కర్ణాటక రాగాలను ప్రజల హృదయాలకు దగ్గరగా చేర్చిన సృజనాత్మక మాంత్రికుడు ఆయన. రాగం, భావం, సాహిత్యం---ఈ మూడింటి సమన్వయమే ఆయన స్వరాల ప్రాణం. భక్తి, ప్రేమ, దేశభక్తి, జీవన తత్వం -- ఏ భావం అయినా ఆయన సంగీతంలో ప్రాణం పోసినట్లే అనిపిస్తుంది. ఘంటసాల, ఎస్.జానకి, పి.సుశీల, ఎం.బాలమురళీకృష్ణ, బానుమతి వంటి గాయకులు ఆయన స్వరాలలో మంత్రముగ్ధులై పాడిన పాటలు తెలుగు ప్రజల హృదయాల్లో నిత్యనూతనంగా నిలిచాయి. ప్రతి గాయకుడి స్వర నైపుణ్యాన్ని గుర్తించి, ఆ స్వరానికి సరిపోయే రాగాన్ని ఎంపిక చేయడం ఆయనకు సహజ సిద్ధం.

రాజేశ్వరరావు సంగీతం అంటే ఆత్మసాధన. ఆయనకు సంగీతం ఒక యాగం---స్వరాల రూపంలో ఆత్మానుభూతి. పాట సృష్టించే ముందు భావం, పద్యం, రాగం అన్నింటినీ సమన్వయ పరచి "పాట మనసుతో పుడుతుంది" అనే తాత్విక దృష్టితో ఆయన ప్రతి కృతి నిర్మించారు.

ఆయన స్వర సృష్టిలో ప్రతి చిత్రానికి ప్రత్యేకత ఉంది. ఉదాహరణకు "విప్రనారాయణ" చిత్రంలోని మేలుకో శ్రీరంగ అనిర్వచనీయంగా ఉంటుంది. అదే చిత్రంలోని ఎందుకోయీ తోటమాలి కీరవాణి రాగంలో, చూడుమదే చెలియా (హిందోళం), సావిరహే (యమన్ కల్యాణి), మధుర మధురమీ చల్లని రేయీ మరువ తగనిదీ. (మోహనరాగం) వంటి గీతాలు ఆయన శాస్త్రీయ సాధనకు ప్రతిరూపాలు.

ఇదే విధంగా "జగమే మారినది (దేశ ద్రోహులు), "నా హృదయంలో నిదురించే చెలీ" (ఆరాధన)" "పాడవేల రాధికా" (ఇద్దరు మిత్రులు)చిత్రంలోని గీతాలు--- ఆయన స్వర నైపుణ్యానికి పరాకాష్ట. ప్రతి పాటలో ఆ రాగం మూలాత్మను స్పష్టంగా ప్రతిఫలింప జేశాడు.

తన దీర్ఘకాల సంగీత ప్రయాణంలో దాదాపు వందకు పైగా చిత్రాలకు సంగీతం అందించారు. ఆయన శిష్యులు, అనుచరులు తెలుగు సినిమాకు సంగీత పరమైన పునాదులు వేసారు. రాజేశ్వరరావు అందించిన స్వరాలు నేటికీ శ్రోతల చెవుల్లో నిశ్శబ్ద నాదంలా మారుమ్రోగుతూనే ఉన్నాయి.

1979లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ (కళాప్రపూర్ణ) అందజేసింది. 1992లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనకు ప్రతిష్టాత్మక "రఘుపతి వెంకయ్య అవార్డు"ని ప్రదానం చేసింది. ఇవి ఆయన సంగీత సాధనకు లభించిన గౌరవ చిహ్నాలు మాత్రమే.

1999 అక్టోబర్ 25న ఈ మహా స్వరయోగి మరణించాడు. కానీ ఆయన సృష్టించిన గీతాలు, రాగాలు నేటికీ తెలుగు మనసుల్లో గానం అవుతూనే ఉన్నాయి.

సాలూరి రాజేశ్వరరావు అనేది కేవలం పేరు కాదు---తెలుగు సంగీతానికి ఇచ్చిన ఆత్మ. ఆయన స్వరాలు గాయకుల కంఠాల్లో నిత్యనాదంలా మారాయి. తెలుగు సంస్కృతి, సంగీత సంప్రదాయానికి ఆయన సాక్ష్యము, శాశ్వత చిహ్నము. ఆయన స్వరాల మాధుర్యం కాలాన్ని దాటుకుని తరతరాల పరకూ మ్రోగుతూనే ఉంటుంది.
ఆయన సృష్టించిన ప్రతి గానం, ప్రతి రాగం---నిత్యజీవి.
ఆయన సంగీతం ఎప్పటికీ నిశ్శబ్దం కాదు... అది నిత్యనాదమే.

-రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
కాలమిస్ట్...9440595494

17 కోట్ల ఓటర్లు, ఒకే సంకల్పం...

ప్రజాస్వామ్య భారత ఆవిర్భావం



భారతదేశం స్వాతంత్ర్యం పొందిన 1947 ఆగస్టు 15వ తేదీతో కొత్త యుగం ఆరంభమైంది. కానీ స్వాతంత్ర్యం అంటే కేవలం విదేశీ పాలన ముగింపు మాత్రమే కాదు, ప్రజల చేతుల్లో అధికారాన్ని ఉంచిన ప్రజాస్వామ్య పాలనకు నాంది. ఈ లక్ష్యసాధనకు మూలస్తంభం 1951లో ప్రారంభమైన దేశపు మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికలు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 1950 జనవరి 26 తరువాత భారత ప్రజలకు ఓటు హక్కు లభించి, ఒక పౌరుడు -- ఒక ఓటు అనే సూత్రంపై ఆధారపడి ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించాలనే ధ్యేయంతో దేశం సన్నద్ధమైంది.

అప్పుడు దేశ జనాభా సుమారు 36 కోట్లమంది. వారిలో 21 సంవత్సరాలు పైబడిన 17.3 కోట్ల మంది ఓటర్లుగా నమోదు అయ్యారు. వీరిలో సుమారు 85 శాతం మంది నిరక్షరాస్యులు కావడం ఎన్నికల నిర్వాహణకు విశేష సవాలు. అయినప్పటికీ ఆ సవాళ్లను అధిగమిస్తూ భారత ఎన్నికల సంఘం ప్రపంచ చరిత్రలోనే అత్యంత పెద్ద ప్రజాస్వామ్య ప్రదర్శనను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ మహత్తర కార్యక్రమానికి సుకుమార్ సేన్ తొలి ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించబడ్డారు. ఆయన విజ్ఞత, దూరదృష్టి, శాస్త్రీయ విధానం ఈ ప్రాజెక్ట్‌ను ఆదర్శంగా నిలిపాయి.

దేశవ్యాప్తంగా మొత్తం 489 లోక్‌సభ స్థానాలకు, 4014 రాష్ట్ర శాసనసభ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి వచ్చింది. సుమారు 2,24,000 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దాదాపు 16,500 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రతి నియోజకవర్గం 4--5 గ్రామాలను లేదా ప్రాంతాలను కలిపి ఏర్పాటు చేయబడింది. ఈ ఎన్నికలు ఒకే రోజున జరగడం సాధ్యంకాక 1951 అక్టోబర్ 25 నుండి 1952 ఫిబ్రవరి 21 వరకు దశలవారీగా సాగాయి. ఉత్తరప్రదేశ్, బీహార్, మద్రాస్, బొంబాయ్, పశ్చిమ బెంగాల్, మధ్య ప్రదేశ్, అసోం, పంజాబ్, రాజస్థాన్, ఒడిశా, హైదరాబాద్, మైసూర్, కోచిన్, త్రావంకూర్ రాష్ట్రాలలో విడివిడిగా ఎన్నికల షెడ్యూల్ రూపొందించ బడింది.

అప్పుడు ఎక్కువ మంది ఓటర్లు సంతకం చేయడం లేదా పేరు రాయడం తెలియక పోవడంతో, ప్రతి పార్టీకి ప్రత్యేక చిహ్నం కేటాయించారు. బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల పేర్లు, చిహ్నాలు ముద్రించి, ఓటర్లు తమకు ఇష్టమైన అభ్యర్థి గుర్తుపై ముద్ర వేయడం ద్వారా ఓటు వేయ గలిగారు. ఈ విధానం తర్వాతి ఎన్నికలలోనూ కొనసాగింది. బ్యాలెట్ పెట్టెల కోసం ప్రత్యేక రంగులు వాడటం, వర్షం తట్టుకునేలా బాక్సులు తయారు చేయడం, అడవులు, పర్వత ప్రాంతాల్లోని గ్రామాల వరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు అద్భుత నిర్వహణకు నిదర్శనం.

రాజకీయంగా దేశం అప్పట్లో కాంగ్రెస్ ఆధిపత్యంలో ఉండేది. స్వాతంత్ర్య పోరాటం తరువాత ప్రజలు పెద్ద ఎత్తున నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెస్‌పై విశ్వాసం ఉంచారు. కాంగ్రెస్ పార్టీతో పాటు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా, సోషలిస్టు పార్టీ, జనసంఘం, కిసాన్ మజ్దూర్ పార్టీ వంటి వామపక్ష, మధ్యమ, కుడి భావజాలాల పార్టీలు కూడా పోటీలోకి దిగాయి. మహిళా అభ్యర్థుల సంఖ్య తక్కువగా ఉన్నా, మహిళా ఓటర్ల పాల్గొనిక విశేషమైంది. మొదటి ఎన్నికల్లో దాదాపు 49 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించారు.

ఫలితాలు 1952 మార్చి నెలలో వెల్లడయ్యాయి. కాంగ్రెస్ పార్టీ 364 లోక్‌సభ స్థానాలు గెలుచుకుని ఘనవిజయం సాధించింది. కమ్యూనిస్టు పార్టీ 16 సీట్లు, సోషలిస్టు పార్టీ 12 సీట్లు, భారత జనసంఘం 3 సీట్లు గెలుచుకున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు, ప్రాంతీయ నాయకులు కొద్దిపాటి స్థానాలు గెలిచారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ భారత దేశపు తొలి ప్రజాస్వామ్య ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ ఎన్నికలలో మహిళా పాల్గొనిక ప్రత్యేకమైన ఘట్టం. మొత్తం ఓటర్లలో సుమారు 45 లక్షల మహిళలు తమ ఓటు హక్కును వినియోగించారు. కొన్ని ప్రాంతాల్లో మహిళలు మొదటిసారిగా ఇంటి నుండి బయటికొచ్చి పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడం సామాజిక పరివర్తనకు సంకేతంగా నిలిచింది. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం కూడా మొదటిసారిగా పటిష్ఠంగా ఏర్పడింది.





రాష్ట్రాల వారీగా చూసినప్పుడు ఉత్తర ప్రదేశ్ (86), బీహార్ (53), మద్రాస్ (75), బొంబాయ్ (45), పశ్చిమ బెంగాల్ (37), పంజాబ్ (22), మధ్యప్రదేశ్ (39) స్థానాలతో కూడిన పెద్ద రాష్ట్రాలు కాంగ్రెస్ ఆధిపత్యంలోకి వచ్చాయి. ఆంధ్ర రాష్ట్రం అప్పట్లో మద్రాస్ రాష్ట్రంలో భాగముగా ఉండి 28 స్థానాల నుండి కాంగ్రెస్ 20 స్థానాలు గెలిచింది. తెలంగాణ భాగమైన హైదరాబాద్ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ గెలుపొందింది.

స్వాతంత్ర్యం తర్వాత ఎన్నో సామాజిక, రాజకీయ విభజనలతో సతమతమవుతున్న దేశంలో ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యాన్ని స్థిరపరిచాయి. ప్రజలలో రాజకీయ చైతన్యం పెరిగింది. గ్రామాల వరకు పార్టీలు చేరి అవగాహన కల్పించాయి. నెహ్రూ చెప్పినట్లు "భారత ప్రజాస్వామ్యం ఒక ప్రయోగం కాదు, ఇది మన ఆత్మగౌరవం, మన విశ్వాసానికి ప్రతీక" అనే మాటలకు తగిన విధంగా ప్రజలు స్పందించారు.



ప్రపంచమంతా నిరక్షరాస్యులు అధికంగా ఉన్న దేశం ఈ స్థాయిలో ప్రజాస్వామ్య ఎన్నికలు నిర్వహించగలదా అని సందేహించిన వేళ, భారత్ ఆ అనుమానాలన్నింటినీ తొలగించింది. ఐక్యరాజ్య సమితి, యూరోపియన్ దేశాలు ఈ ఎన్నికలను "విశ్వ ప్రజాస్వామ్య చరిత్రలో అద్భుత ఘట్టం"గా అభివర్ణించాయి.

ఈ ఎన్నికలతో భారత రాజ్యాంగం సజీవంగా మారింది. "ప్రజల చేతుల్లో అధికారముంది" అనే సూత్రం ఆచరణలోకి వచ్చింది. భారతదేశం అక్షరాలా ప్రజాస్వామ్య గణతంత్రంగా రూపు దిద్దుకుంది. ఆ తొలి ఎన్నికలలో వేసిన పునాది నేడు బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థగా వికసించింది.

1951 సార్వత్రిక ఎన్నికలు భారత రాజకీయ చరిత్రలో బంగారు అక్షరాలతో లిఖించబడిన ఘట్టం. స్వతంత్ర భారత జాతి ఆత్మగౌరవానికి, ప్రజల చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఈ ఎన్నికలు ప్రపంచానికి భారత ప్రజాస్వామ్య ప్రతిభను చాటాయి. ఓటు అనే అణువంత హక్కుతో సమాజాన్ని మార్చగల శక్తి ప్రజలలో నాటిన మొదటి విత్తనం అదే.

1951 ఎన్నికలు కేవలం ఓటింగ్ ప్రక్రియ కాదు --- అవి భారత ప్రజాస్వామ్యానికి మూలాధారం, నేటి భారత రాజ్య వ్యవస్థకు జీవప్రాణం.

-రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,
కాలమిస్ట్...9440595494

త్వరితగతిన బియ్యం సరఫరా చేయాలి



రైస్ మిల్లర్లకు పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ ఆదేశాలు

కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 24 (సింగిడి): ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం నిల్వలను నిర్దేశిత గడువులోగా సరఫరా చేయాలని పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యాం ప్రసాద్ లాల్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. బియ్యం సరఫరాలో ఎలాంటి జాప్యం జరగకుండా, నిర్దిష్ట లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం బియ్యం సరఫరా అంశంపై రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యాం ప్రసాద్ లాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం నిల్వలు, సరఫరా ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి బియ్యం సరఫరా చేయడంలో మిల్లర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బియ్యం పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సరఫరాను వేగవంతం చేయాలని ఆదేశించారు. సరఫరాలో నిర్లక్ష్యం వహించకుండా నిర్దిష్ట గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సరఫరా ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, డీఎం శ్రీకాంత్, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేరల్‌తాండ విద్యుత్ సమస్యపై ఎమ్మెల్యే స్పందన



● విద్యుత్ శాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు

కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 24(సింగిడి): గాంధారి మండల పరిధిలోని నేరల్ తాండ గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు స్పందించారు. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, సమస్య పరిష్కారానికి సంబంధిత విద్యుత్ శాఖ అధికారితో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామంలో విద్యుత్ సరఫరాకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించడంతో ఆయన వెంటనే స్పందించి, సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారికి సూచించినట్లు సమాచారం. ప్రజలకు నిత్యం ఎదురయ్యే సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా వాటి పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండటం వ్యవసాయ పనులతో పాటు ప్రజల దైనందిన జీవనానికి ఎంతో అవసరం. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు స్పందించడం, సంబంధిత అధికారులు సత్వర చర్యలు తీసుకోవడం ద్వారా గ్రామాల అభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

జనగామలో బోరు కుంగుబాటు.. బ్లాస్టింగ్‌లపై అందోళన..!!

బాధితుల వద్దకు కందుల సంధ్యారాణి : శాస్త్రీయ విచారణకు డిమాండ్



గోదావరిఖని, అక్టోబర్ 24 (సింగిడి): జనగామ గ్రామంలో బోరు తవ్వకం సమయంలో సుమారు మూడు అడుగుల మేర కుంగిపోవడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే బ్లాస్టింగ్‌ల వల్ల ఇళ్లు కంపిస్తున్నాయని, గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి గ్రామాన్ని సందర్శించి బాధితుల సమస్యలను తెలుసుకున్నారు. బోరు కుంగుబాటుకు గల కారణాలు, బ్లాస్టింగ్‌ల ప్రభావంపై సాంకేతిక నిపుణులతో సమగ్ర విచారణ చేపట్టాలని, నివేదికను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. గ్రామానికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి, అవసరమైతే పునరావాస కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రజలకు శాశ్వత పరిష్కారం లభించే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయం ప్రారంభం



మానకొండూర్, అక్టోబర్24(సింగిడి): మండల కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నూతన కార్యాలయాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నమల్ల చైతన్య, మానకొండూర్ మండల అధ్యక్షులు వేల్పుల సంపత్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్ హాజరయ్యారు. అదేవిధంగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి, జిల్లా మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు పిన్నింటి సంగీత రెడ్డి, పూదరి రాజేశ్వరి గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల సమస్యలపై పోరాడేందుకు, పార్టీ బలోపేతానికి ఈ నూతన కార్యాలయం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీని క్షేత్రస్థాయికి తీసుకెళ్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మానకొండూర్ నియోజకవర్గ కార్యదర్శి యం. డి. అతహర్, మహిళా అధ్యక్షురాలు యం. డి. సల్మా, వివిధ మండలాల అధ్యక్షులు ఎర్రవెల్లి మహేందర్ పటేల్ బెజ్జంకి, ఓల్లాల శ్రీనివాస్ గౌడ్ ఇల్లంతకుంట, గువ్వ అభిషేక్ ముదిరాజ్ గన్నేరువరం, వేణు కురుమ తిమ్మాపూర్, సందేల రంజిత్ శంకరపట్నం, కొలిపాక గౌతమి నిర్వహణ కార్యదర్శి, పొట్టాల సుధీర్ యూత్ అధ్యక్షులు, పున్నం రమేష్ విద్యార్థి విభాగం అధ్యక్షులు, గొల్ల సౌమ్య మహిళా అధ్యక్షురాలు, రామగిరి సాయికుమార్ యూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు నగునూరి శంకరయ్య, వేల్పుల ఐలయ్య యాదవ్, తాండ్ర అనిల్ తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కొత్త చేరికలు.. పాత కార్యకర్తల్లో అసంతృప్తి!

ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన వారికి గుర్తింపు ఏదీ?

ఇదే తీరు కొనసాగితే వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా నష్టం తప్పదు

కామారెడ్డి ప్రతినిధి, అక్టోబర్ 24 (సింగిడి): తెలంగాణ: రాజకీయాల్లో గెలుపోటములు సహజం. అధికారంలో ఉన్నప్పుడు నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఎంతో కీలకం. అయితే కాంగ్రెస్ పార్టీలోని కొన్ని నియోజకవర్గాల్లో కొత్తగా పార్టీలో చేరుతున్న నాయకులకు ప్రాధాన్యత పెరుగుతోందని, ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడిన పాత కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించడం లేదనే అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పార్టీ కష్టకాలంలో జెండా మోసిన వారిని పక్కనపెట్టి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారనే భావన కొందరు పాత కార్యకర్తల్లో బలపడుతున్నట్లు తెలుస్తోంది.

కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారిని విస్మరిస్తున్నారా?

పార్టీ అధికారంలో లేని సమయంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు పాత కార్యకర్తలు కృషి చేశారు. ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించడం, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లడం, నాయకులకు అండగా నిలవడం వంటి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించారు. పార్టీ గెలుపు కోసం వ్యక్తిగత ప్రయోజనాలను సైతం పక్కనపెట్టి పనిచేసిన కార్యకర్తలు చాలామంది ఉన్నారు. అయితే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారుతున్నాయనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోంది. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులకు పదవులు, బాధ్యతలు, రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తున్నారనే చర్చ పాత శ్రేణుల్లో అసంతృప్తికి కారణమవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. తమకు రాజకీయ గుర్తింపు లభిస్తుందనే ఆశతో పనిచేసిన కార్యకర్తలు, కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత పెరగడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్తవారికి స్వాగతం.. పాతవారికి గుర్తింపు కూడా అవసరమే!

రాజకీయ పార్టీల బలోపేతానికి ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు చేరడం సహజమైన పరిణామం. కొత్తగా చేరేవారిని ఆహ్వానించడం తప్పు కాదు. వారి అనుభవాన్ని, ప్రజాదరణను పార్టీ అభివృద్ధికి ఉపయోగించుకోవడం కూడా అవసరమే. కానీ అదే సమయంలో పార్టీ కోసం మొదటి నుంచి పనిచేస్తున్న కార్యకర్తల కృషిని గుర్తించడం కూడా నాయకత్వ బాధ్యత. కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత కల్పించే క్రమంలో పాత కార్యకర్తలను నిర్లక్ష్యం చేస్తున్నారనే భావన ఏర్పడితే, అది పార్టీ అంతర్గత ఐక్యతపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతరం సంబంధాలు కొనసాగించే కార్యకర్తలు దూరమైతే, పార్టీ సంస్థాగత బలం బలహీనపడే అవకాశం ఉంటుంది.

ఎమ్మెల్యేల తీరుపై కార్యకర్తల్లో చర్చ

కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక రాజకీయ పరిస్థితులు, నాయకుల మధ్య సమన్వయం, పదవుల కేటాయింపు వంటి అంశాలపై కార్యకర్తల్లో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో అన్ని వర్గాల నాయకులు, కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో విజయం సాధించడానికి పార్టీ నాయకత్వంతో పాటు క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తల సహకారం కూడా కీలకమనే విషయాన్ని విస్మరించకూడదు. రాజకీయంగా కొత్త సమీకరణాలు ఏర్పరచుకోవడం ఎంత ముఖ్యమో, ఇప్పటికే పార్టీకి అండగా ఉన్న శ్రేణులను కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం.

వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశముందా?

ఎన్నికల్లో అభ్యర్థుల విజయాన్ని నిర్ణయించే అంశాల్లో ప్రజాదరణతో పాటు పార్టీ కార్యకర్తల సమన్వయం, స్థానిక నాయకత్వంపై నమ్మకం, ప్రచార యంత్రాంగం కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో పాత కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగి, వారు పార్టీ కార్యక్రమాలకు దూరమైతే దాని ప్రభావం ఎన్నికల సమయంలో కనిపించే అవకాశం ఉందనే రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పుడున్న అసంతృప్తి తప్పనిసరిగా ఎన్నికల నష్టానికి దారితీస్తుందని చెప్పలేం. నాయకత్వం సమస్యలను గుర్తించి పరిష్కరించే విధానం, కార్యకర్తలకు కల్పించే ప్రాధాన్యత, స్థానికంగా నాయకుల మధ్య ఉండే సమన్వయంపైనే భవిష్యత్తు పరిణామాలు ఆధారపడి ఉంటాయి.

ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు అవసరం!

పార్టీ బలోపేతం కావాలంటే కొత్త నాయకులను చేర్చుకోవడంతోపాటు పాత కార్యకర్తల్లో విశ్వాసాన్ని పెంపొందించాలి. గ్రామ, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకోవాలి. పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు, బాధ్యతలు కల్పించాలి. పదవుల కేటాయింపులోనూ, పార్టీ కార్యక్రమాల్లోనూ సమన్యాయం పాటించాలి. రాజకీయాల్లో నాయకులు మారవచ్చు.. సమీకరణాలు మారవచ్చు.. కానీ పార్టీకి పునాది వేసే కార్యకర్తల ప్రాధాన్యత మాత్రం తగ్గకూడదు. కొత్తవారిని కలుపుకొని ముందుకు సాగడం ఎంత అవసరమో, పాతవారిని గౌరవిస్తూ వారి అనుభవాన్ని వినియోగించుకోవడం కూడా అంతే ముఖ్యం. మొత్తానికి.. కాంగ్రెస్ నాయకత్వం ముందున్న సవాలు కొత్త చేరికలను ప్రోత్సహించడం మాత్రమే కాదు, పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడిన కార్యకర్తల్లో నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కూడా. ఇప్పుడున్న అసంతృప్తిని సకాలంలో పరిష్కరించకపోతే భవిష్యత్తులో పార్టీకి రాజకీయంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాన్ని కొట్టిపారేయలేం. కార్యకర్తలే పార్టీకి బలమనే విషయాన్ని నాయకత్వం గుర్తించి, అందరినీ కలుపుకొని ముందుకు సాగుతుందా? అనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారుతోంది.



(రవీందర్ కామారెడ్డి సీనియర్ జర్నలిస్ట్)

ప్రతి రైతు వ్యవసాయ భూమిలో వ్యవసాయక్షేత్ర చెరువు నిర్మాణం చేపట్టాలి

కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 24(సింగిడి): నీటి సంరక్షణతో పాటు రైతులకు ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలోవీబీ జి రామ్ జి పథకం కింద కొనసాగుతున్న వ్యక్తిగత వ్యవసాయ క్షేత్ర చెరువు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో వ్యవసాయ క్షేత్ర చెరువు నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాల పెరుగుదలకు, పంటలకు అవసరమైన సాగునీటి లభ్యతకు వ్యవసాయ క్షేత్ర చెరువులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. నీటి లభ్యతను పెంచుకోవడంతో పాటు పంటల దిగుబడిని మెరుగుపరుచుకోవడానికి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన రైతు సింగిని భిక్షపతి తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో వ్యవసాయ క్షేత్ర చెరువు నిర్మాణం చేపట్టడాన్ని కలెక్టర్ అభినందించారు. ఇతర రైతులు కూడా ఈ విధంగా ముందుకు రావాలని సూచించారు. అనంతరం వ్యవసాయ క్షేత్ర చెరువు నిర్మాణ పనుల్లో పాల్గొంటున్న కూలీలతో కలెక్టర్ మాట్లాడి, పనుల పురోగతి, కల్పించిన పని దినాలు, పనులు ప్రారంభించిన తేదీ, కూలీల వేతనాల చెల్లింపుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు పరిమాణం, లోతు తదితర వివరాలను పరిశీలించారు.వీబీ జి రామ్ జి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామంలోని ఇతర రైతులు కూడా తమ వ్యవసాయ భూముల్లో వ్యవసాయక్షేత్ర చెరువుల నిర్మాణానికి ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, ఎంపీడీఓ సవిత రెడ్డి, ఏడీఏ అపర్ణ, గ్రామ సర్పంచ్ సాయాగౌడ్, సహకార సంఘం చైర్మన్ రాజాగౌడ్, మండల అధికారులు, ఉపసర్పంచ్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ కార్మికులకు సిమెంట్ వినియోగంపై అవగాహన సదస్సు

నిర్మాణ నాణ్యత, భవనాల దృఢత్వంపై తాపీ మేస్త్రీలకు అవగాహన

కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 24 (సింగిడి): శ్రీ రాజరాజేశ్వర ట్రేడర్స్ సిమెంట్ సలాక యాజమాన్యం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు, తాపీ మేస్త్రీలకు సిమెంట్ వినియోగం, నిర్మాణ నాణ్యతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణంలో ఉపయోగించే వివిధ రకాల సిమెంట్‌లు, వాటి వినియోగం, గోడల నిర్మాణం, కాంక్రీట్ పనుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలాక వినియోగం తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణంలో నాణ్యమైన సిమెంట్‌ను సరైన పద్ధతిలో వినియోగించడం ఎంతో ముఖ్యమని నిర్వాహకులు తెలిపారు. ఇంటి నిర్మాణం చేపట్టే సమయంలో పునాదుల నుంచి గోడల నిర్మాణం, కాంక్రీట్ పనుల వరకు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. నిర్మాణం దృఢంగా ఉండేందుకు అవసరమైన సాంకేతిక అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులు ఆధునిక నిర్మాణ పద్ధతులపై అవగాహన పెంచుకోవడం ద్వారా నాణ్యమైన ఇళ్ల నిర్మాణానికి తోడ్పడవచ్చని పేర్కొన్నారు. ఇటువంటి సదస్సులు కార్మికులకు ఉపయోగకరంగా ఉండటంతో పాటు నిర్మాణ రంగంలో నాణ్యతను మెరుగుపరిచేందుకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.

కార్మిక సంఘ నాయకుల హాజరు

ఈ అవగాహన సదస్సులో మండల ముఖ్య కార్మిక నాయకులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. శ్రీ రాజరాజేశ్వర ట్రేడర్స్ యాజమాన్య ప్రతినిధులు సురేష్, వినోద్ రెడ్డి, విఘ్నేశ్వర్ పాల్గొన్నారు. కార్మిక సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు మహామేస్త్రి మర్ల సాయిబాబు, మండల ఉపాధ్యక్షులు పెద్ద బాలి సాయిలు, కోశాధికారి దుర్గా సింగ్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కరీం, కార్యదర్శి గణేష్, సీనియర్ నాయకులు అవిటి బాబు, ప్రచార కార్యదర్శి శ్యామ్, కాంతారావు, చందు పాల్గొన్నారు. అలాగే సలహాదారులు పోచయ్య, శివాజీ, సత్యనారాయణ, ప్రతాప్, రామ్మోహన్‌రావు, బాలయ్య, సాయిలు, రాజు, హనుమంతుతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు కార్మిక నాయకులు, అధిక సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు హాజరయ్యారు. భవన నిర్మాణ కార్మికులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు నిర్మాణ రంగంలో నాణ్యతకు ప్రాధాన్యత కల్పించే లక్ష్యంతో ఈ అవగాహన సదస్సు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.





పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

పోలీసుల సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం

కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 24 (సింగిడి): పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ, పోలీసుల సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమనే సందేశాన్ని చాటుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని రక్తదానం ప్రాముఖ్యతను చాటిచెప్పారు.

ప్రాణాలను కాపాడటమే రక్తదానం లక్ష్యం

అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, రక్తదాన శిబిరాల నిర్వహణ ఎంతో అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు. రక్తదానం చేయడం ద్వారా ప్రమాద బాధితులు, శస్త్రచికిత్సలు చేయించుకునే రోగులు, ఇతర అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారికి ప్రాణదానం చేయవచ్చని తెలిపారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, వారి త్యాగాలకు నివాళిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సమాజ సేవలో భాగంగా రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

పాల్గొన్న రెడ్ క్రాస్ ప్రతినిధులు

ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా చైర్మన్ సంజీవరెడ్డి, దస్తిరామ్, కోశాధికారి గడ్డం రమేష్ రెడ్డి, స్టేట్ ఈసీ మెంబర్ జైపాల్ రెడ్డి, జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వెంకట్‌తో పాటు రెడ్ క్రాస్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పోలీసుల సహకారంతో నిర్వహించిన ఈ మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసేందుకు రెడ్ క్రాస్ ప్రతినిధులు, సంబంధిత సిబ్బంది కృషి చేశారు. రక్తదానం పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించడంతో పాటు, ఆపదలో ఉన్నవారికి సహాయం అందించాలనే సామాజిక బాధ్యతను ఈ కార్యక్రమం చాటిచెప్పింది.





2027 గోదావరి పుష్కరాలకు ముమ్మర ఏర్పాట్లు..

● రాష్ట్ర పుష్కరాల ప్రత్యేక అధికారి హనుమంతరావు

పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 24 (సింగిడి): 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందస్తు ప్రణాళికతో అవసరమైన పనులన్నీ చేపట్టాలని పుష్కరాల ప్రత్యేక అధికారి డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. శనివారం మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద పుష్కరాల ఏర్పాట్ల పురోగతిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధి, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు, రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా స్నానఘట్టాలు, రాకపోకల మార్గాలు, అవసరమైన ఇతర సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని తెలిపారు. చేపట్టాల్సిన పనులను గుర్తించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి, అవసరమైన అనుమతులు పొందుతూ పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం మంథనిలోని గౌతమేశ్వర స్వామి ఆలయం ఓంకారేశ్వర స్వామి ఆలయం సురబండేశ్వర స్వామి ఆలయం మహాలక్ష్మి ఆలయం లక్ష్మీనారాయణ ఆలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి,సీఈ దుర్గాప్రసాద్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ , తహసీల్దార్ ఆరిఫో ద్దీన్, ఈఓ రాజ్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఏడుపాయల సన్నిధిలో మాలల విరమణ



కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 24 (సింగిడి): నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారిని అంగరంగ వైభవంగా ఊరేగించి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోతురాజుల వేషధారణలు, మేళతాళాల నడుమ అమ్మవారి ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది. అనంతరం ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో భవానీలు మాల విరమణ కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి బాసం సంతోష్ మాట్లాడుతూ.. నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తితో మాలధారణ చేసిన భవానీలు నియమనిష్ఠలతో కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. అమ్మవారి ఊరేగింపును సంప్రదాయబద్ధంగా నిర్వహించి, నిమజ్జనం అనంతరం ఏడుపాయల దుర్గమ్మ సన్నిధిలో మాల విరమణ చేసినట్లు పేర్కొన్నారు. దుర్గామాత విగ్రహాన్ని అందించి విగ్రహదాతగా నిలిచిన సందీప్‌కు ఈ సందర్భంగా గురుస్వామి బాసం సంతోష్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరిస్తూ మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

మాలధారణలో పాల్గొన్న భవానీలు

ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గురుస్వామి బాసం సంతోష్‌తో పాటు వినయ్, సాయి ఈశ్వర్, రాజేష్ గౌడ్, సన్నీ, ఆకాష్, రాజ్‌కుమార్, కిట్టు తదితర భవానీలు పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో అందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని భక్తులు ప్రార్థించారు.

అంతర్ కళాశాలల బాలుర క్రీడాపోటీలు

ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ సుంకరి జ్యోతి

మాజీ మంత్రి హరీష్‌రావుతో వ్యాల హరీష్‌రెడ్డి కీలకభేటీ

- దసరా శుభాకాంక్షలతో పాటు నియోజకవర్గ రాజకీయాలు, ప్రజా సమస్యలపై చర్చ
- కార్మికుల సంక్షేమం.. ప్రాంత అభివృద్ధే ప్రధాన ఎజెండా!



రామగుండం, అక్టోబర్ 24 (సింగిడి): రామగుండం నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, సింగరేణి కార్మికుల సంక్షేమం, ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అంశాలపై బీఆర్ఎస్ నాయకత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రామగుండం నియోజకవర్గ నాయకుడు వ్యాల హరీష్ రెడ్డి.. పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ఆయన, అనంతరం నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను ఆయనతో చర్చించారు. సింగరేణి బొగ్గు గనుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు ఈ భేటీలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. పారిశ్రామిక రంగంలో కీలకమైన సింగరేణి కార్మికుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు, వారి సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరంపై చర్చించినట్లు తెలిసింది. పారిశ్రామిక ప్రాధాన్యం కలిగిన రామగుండం ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, స్థానికంగా నెలకొన్న సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలను కూడా వ్యాల హరీష్ రెడ్డి మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. స్థానిక రాజకీయ పరిణామాలు, ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధి కార్యక్రమాల అవసరంపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. రామగుండం నియోజకవర్గంలో ప్రజలకు సంబంధించిన అంశాలను పార్టీ రాష్ట్రస్థాయి నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడం ఈ భేటీకి ప్రాధాన్యతను సంతరింపజేసింది. సింగరేణి కార్మికుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి వంటి అంశాలపై నాయకుల మధ్య జరిగిన చర్చ స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

పరీక్షల భద్రతపై సీపీ ఉక్కుపాదం!

టీజీపీఎస్ పరీక్షా కేంద్రంలో క్షేత్రస్థాయి తనిఖీలు..
బందోబస్తుపై కమిషనర్ ప్రత్యేక పర్యవేక్షణ
విధుల్లో అప్రమత్తతే ప్రధానం.. నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలి
అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలి



గోదావరిఖని, అక్టోబర్ 24 (సింగిడి): టీజీపీఎస్ పరీక్షల నిర్వహణలో భద్రతా ప్రమాణాలను పకడ్బందీగా అమలు చేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులకు స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద నిరంతర నిఘా కొనసాగిస్తూ, ఎలాంటి అవాంఛనీయ పరిణామాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన టీజీపీఎస్ పరీక్షా కేంద్రాన్ని కమిషనర్ సందర్శించి, అక్కడి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణకు చేపట్టిన ముందస్తు చర్యలు, పోలీస్ బందోబస్తు, కేంద్రం పరిసరాల్లో భద్రతా పరిస్థితులపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. విధుల నిర్వహణలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకుండా, అనుమానాస్పద పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో భద్రతను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే స్పందించేలా సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. అదేవిధంగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని, భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలీస్ సిబ్బంది, ఇతర సంబంధిత విభాగాల మధ్య సమన్వయం కీలకమని పేర్కొంటూ, పరీక్షల నిర్వహణ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని కమిషనర్ ఆదేశించారు.

గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ హామీ

పాఠశాలకు ప్రహరీ గోడ మంజూరు..
వాటర్ ట్యాంకు, అంగన్‌వాడీ కేంద్రాల పునర్నిర్మాణానికి ప్రతిపాదన



కామారెడ్డి ప్రతినిధి అక్టోబర్ 24 (సింగిడి): గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈరోజు గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గ్రామ ప్రజలు ఎమ్మెల్యేనివాసంలో ఆయనను కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలు, అవసరాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణం కోసం గ్రామ ప్రజలు చేసిన విజ్ఞప్తికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రహరీ గోడను మంజూరు చేశారు. అలాగే గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు నిర్మాణం కోసం ప్రతిపాదనను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల పునర్నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సమర్పించారు. ఈ ప్రతిపాదనలపై స్పందించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, సంబంధిత పనులకు త్వరలోనే మంజూరు కల్పించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు గ్రామ ప్రతినిధులు తెలిపారు. పాఠశాలకు ప్రహరీ గోడ మంజూరు కావడం, తాగునీటి ట్యాంకు, అంగన్‌వాడీ కేంద్రాల పునర్నిర్మాణానికి సానుకూల హామీ లభించడంతో గ్రామంలో అభివృద్ధి పనులకు మార్గం సుగమమవుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ అవసరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్ తాగునీటి సంక్షోభంపై బీఆర్ఎస్ ఆగ్రహం

కన్నెపల్లి నుంచి గోదావరి జలాలను వెంటనే ఎత్తిపోయాలి
సమస్య పరిష్కరించకుంటే సీఎం నివాసాన్ని ముట్టడిస్తాం
బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హెచ్చరిక





జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/మహాదేవపూర్, అక్టోబర్ 24 (సింగిడి): హైదరాబాద్ నగరంలో తాగునీటి సమస్యను నివారించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టకపోతే హైదరాబాద్ ప్రజలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కె.పి. వివేకానంద గౌడ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకట రమణారెడ్డి సందర్శించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, గోదావరి జలాలు సముద్రంలోకి వృథాగా వెళ్తున్నాయని, వాటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలకు వినియోగించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు.

నీరు సముద్రంలోకి!

జూన్ నుంచి ఇప్పటి వరకు సుమారు 750 టీఎంసీలకు పైగా గోదావరి జలాలు సముద్రంలో కలిశాయని బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. కనీసం 250 టీఎంసీల నీటిని ఎత్తిపోసి ఉంటే జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వలు పెరిగేవని, భూగర్భ జలమట్టాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తగ్గేవని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌కు ఏడాది పాటు తాగునీరు అందించేందుకు సుమారు 10 టీఎంసీల నీరు సరిపోతుందని పేర్కొంటూ, అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదా?

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ, నీటి సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. హైదరాబాద్ ప్రజలను నీటి ఇబ్బందులకు గురిచేయకుండా ఇప్పటికైనా గోదావరి జలాలను ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. గతంలో కరోనా సమయంలోనూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు నీరు, విద్యుత్ వంటి అత్యవసర సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే కె.పి. వివేకానంద గౌడ్ మాట్లాడుతూ, జూలైలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి గోదావరి జలాలు సముద్రంలోకి వెళ్తున్న అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ముందుగానే హెచ్చరించినట్లు చెప్పారు. నీటిని ఎత్తిపోయాలని సూచించిన ఇంజినీర్లకు ముఖ్యమంత్రి బెల్టు ట్రీట్‌మెంట్ ఇస్తానని బెదిరించారని ఆయన ఆరోపించారు.

మూడు రోజులకోసారి కూడా నీరు రావడం లేదు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూడు రోజులకోసారి నీరు సరఫరా అవుతున్నా, పీడనం తక్కువగా ఉండటంతో అవసరాలు తీరడం లేదని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్నాయని వాటర్ బోర్డు అధికారులు చెబుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ముందస్తుగా తగిన నీటి నిల్వలు సమకూర్చుకుని ఉంటే హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి పరిస్థితులు తలెత్తేవి కావని అన్నారు. ప్రస్తుత నీటి ఇబ్బందులకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.

ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్‌లో అక్టోబర్ నెలలో రోజుకు సుమారు 7,000 వాటర్ ట్యాంకర్ బుకింగ్స్ నమోదవుతున్నాయని తెలిపారు. వేసవిని తలపించేలా ట్యాంకర్లకు డిమాండ్ పెరగడం నగరంలో నీటి కొరత తీవ్రతను సూచిస్తోందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లకు నష్టం కలిగించే పేలుడు ఘటనకు సంబంధించిన ఆరోపణలపై ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని, మరమ్మతులు కూడా చేపట్టలేదని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారం చేస్తూ తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నారని ముఖ్యమంత్రిపై ఆరోపణలు చేశారు.

కాళేశ్వరం నీటిని వినియోగించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే గంద్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా రాజకీయాలతో పక్కదారి పట్టించడం సరికాదన్నారు. విలువైన గోదావరి జలాలు సముద్రంలో కలుస్తుండగా, హైదరాబాద్ తాగునీటి సమస్య తీవ్రతరం కావడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయి నగర ప్రజలకు తాగునీటి భరోసా కల్పించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.



ఎన్‌టీపీసీ పీటీఎస్‌లో విషాదం..
అనారోగ్యంతో మహిళ మృతి!

36 ఏళ్ల రోహిణి మృతి.. కుటుంబంలో విషాదఛాయలు

తమ్ముడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు ప్రారంభం



గోదావరిఖని, అక్టోబర్ 24 (సింగిడి): ఎన్‌టీపీసీ పీటీఎస్ ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. అక్కడ నివాసముంటున్న దాడి రోహిణి (36) అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. ఈ ఘటనతో ఆమె కుటుంబంలో విషాదం నెలకొంది. గత కొంతకాలంగా రోహిణి కడుపునొప్పి, తలనొప్పి తదితర ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం పొందుతున్నట్లు సమాచారం. చికిత్స తీసుకున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో ఆమె మృతి చెందినట్లు తెలిసింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై మృతురాలి తమ్ముడు కరేటి రాహుల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకట్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

12వ రోజుకు చేరిన
ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమ్మె



వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 24 (సింగిడి) : వనపర్తి జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారంతో 12వ రోజుకు చేరుకుంది. దీర్ఘకాలంగా వైద్య ఆరోగ్యశాఖలో సేవలందిస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎన్‌హెచ్ఎం ఐక్య కార్యాచరణ సమితి (జాక్) నాయకులు డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంటలో ఎన్ హెచ్ ఎం జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు ఇవ్వాలని, ప్రతి సంవత్సరం ఐదు శాతం వేతన ఇంక్రిమెంట్లు మంజూరు చేయడంతోపాటు, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులకు లాయల్టీ బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు 180 రోజుల పాటు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

-వివిధ విభాగాల ఉద్యోగుల సంఘీభావం

జాక్ పిలుపుతో కొనసాగుతున్న సమ్మెలో పల్లె దవాఖానాల వైద్యులు, ఆర్‌బీఎస్‌కే వైద్యులు, ఓటీ అసిస్టెంట్లు, ఫార్మాసిస్టులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎన్‌సీడీ విభాగం ఉద్యోగులు, క్యాన్సర్ విభాగం సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, సెక్యూరిటీ, ఇతర సహాయక సిబ్బంది పాల్గొని సంఘీభావం తెలిపారు.

-ప్రభుత్వం స్పందించాలి..

12 రోజులుగా ఆందోళన కొనసాగుతున్నప్పటికీ తమ సమస్యలకు పరిష్కారం లభించలేదని జాక్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

మ్యూల్ బ్యాంకు ఖాతాలపై పోలీసుల నిఘా

29 కేసులు నమోదు.. 122 మంది నిందితుల గుర్తింపు: సీపీ గౌష్ ఆలం



కరీంనగర్, అక్టోబర్ 24(సింగిడి): సైబర్ మోసాలకు వినియోగిస్తున్న మ్యూల్ బ్యాంకు ఖాతాలపై కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 29 కేసులు నమోదు చేసి, 122 మంది నిందితులను గుర్తించినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. వీరిలో 89 మందిపై అరెస్టు లేదా చట్టపరమైన నోటీసుల ద్వారా చర్యలు తీసుకోగా, మరో 33 మందిపై చర్యలు పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులను ఇతరులకు ఇవ్వడం, కమీషన్ల ఆశతో తమ ఖాతాల ద్వారా లావాదేవీలు జరిపేందుకు అనుమతించడం నేరమని సీపీ హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లకు సహకరించే ఖాతాదారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అపరిచితులకు బ్యాంకు వివరాలు, ఒకసారి వినియోగించే రహస్య సంకేతాలు (ఓటీపీ) అందించవద్దని ప్రజలకు సూచించారు.

జాతీయ రహదారిపై భద్రతా ఏర్పాట్ల పరిశీలన

ప్రమాదాల నివారణకు నిరంతర నిఘా
తక్షణ సహాయక చర్యలు చేపట్టాలి, సీపీ గౌష్ ఆలం



కరీంనగర్, అక్టోబర్24(సింగిడి): వరంగల్--కరీంనగర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్--563)పై భద్రతా ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శనివారం పరిశీలించారు. కొత్తగట్టు వద్ద హైవే పెట్రోలింగ్ విభాగం, టోల్ ప్లాజాను సందర్శించి, నిఘా కెమెరాలు, నియంత్రణ గది పనితీరును సమీక్షించారు. ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణమే స్పందించి, క్షతగాత్రులకు సకాలంలో వైద్య సహాయం అందించాలని అధికారులకు సూచించారు. పెట్రోలింగ్ వాహనాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రమాద బాధితులను తొలి గంటలోనే ఆసుపత్రులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై నిఘా ఉంచాలని సూచించారు. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏసీపీ మాధవి, రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కేశవపట్నం ఎస్సై శేఖర్, జాతీయ రహదారి సంస్థ ప్రతినిధులు, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

నీటిని పొదుపు చేయాలి
ఇంకుడు గుంతలు నిర్మించాలి

31వ డివిజన్‌లో రూ.50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, అక్టోబర్24(సింగిడి): ప్రజలు నీటిని పొదుపుగా వినియోగిస్తూ, భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. శనివారం 31వ డివిజన్‌లో పర్యటించిన ఆయన, కార్పొరేటర్ సయ్యద్ ముఖద్దర్ హుస్సేన్ అలీతో కలిసి రూ. 50 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని 66 డివిజన్లలో రూ. 50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ సహకారంతో పట్టణ అభివృద్ధి నిధి పథకం కింద రూ. 840 కోట్ల నిధులు సాధించామని, వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన ప్రతిపాదనలు అనుమతుల కోసం పంపినట్లు వెల్లడించారు. నగరంలో వీధికుక్కల సమస్య పరిష్కారానికి జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ప్రారంభించామని, మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పశువుల యజమానులు వాటిని రోడ్లపై వదలకుండా సంరక్షించాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా అవసరమైనంత మాత్రమే వినియోగించాలని, ఇళ్ల వద్ద స్థలం ఉన్నవారు ఇంకుడు గుంతలు నిర్మించి భూగర్భ జలాల పరిరక్షణకు సహకరించాలని మేయర్ కోరారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

భూసారం కాపాడుకుంటేనే భవిష్యత్తులో పంటల దిగుబడి!

పెద్ద తండాలో 'ఖేత్ బచావో అభియాన్' పై రైతులకు అవగాహన
రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి.. సేంద్రియ సాగు పద్ధతులను ప్రోత్సహించాలి
మండల వ్యవసాయ అధికారి కురుమయ్య



వనపర్తి ప్రతినిధి, అక్టోబర్ 24 (సింగిడి): సాగుభూమి భూసారాన్ని పరిరక్షించుకుంటూ భవిష్యత్తులోనూ అధిక దిగుబడులు సాధించాలంటే రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని వనపర్తి మండల వ్యవసాయ అధికారి కురుమయ్య సూచించారు. శనివారం వనపర్తి మండలంలోని దత్తాయపల్లి పరిధిలోని పెద్ద తండా గ్రామంలో భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఖేత్ బచావో అభియాన్ (సాగుభూమి సంరక్షణ కార్యక్రమం)' లో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు.

-మోతాదుకు మించిన రసాయన ఎరువులతో నేల ఆరోగ్యానికి నష్టం

గత కొన్నేళ్లుగా వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందులను మోతాదుకు మించి వినియోగించడం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటోందని కురుమయ్య పేర్కొన్నారు. భూసారం తగ్గితే పంటల ఎదుగుదల, దిగుబడులపై ప్రభావం పడే అవకాశం ఉందని వివరించారు. రైతులు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు సాగు ఖర్చులను తగ్గించుకునే పద్ధతులపై దృష్టి సారించాలని సూచించారు.

-భూసారం పరిరక్షణకు ఈ పద్ధతులు పాటించాలి

రైతులు తమ పొలాల్లో భూసారాన్ని పెంపొందించుకునేందుకు పలు సూచనలు చేశారు. బాగా చివికిన పశువులు లేదా, గొర్రెలు లేదా, కోళ్ల ఎరువులు వాడకం పెంచాలని, పచ్చిరొట్ట ఎరువులు సాగు చేయడం అలవాటు చేసుకోవాలని, నేల పరీక్షల ఆధారంగా పంటకు అవసరమైన మోతాదులోనే ఎరువులు వాడాలని చెప్పారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వేప ఆధారిత కషాయాలు, ఇతర సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అనుసరించాలని పేర్కొన్నారు. ఒకే పంటను పదేపదే సాగు చేయకుండా పంట మార్పిడి పద్ధతిని పాటించాలని, వరి కొయ్యలు, ఇతర పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని, దీనివల్ల సేంద్రియ పదార్థాలు నేలలో చేరేందుకు తోడ్పడతాయని తెలిపారు.

-భూమిని కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత

ఆరోగ్యకరమైన భూమి ఉంటేనే ఆరోగ్యకరమైన పంటలు, మెరుగైన దిగుబడులు సాధ్యమవుతాయని వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. సాగుభూమి సంరక్షణను ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి గ్రామంలో ఉద్యమంలా కొనసాగించాలని రైతులకు పిలుపునిచ్చారు. 2026 అక్టోబర్ 22 నుంచి నవంబర్ 30 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు భూసార పరిరక్షణ పద్ధతులపై అవగాహన పెంచుకొని వాటిని తమ పొలాల్లో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్, నాయకులు రూప్‌సింగ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

జనరల్ న్యూస్ సింగిడి



వారంలో రూ.20.79 లక్షల కోట్ల నష్టం

ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ.887.65 కోట్లు..

డీఐఐ కొనుగోళ్లు.. రూ.3235.36 కోట్లు

స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో ట్రేడింగ్ రోజైన నష్టాల్లోనే ముగిసింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయంగా బ్రెంట్ ముడి చమురు బ్యారెల్ ధర 115 డాలర్లకు చేరడం, ఈక్విటీ మదుపర్లను కలవర పెట్టింది. విదేశీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 12 పైసలు తగ్గి 94.93 వద్ద ముగిసింది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.6.59 లక్షల కోట్లు తగ్గి రూ.451.83 లక్షల కోట్ల (4.76 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. గత శుక్రవారం ముగింపు విలువ రూ.472.62 లక్షల కోట్లతో పోలిస్తే, ఈవారంలో మదుపర్ల సంపద విలువ రూ.20.79 లక్షల కోట్లు తగ్గింది.

లాభాల్లోనే మొదలు..

క్రితం ముగింపు 73,249 పాయింట్లతో పోలిస్తే, 416 పాయింట్ల లాభంతో ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 73,665.64 వద్ద ఆరంభమైంది. క్రమంగా లాభాలు పోగొట్టుకుని నష్టాల్లోకి జారిన సూచీ, ఒక దశలో 72,452.37 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠానికి దిగివచ్చింది. చివరకు 125.56 పాయింట్ల నష్టంతో 73,123.83 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 87.65 పాయింట్లు కోల్పోయి 22600 వద్ద స్థిరపడింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 1,605.44 పాయింట్లు, నిఫ్టీ 546.15 పాయింట్లు నష్టపోయాయి. బీఎస్ఈలో 3,588 కంపెనీల షేర్ల నష్టాల్లోను, 838 కంపెనీల షేర్లు లాభాల్లో ముగిశాయి. 169 కంపెనీల షేర్ల ధరలో మార్పులేదు.

10 మినహా...: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 10 మినహా మిగతావి నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్ 3.21%, అదానీ పోర్ట్స్ 3.03%, ట్రెంట్ 2.13%, టెక్ మహీంద్రా 1.95%, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ 1.88%, ఇండిగో 1.78% చొప్పున నష్టపోయాయి. ఎటర్నల్ 3.97%, ఎల్‌అండ్‌టీ 1.25%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.19%, టీసీఎస్ 1%, అల్ట్రాటెక్ సిమెంట్ 0.83% లాభపడ్డాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో లోహాలు, స్థిరాస్తి, భారీ యంత్రపరికరాలు, యుటిలిటీస్, సర్వీసెస్, పీఎస్‌యూ బ్యాంక్, విద్యుత్ డీలాపడ్డాయి.

బజాజ్ జనరల్ ఇన్సూరెన్స్ తదుపరి మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓగా దీపక్ రెడ్డి పేరును సంస్థ ప్రకటించింది. ఐఆర్‌డీఏఐ అనుమతి అనంతరం 2027 ఏప్రిల్ 1 నుంచి ఈయన బాధ్యతలు చేపట్టనున్నారు. బజాజ్ ఫిన్‌సర్వ్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, స్టాండర్డ్ చార్టెడ్ బ్యాంక్ తదితర సంస్థల్లో ఆయన పనిచేశారు.

ఐపీఓ సమాచారం

బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్స్ ఐపీఓ ఈనెల 29న ప్రారంభమై నవంబరు 2న ముగుస్తుంది. ఇష్యూ ధర రూ.78– 82. ఎం కే సన్స్ ఫైన్ జ్యువెల్స్ ఐపీఓ ఈనెల 28న ప్రారంభమై 30న ముగియనుంది. ఇష్యూ ధర రూ.153–162. పరాస్ హెల్త్‌కేర్ రూ.1,800 కోట్ల ఐపీఓకు 2.23 రెట్ల అధిక స్పందన లభించింది.

లిస్టింగ్ కబుర్లు...

సహజానంద్ మెడికల్ టెక్నాలజీస్ షేరు ఇష్యూ ధర రూ.344తో పోలిస్తే, బీఎస్ఈలో 7% అధికంగా రూ.368.05 వద్ద ప్రారంభమైంది. చివరకు 9.94% లాభంతో రూ.378.20 వద్ద ముగిసింది. జెట్‌వెర్క్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ బిజినెస్ షేరు ఇష్యూ ధర రూ.151తో పోలిస్తే, బీఎస్ఈలో 5% అధికంగా రూ.159 వద్ద నమోదైంది. చివరకు 8.41% నష్టంతో రూ.138.30 వద్ద ముగిసింది. బోన్‌ఫిగ్‌లియోలి ట్రాన్స్‌మిషన్ షేరు ఇష్యూ ధర రూ.586 వద్దే బీఎస్ఈలో నమోదైంది. చివరకు 1.65% నష్టంతో రూ.576.35 వద్ద ముగిసింది.

ఏఐ రంగంలో ప్రస్తుత హడావుడి ఓ బుడగ: జోహో శ్రీధర్ వెంబు

ప్రస్తుత ఏఐ పెట్టుబడుల ట్రెండ్ ఓ బబుల్ అన్న శ్రీధర్ వెంబు.. ఏఐ మౌలిక సదుపాయాలపై భారీ పెట్టుబడులకు దూరంగా ఉంటామని వెల్లడి

ఏఐలో పరిశోధన, అభివృద్ధిపై పెట్టుబడులు కొనసాగిస్తామని స్పష్టీకరణ.. ఇతరుల డబ్బుతో భారీ వ్యాపారాలు చేసే పద్ధతి తమది కాదని వ్యాఖ్య

అమెరికన్ వెంచర్ క్యాపిటలిస్ట్ చమత్ పాలిహపిటియ పోస్ట్‌పై స్పందించిన వెంబు

ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ప్రస్తుత పెట్టుబడుల వాతావరణంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం 'ఏఐ'లో కనిపిస్తున్నది బూమ్ కాదని, అదొక "బబుల్" (బుడగ) అని అభివర్ణించారు. ఈ కారణంగా, తమ సంస్థ భారీ మౌలిక సదుపాయాలపై ఇప్పుడే పెట్టుబడులు పెట్టబోదని ఆయన స్పష్టం చేశారు. అమెరికన్ వెంచర్ క్యాపిటలిస్ట్ చమత్ పాలిహపిటియ 'ఎక్స్'లో చేసిన ఒక పోస్టుకు శ్రీధర్ వెంబు బదులిచ్చారు. ఏఐ కంపెనీల ఆదాయ నాణ్యతను చామత్ తన పోస్టులో ప్రశ్నించారు. ప్రస్తుతం ఏఐపై ఖర్చు చేస్తున్న వాటిలో అధిక శాతం నష్టాల్లో ఉన్న, వెంచర్ క్యాపిటల్ నిధులతో నడిచే కొన్ని కంపెనీలే నని ఆయన వాదించారు. ఈ నేపథ్యంలో వెంబు తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. "సాధారణంగా మేం ఇతరుల డబ్బుతో భారీ వ్యాపారాలు చేసే పద్ధతికి దూరంగా ఉంటాం. ఏఐలో మౌలిక పరిశోధన, అభివృద్ధి (ఆర్&డి) కోసం మేం పెట్టుబడులు పెడుతున్నాం. అయితే, డేటా సెంటర్లు, ప్రత్యేక హార్డ్‌వేర్ వంటి మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెట్టడానికి ఈ బుడగలాంటి వాతావరణం తగ్గేంత వరకు వేచి చూస్తాం" అని శ్రీధర్ వెంబు తన పోస్టులో పేర్కొన్నారు. శ్రీధర్ వెంబు వ్యాఖ్యలు ఏఐ విషయంలో జోహో భవిష్యత్ వ్యూహాన్ని స్పష్టం చేస్తున్నాయి. మార్కెట్ పరిస్థితులు స్థిరపడే వరకు భారీ ఖర్చులు చేయకుండా, ఏఐ పరిశోధన సామర్థ్యాలను పెంచుకోవడంపైనే దృష్టి సారిస్తామని ఆయన పరోక్షంగా సూచించారు. ఏఐ రంగంలోకి వెల్లువెత్తుతున్న భారీ పెట్టుబడులు స్థిరమైన రాబడిని ఇస్తాయా లేదా అనే అంశంపై టెక్ పరిశ్రమలో విస్తృతంగా జరుగుతున్న చర్చకు వెంబు వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి.



ఏఐ మోడళ్ల శిక్షణను పునఃప్రారంభించిన ఓపెన్‌ఏఐ

ఇకపై ఇంటర్నెట్ యాక్సెస్ లేకుండా ప్రత్యేక వాతావరణంలో శిక్షణ

భద్రతా లోపంతో గత నెలలో శిక్షణను తాత్కాలికంగా నిలిపివేత

ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిశోధనా సంస్థ 'ఓపెన్‌ఏఐ', తన అత్యంత శక్తిమంతమైన ఏఐ మోడళ్ల శిక్షణను పునఃప్రారంభించింది. గత నెలలో చోటుచేసుకున్న ఒక భద్రతాపరమైన ఉదంతం కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన ఈ ప్రక్రియను, ఇప్పుడు మరింత కఠినమైన భద్రతా చర్యలతో తిరిగి చేపట్టింది. ఇందులో భాగంగా, శిక్షణ సమయంలో ఏఐ మోడళ్లకు ప్రత్యక్షంగా ఇంటర్నెట్ సదుపాయం ఉండకూడదనే కీలక నిర్ణయం తీసుకుంది.

గత నెలలో ఓపెన్‌ఏఐకి చెందిన ఒక ప్రయోగాత్మక ఏఐ మోడల్, కాన్ఫిగరేషన్‌లోని లోపాన్ని ఆసరాగా చేసుకుని అనధికారికంగా ఇంటర్నెట్ యాక్సెస్ పొందింది. ఈ విషయాన్ని వెంటనే గుర్తించిన సంస్థ, ఆ ఉదంతాన్ని అదుపులోకి తెచ్చి భద్రతా వ్యవస్థలను పటిష్ఠం చేసేందుకు శిక్షణ ప్రక్రియను నిలిపివేసింది. అదనపు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసిన అనంతరం, అక్టోబర్ 1 నుంచి శిక్షణను, అంతర్గత వినియోగాన్ని తిరిగి ప్రారంభించింది.

నూతన నిబంధనల ప్రకారం, ఏఐ ఏజెంట్లకు బయటి నెట్‌వర్క్‌లతో ఎలాంటి సంబంధం లేని ప్రత్యేకమైన ఆఫ్‌లైన్ "డిజిటల్ శాండ్‌బాక్స్"లలో శిక్షణ ఇస్తున్నారు. దీనివల్ల అవి అనధికారికంగా బాహ్య వ్యవస్థలను యాక్సెస్ చేయకుండా నిరోధించవచ్చు. అంతేకాకుండా, "రెడ్-టీమింగ్" పేరిట సంస్థ ప్రత్యేక పరీక్షలను నిర్వహించింది. ఇందులో భాగంగా, ఏఐ ఏజెంట్లను నియంత్రిత వాతావరణం నుంచి బయట పడేలా ప్రేరేపించి పరిశీలించారు. ఈ పరీక్షల ద్వారా గతంలో గుర్తించని కొన్ని లోపాలు బయటపడగా, వాటిని కూడా సరిదిద్దినట్లు ఓపెన్‌ఏఐ వెల్లడించింది. ఈ పరీక్షల సమయంలోనే, విస్తృతంగా వినియోగించే "బ్రోట్లీ" అనే డేటా కంప్రెషన్ లైబ్రరీలో ఒక తీవ్రమైన లోపాన్ని ఓపెన్‌ఏఐ కనుగొంది. ఈ లోపాన్ని ఆసరాగా చేసుకుని హ్యాకర్లు, సాఫ్ట్‌వేర్‌లు నడుస్తున్న వ్యవస్థలపై కోడ్‌ను ఎగ్జిక్యూట్ చేసే ప్రమాదం ఉందని గుర్తించారు. ఈ విషయాన్ని బహిర్గతం చేసిన సంస్థ, దానికి సంబంధించిన ప్యాచ్‌లను రూపొందించడంలో సహకరించింది.కృత్రిమ మేధ సామర్థ్యాలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో, అవి తమను నియంత్రించే వ్యవస్థలలోని సాఫ్ట్‌వేర్ లోపాలను గుర్తించి, వాటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందనే ఆందోళనలు ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి. ఈ తరుణంలో ఓపెన్‌ఏఐ చేపట్టిన పటిష్ఠ భద్రతా చర్యలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.





ఇన్ఫోసిస్ లాభం రూ.7,823 కోట్లు

2026-27లో 20,000 ప్రాంగణ నియామకాలు

మధ్యంతర డివిడెండు రూ.26.. ఆదాయ అంచనాల్లో కోత

ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు ఏఐ ప్రాజెక్టులు కలిసివచ్చాయి. సెప్టెంబరు త్రైమాసికంలో రూ.7,823 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2025-26 ఇదే కాల లాభం రూ.7,364 కోట్ల కంటే ఇది 6.2% ఎక్కువ. ఇదే సమయంలో కార్యకలాపాల ఆదాయం రూ.44,490 కోట్ల నుంచి 10.2% వృద్ధితో రూ.49,244 కోట్లకు చేరుకుంది. భారీ కాంట్రాక్టులు 5.2 బి. డాలర్లకు జులై-సెప్టెంబరులో భారీ కాంట్రాక్టుల విలువ 5.2 బి. డాలర్ల (సుమారు రూ.49,000 కోట్ల)కు చేరుకుందని, ఇందులో ఏడేళ్ల కాలంలో చేపట్టే 2 బి. డాలర్ల (దాదాపు రూ.19,000 కోట్ల)కు పైగా విలువైన ఒక మెగా ఒప్పందం ఉందని ఇన్ఫోసిస్ సీఓఈ, ఎండీ సలీల్ పరేఖ్ పేర్కొన్నారు. కంపెనీ నిర్వహణ మార్జిన్‌లో పెద్దగా మార్పు లేకుండా 21 శాతంగా కొనసాగింది. 'రెండో త్రైమాసిక పనితీరు ఆధారంగా, మిగతా ఆర్థిక సంవత్సరానికి అంచనాలు సవరిస్తున్నాం. స్థిర కరెన్సీ పద్ధతిలో ఆదాయ వృద్ధి అంచనాను 1.5-3% నుంచి 1-2 శాతానికి తగ్గిస్తున్నాం. నిర్వహణ మార్జిన్ 20-22 శాతంగా కొనసాగొచ్చు' అని పరేఖ్ పేర్కొన్నారు. అమెరికా మార్కెట్లో గిరాకీ పుంజుకోకపోవడం ఆదాయ వృద్ధి అంచనాలు తగ్గించడానికి కారణమని విశ్లేషకులు అంటున్నారు.

పెరిగిన నికర ఉద్యోగాలు

కంపెనీ ఉద్యోగుల సంఖ్య నికరంగా 4,000 పెరిగిందని పరేఖ్ తెలిపారు. 'సమీక్షా త్రైమాసికంలో 8,000 మందిని కళాశాల ప్రాంగణాల నుంచి నియమించుకున్నాం. పూర్తి ఆర్థిక సంవత్సరంలో, 2025-26 స్థాయిలోనే 20,000 మందిని తీసుకోగలం. తొలి ఆరు నెలల్లో ఎక్కువ మందిని తీసుకున్నాం కాబట్టి, మిగతా నెలల్లో లక్ష్యానికి అనుగుణంగా ఎంపికలు జరుపుతా' అని వివరించారు. 2 బి. డాలర్లకు పైగా మెగా ఒప్పందం కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో 1% మేర ఆదాయ వృద్ధిని అందించగలదని ఆయన అంచనా వేశారు.

'అమెరికా నిబంధనలతో ప్రభావం పడదు'

'అమెరికాలో ఎక్కువమంది స్థానికులనే ఉద్యోగులను నియమించుకున్నాం. అందుకే గ్రీన్‌కార్డ్, ఇతర ఆంక్షల ప్రభావం మాపై లేదు. అక్కడి ఉద్యోగుల్లో స్థానికుల సంఖ్యను మరింత పెంచుతామ'ని పరేఖ్ వివరించారు.



పదేళ్ల కనిష్ఠానికి స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు

అధిక ధరల వల్లే.. జులై-సెప్టెంబరుపై కౌంటర్ పాయింట్

దేశీయంగా స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు ఈ ఏడాది జులై-సెప్టెంబరులో గణనీయంగా తగ్గి, పదేళ్ల కనిష్ఠానికి పరిమితమయ్యాయని మార్కెట్ పరిశోధనా సంస్థ కౌంటర్‌పాయింట్ పేర్కొంది. 2025-26 ఇదే కాలంతో పోలిస్తే, ఈసారి అమ్మకాలు 20% తగ్గాయని, అధిక ధరలే ఇందుకు కారణమని విశ్లేషించింది. మొబైల్ తయారీలో వినియోగించే చిప్‌సెట్ల ధరలు గణనీయంగా పెరగడంతో, ఏడాది కాలంగా సెల్‌ఫోన్ల ధరలను కంపెనీలు విడతల వారీగా పెంచిన సంగతి విదితమే. ఈ ఏడాది మొత్తంమీద కూడా స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు, గతేడాది కంటే 13% తగ్గొచ్చని నివేదిక అంచనా వేసింది.



పల్లె ప్రగతికి అభివృద్ధి బాట

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం: భట్టి విక్రమార్క

చింతకాని మండలంలో రూ.125 కోట్లకుపైగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ఖమ్మం ప్రతినిధి చింతకాని, అక్టోబర్ 24 (సింగిడి)

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామాల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి సదుపాయాలను మెరుగుపరుస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలంలో శనివారం డిప్యూటీ సీఎం పర్యటించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు పూర్తయిన పనులను ప్రారంభించారు. పొద్దుటూరు గ్రామంలో రూ.3.5 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం పనులకు, తిమ్మినేనిపాలెం గ్రామంలో రూ.8.25 కోట్లతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రామకృష్ణాపురం నుంచి కొత్తగూడెం మీదుగా దేవరపల్లి జాతీయ రహదారిని కలుపుతూ రూ.3 కోట్లతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు, రామకృష్ణాపురం నుంచి పెద్దగోపతి రోడ్డు వరకు రూ.50 కోట్లతో చేపట్టనున్న రహదారి విస్తరణ, బలోపేతం పనులకు శ్రీకారం చుట్టారు. కొదుమూరు గ్రామంలో వెంకటపాలెం నుంచి చింతకాని రోడ్డు వరకు రూ.60 కోట్లతో నాలుగు వరుసల రహదారిగా విస్తరించి, బలోపేతం చేయనున్న పనులకు కూడా డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. తిమ్మినేనిపాలెం ఎస్సీ కాలనీలో రూ.62 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను, గాంధీనగర్ ఎస్సీ కాలనీలో రూ.46 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు.



మెరుగైన రహదారుల వల్ల గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమవుతాయని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. నూతన విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణంతో పరిసర ప్రాంతాల్లో సరఫరా వ్యవస్థ మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పంపింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, అధికారులు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అభివృద్ధి పనుల ప్రయోజనాలు ప్రజలకు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొదుమూరు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ వేముల సతీష్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సన్న బియ్యం కిలో రూ.95

సెంచరీ దిశగా పరుగులు

ఎల్‌నినో బూచి చూపి వ్యాపారుల దందా..

వారంలో 25 కిలోల బ్యాగ్‌పై రూ.450 పెంపు.. రూ.9 వేలు దాటిన ప్రీమియం రకాలు

కృత్రిమ కొరత సృష్టిస్తున్నట్లు ఆరోపణలు.. మధ్యతరగతి ఫ్యామిలీ బడ్జెట్ తలకిందులు

జవహర్ నగర్ అక్టోబర్ 24 (సింగిడి)

హైదరాబాద్ నగరం తో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో, సన్న బియ్యం ధరలు సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో సతమతమవుతున్న ప్రజలకు బియ్యం రేట్లు మరింత భారంగా మారాయి. బహిరంగ మార్కెట్‌లో సూపర్ ఫైన్ రకం బియ్యం కిలో ధర రూ.90 నుంచి రూ.95 వరకు చేరగా.. సూపర్ ఫైన్ మీడియం రకం రూ.85 నుంచి రూ.90, ఫైన్ రకం రూ.78 నుంచి రూ.80 వరకు పలుకుతున్నది. ధరలు ఇలాగే పెరిగితే సన్న బియ్యం కిలో ధర రూ. 100కు చేరడానికి ఎంతో దూరంలో లేదనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

ఎల్ నినో ప్రభావం

మరోవైపు.. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వరి సాగు జిల్లాలో వేల ఎకరాలు తగ్గిందని, దిగుబడి గణనీయంగా తగ్గుతుందనే అంచనాల నేపథ్యంలో దీన్ని వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో బియ్యం నిల్వలు తగ్గుతున్నాయనే ప్రచారం ధరల పెరుగుదలకు మరింత ఆజ్యం పోస్తున్నది. ఇదే అదునుగా ఎల్‌నినో బూచి చూపి వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరల పెంచుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అయితే, కొత్తబియ్యం వచ్చే వరకు ఈ సమస్య తప్పదని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు.తల కిందులవుతున్న బడ్జెట్ సన్న బియ్యం ధరలు గత వారం రోజులుగాపెరుగుతున్నాయి. ఇటీవల 25 కిలోల బియ్యం బ్యాగ్ ధర రూ.2 వేలుగా ఉండగా.. శుక్రవారం నాటికి రూ.2,450కు చేరినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. హోల్‌సేల్ మార్కెట్లోనూ క్వింటాల్ బియ్యంపై సుమారు రూ.1,200 వరకు పెరుగుదల కనిపిస్తున్నది. హెచ్ఎంటీ, బీపీటీ, ఆర్ఎన్ఆర్ (తెలంగాణ సోనా) వంటి సన్న రకాలతోపాటు బ్రాండ్ము బట్టి రూ.8,400 నుంచి రూ.9,200 వరకు పలుకుతున్నది. అంటే మూడు నెలల్లోనే క్వింటాల్పై దాదాపు రూ.3 వేల వరకు పెరిగింది.హెచ్ఎంటీ, బీపీటీ, ఆర్ఎన్ఆర్ వంటి రకాల ధరలు భారీగా పెరిగాయి. జూన్లో క్వింటాల్ రూ.4,600 నుంచి రూ.5,500 మధ్య ఉన్న కొన్ని రకాల ధరలు ప్రస్తుతం రూ.7 వేల నుంచి రూ.8 వేల వరకు పలుకుతున్నాయి. కొన్ని ప్రీమియం రకాల ధరలు రూ.9 వేల మార్కును దాటాయి.





కృత్రిమ కొరత కొరత సృష్టిస్తున్న వ్యాపారులు

జిల్లాలో బియ్యం ధరల పెరుగుదలకు వ్యాపారులు ఎల్నినో ప్రభావం, వర్షపాతం లోటు, సాగునీటి కొరత, వరిసాగుపై అనిశ్చితి కారణాలుగా చూపుతున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు విస్తీర్ణం తగ్గడం, సన్న వడ్ల దిగుబడులు తగ్గి, భవిష్యత్తులో బియ్యం కొరత ఏర్పడుతుందనే ప్రచారం ధరలపై ప్రభావం చూపుతున్నది. మరోవైపు.. పాత ధాన్యం నిల్వలు తగ్గడం, కొత్త ధాన్యం పూర్తిగా మార్కెట్కు చేరకపోవడం కూడా ధరల పెరుగుదలకు కారణం అంటున్నారు. కొత్త ధాన్యాన్ని మిల్లింగ్ చేసిన వెంటనే సరఫరా చేయక పోవడంతో వ్యాపారులు జిమ్మిక్కులకు పాల్పడుతున్నారని, బియ్యం నిల్వలను పెంచుకుంటూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది.

ప్రీమియం రకాలపై కన్ను

నగరాలు, పట్టణాల్లో సన్నగా ఉండి, వండినప్పుడు గింజ నాణ్యతగా కనిపించే బియ్యానికి ఎక్కువ డిమాండ్ ఉంది. దీంతో జై శ్రీరామ్ వంటి ప్రీమియం రకాల ధరలను వ్యాపారులు భారీగా పెంచుతున్నారు. సాధారణ సన్న బియ్యం ధరలు పెరగడంతో తక్కువ ధరకు లభించే ప్రత్యామ్నాయ రకాల కోసం వినియోగదారులు వెతుకుతున్నారు.బహిరంగ మార్కెట్‌లో ధరల ఎక్కువ మొత్తంలో బియ్యం వినియోగించే కుటుంబాలు, హాస్టళ్లు, చిన్న హోటళ్లు, మెస్‌లపై భారం పడుతుంది. కొందరు హోల్ సేల్, మెస్ల నిర్వాహకులు రేట్లు పెంచడం ద్వారా ఈ అదనపు భారాన్ని వినియోగదారులపై మోపే అవకాశం ఉంది. మార్కెట్‌లో సరఫరాలను సమీక్షించి అక్రమ నిల్వలపై తనిఖీలు చేపట్టాలని, ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వాన్ని జిల్లాలోని ప్రజలు కోరుతున్నారు.

రిటైల్ మార్కెట్ ధరలు

రిటైల్ మార్కెట్లో ప్రస్తుతం ఫైన్ రకం బియ్యం కిలో రూ.80కి పైగా ధరలు వరకు అమ్ముతున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. నాణ్యత, బ్రాండ్, పాలిషింగ్, ప్యాకింగ్ను బట్టి ధరల్లో వ్యత్యాసం ఉంటున్నది. జై శ్రీరామ్ వంటి ప్రీమియం రకాల ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. దీంతో నెలనెలా బియ్యం కొనుగోలు చేసే మధ్యతరగతి కుటుంబాల బడ్జెట్ తలకిందులవుతున్నది.

మూడు నెలల్లో రూ.3 వేలు హైక్

సన్న బియ్యం ధరలు జూలై నుంచి క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ముఖ్యంగా ప్రీమియం రకం జై శ్రీరామ్ ధరలో భారీ మార్పు కనిపిస్తున్నది. జూన్లో క్వింటాల్ ధర రూ.5,600 నుంచి రూ.6,300 మధ్య ఉండగా.. ఆగస్టు నాటికి రూ.6,300కు చేరింది. అక్టోబర్లో నాణ్యత, ప్రీమియం రకాల ధరలు ఎగబాకుతున్నాయి.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం | Singidi | ఆదివారం 25-10-2026

కిచెన్ నిర్మాణ పనులను వేగవంతంచేయాలి

పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు కృషి

భవనంలో భద్రత ప్రమాణాలు పాటించాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల బ్యూరో, (సింగిడి): ప్రభుత్వ పాఠశా లల విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన,పోషక విలువ లతో కూడిన ఆహారం అందించేందుకు నిర్మిస్తున్న కమ్యూని టీ కిచెన్ భవనం పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారుల ను ఆదేశించారు. మల్దకల్ మండ లం కుర్తి రావుల్ చెరువు గ్రామంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ పనులను గురువారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి, పనుల పురో గతిని పరిశీలించా రు.ఈ సందర్భంగా వంటశాల నిర్మాణం, వంట యంత్రాల ఏర్పాటు, ఆహార పదార్థాల నిల్వకు అవసరమైన సదుపా యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులను వివ రాలు అడిగి తెలుసుకున్నారు.ఇంకా పూర్తి కావాల్సిన పనులను గుర్తించి, ఎలాంటి జాప్యం లేకుండా వాటిని త్వరితగ తిన పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యం, అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచ డంలో తెలంగాణ స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొ న్నారు. విద్యార్థులకు ప్రతి రోజూ నాణ్య మైన, పరిశుభ్రమైన,పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చే యాలని తెలిపారు. కమ్యూనిటీ కిచెన్ ద్వారా ఆహార తయారీ, నిర్వహణ సక్రమం గా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. వంటశాలలో ఏర్పాటు చేసిన యంత్రాలు సురక్షితంగా పనిచేసేలా,విద్యుత్ సదుపా యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన భద్ర త ఏర్పాట్లు చేయాల న్నారు. యంత్రాల నిర్వహణకు సంబం ధించి సిబ్బంది తగిన శిక్షణ,జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వంట చేసే ప్రదేశాలు, వంట పాత్రలు, ఆహార పదార్థాల నిల్వ ప్రాంతాలు, పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. సురక్షితమైన తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల వంటి మౌలిక వసతులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, అగ్నిప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వంటశాలల్లో పనిచేసే సిబ్బందికి ఆహార తయారీ,ఆహార భద్రత, వ్యక్తిగత పరిశుభ్రత, వంట పరికరాల వినియోగం, వంటశాలల నిర్వహణ పై తగిన శిక్షణ అందించాలని కలెక్టర్ సూచించారు. సిబ్బంది విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, విద్యా ర్థులకు నాణ్యమైన ఆహారం అందించేలా చూడాలని తెలిపారు. స్థానిక గ్రామాల వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, వంటశాల నిర్వహణపై తగిన శిక్షణ అందించా లన్నారు.కమ్యూనిటీ కిచెన్‌కు రాకపోకలు సులభంగా ఉండేలా అవసర మైన మౌలిక సదుపాయాలను కల్పించాల ని, వంటశాలకు అనుసంధా నంగా సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి పంచాయతీరాజ్ శాఖ అధికారులు అవసర మైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నిర్మాణ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,హెచ్ కే ఏం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస రావు,మల్దకల్ తహసీల్దార్ ఝాన్సీ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కళ్ళల్లో ఆనందం నింపిన విద్యార్థులు





వనపర్తి ప్రతినిధి, (సింగిడి):: వనపర్తి జిల్లా కేంద్రంలోని రేడియంట్ హైస్కూల్, తిరుమల హిల్స్ విద్యార్థులు దివ్యాంగుల కోసం విరాళాలు సేకరించి మానవత్వాన్ని చాటుకున్నారని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, పరవస్తు సొసైటీ స్టేట్ కో–ఆర్డినేటర్ గద్దె భాస్కర్ అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినం దన సభలో ఆయన ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు తమ పాకెట్ మనీ, ఇంటింటికి తిరిగి సేకరించిన ఆర్థిక సహాయాన్ని దివ్యాంగులకు అందించడం నిజంగా అభినందనీయమని అన్నారు. ఆర్థిక సహాయాన్ని చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు అందచేశారు. సమాజ సేవకు ముందుకొ చ్చిన విద్యారు లందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. పుస్తకాలకే పరిమితం కాకుండా మానవత్వాన్ని చూపిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మానవ సేవే మాధవ సేవ అని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కౌసల్య భాస్కర్, ప్రిన్సిపాల్ ఉప్పరి తిరుమలేష్, వైస్ ప్రిన్సిపాల్ బి.రాము, ఎకో క్లబ్ కన్వీనర్ శృతి, ఉపాధ్యాయులు రాహుల్, శాంతయ్య, శ్రీనివాస్, అఖిల్, పీఈటీ వెంకటేష్, మల్లేష్, ఖదిరున్నిసా, రామేశ్వరి, గీతా, రజిత, శ్వేత, సరోజ, సాత్విక, జరీనా, తల్లిదండ్రులు, విద్యార్థులు, సాహితీ కళా వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు

రావూస్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

వనపర్తి ప్రతినిధి,(సింగిడి): వనపర్తి పట్టణంలోని రావూస్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని శనివారం ఎంబి ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి నరేందర్ కుమార్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఇ.రాం కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో యాజమాన్య సభ్యులు ఎ.శ్రీనివాస్, కె. శ్రీనివాసులు, పి.అమరేందర్ రెడ్డి, బి. రమేష్‌రెడ్డి, కె.నరేందర్ రెడ్డి లు పాల్గొన్నారు.విద్యార్థిని, విద్యార్థినులు అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించి ఫ్రెషర్స్ పార్టీని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా కొలరాడో స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ నార్త్ అమెరికా తెలుగు సొసైటీ డైరెక్టర్ సాంచి ప్రసాద్, పలుస హాజరై ఫస్ట్ ఇయర్ టాప్ ర్యాంకర్స్ కు, పేద విద్యార్థులకు పారితోషిక బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు

జన గణనలో తప్పులు దొర్లకుండా నిర్వహించాలి

రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్



నల్లగొండ ప్రతినిధి, (సింగిడి):జనగణనలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. గురువా రం ఆయన ముఖ్య ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలోజన గణనపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా , డివిజనల్ స్థాయి అధికారులు,చార్జ్ ఆఫీసర్లకు (తహసీల్దార్లు), అదన పు చార్జ్ ఆఫీసర్లు (ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు) రెండు రోజుల శిక్షణా తరగతుల కార్యక్రమంలో పాల్గొన్నా రు. మాట్లాడుతూ జన గణన రెండో దశ నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్, విధివిధానాలు మరియు అధికా రుల బాధ్యతల గురించి వివరించారు.జన గణన రెండో దశను 2027, జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. స్వీయ గణన (Self Enumeration): 2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు, జన గణన 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహించడం జరుగుతుందని, అలాగే 2027 ఫిబ్రవరి 28 న రాత్రి ఇళ్లు లేని వారిని గణించడం జరుగుతుందని, రివిజనల్ రౌండ్ (Revision Round): 2027 మార్చి 1 నుంచి మార్చి 5 వరకు నిర్వహించడం జరుగుతుందని, జన గణనలో భాగంగా ఎన్యుమే ంటర్లు ప్రతి గృహ యజమానిని సంప్రదించి మొత్తం (40) ప్రశ్నలకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని,ప్రజలు ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని అందించి జనాభా గణన విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించా లని కోరారు. జనాభా గణన ప్రక్రియను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, డి ఆర్ వో దశరథ, సిపిఓ శ్రీనివాస్ నాయక్, హైదరాబాద్ నుండి ట్రైనర్లు ఏ.వినయ్,గీత లు హాజరయ్యారు.

చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి అనుసరణీయం





ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్చెరు, (సింగిడి):తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ పోరాటం నేటి తర లకు అనుసరణీయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ జయం తి పురస్కరించుకొని.. పటాన్చెరు డివిజన్ పరిధిలోని రజక సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ కీలక పాత్ర పోషించారని అన్నారు. నేటి తరానికి వారి చరిత్రను తెలిపేలా మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నా మని తెలిపారు. ఐలమ్మ స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమం సాగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, రజక సంఘం అధ్యక్షులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు

కలెక్టర్ ప్రతీక్ జైన్

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్-2026పై సమీక్ష



సంగారెడ్డి,ప్రతినిధి, (సింగిడి): ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వ హించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అ-ర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు తో కలిసి ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పురోగతిపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుం డా నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, గడువులను తప్పనిసరిగా పాటిస్తూ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితాకు సంబంధించి ప్రజల నుంచి అందే ప్రతి క్లెయిమ్, అభ్యంత రాన్ని నిర్దేశిత ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియ నిబంధనల ప్రకారం సక్ర మంగా జరిగేలా చూడాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నవంబర్ 5వ తేదీలోగా పూర్తి చేసి, నవంబర్ 9న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ వెల్లడించారు. ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ పరిధిలోని ఓటరు జాబితాలను పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు, తప్పులు లేదా సూచనలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను సమన్వయంతో నిర్వ హించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు ఉండేలా ఎన్నికల జాబితా ఖచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికా రులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత

భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

రబీలో వరి సాగు చేయవద్దని అవగాహన కల్పించాలి

తాగునీటి అవసరాలకు జూరాల నీటిని నిలువ ఉంచాలి

కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల బ్యూరో, (సింగిడి): నీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేసి, పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పై సంబంధిత అధికారు లతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా మండ లాల పరిధిలో చేపట్టాల్సిన భూసేకరణపై క్షుణ్ణంగా అధికారులతో మాట్లాడారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభమై చాలా ఏళ్లవుతున్నందున భూసేకరణ ఆలస్యం చేయడం తగదని చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు ముందుకెళ్లా లన్నారు. అవార్డు పూర్తయిన రైతులకు ఆలస్యం చేయకుండా సకాల లో డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూరాల రిజర్వా యర్ చుట్టుపక్కల పొలాలు ఉన్న రైతులు రబీలో వరి సాగు చేయకుం డా ముందుగానే గ్రామసభలు నిర్వహించి అవగాహన కలిగించాల న్నారు. అనధికారికంగా మోటర్లు పెట్టి నీళ్లు పారించుకునే వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని జూరాల రిజర్వాయర్లో తగినంత నీటిని నిలువ చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. రబీలో రైతులు ఎట్టి పరిస్థితుల్లో వరి సాగు చేయవద్దని సూచించారు. తమ బోరు, బావుల్లో నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమో హన్, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాస రావు, సర్వే ఏడి నూకరాజు, ఇరిగేషన్ ఈఈ లు శ్రీనివాసులు, సంజీవ్ ప్రసాద్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



సంగారెడ్డి (సింగిడి): తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్-II పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో 24.10.2026న నిర్వహించనున్నకంప్యూటర్ ఆధారిత రిక్రూట్‌మెంట్ టెస్ట్ (జడీRT) నేపథ్యంలో, రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రా న్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలి ంచారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రం వద్ద చేపట్టనున్న పోలీసు బందోబస్తు, అభ్యర్థుల రాకపోకల మార్గాలు, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న భద్రతా చర్యలను సమీక్షించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. పరీక్షా నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయా లని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ఇన్స్పూర్ ఇన్‌స్పెక్టర్, భానూర్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, మహేష్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావ్, గీతం యూనివర్సిటీ యాజమాన్యం వర్మ, సతీష్ తదితరులు ఉన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుతో కేసీఆర్ కుటుంబం లక్ష కోట్ల దోపిడి

వచ్చే వారంలో మాదవనగర్ ఆర్ వోబి అంశంపై ఆందోళన చేపడుతామని

పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్



నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి): కాళేశ్వరం ప్రాజెక్టుతో కేసీఆర్ కుటుంబం లక్ష కోట్ల దోపిడికి పాల్ప డ్డారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపిం చారు. గురువారం జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాల యంలో ఏ ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ కేంద్ర జలశక్తి మంత్రి పార్లమెంట్ లో సుమారు రూ.లక్ష కోట్లు నీటిపాలయ్యాయని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఒక ప్రభుత్వం నిర్మాణంలో అవకతవకలకు పాల్పడితే మరో ప్రభుత్వం లోపాలను సరిదిద్దడంలో నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తొలుత అనుకున్న డిజైన్లకు, తర్వాత అమలు చేసిన విధానాలకు మధ్య తేడాలు న్నాయని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. జియోటెక్నికల్ అధ్యాయనాలు, నాణ్యత ప్రమాణాలు, నిర్మాణ పద్ధతులపై అనేక ప్రశ్నలు తలెత్తాయని చెప్పారు. 2023లోనే బ్యారేజీ ల్లో సమస్యలు బయటపడినప్పుడు తగిన మరమ్మత్తులు చేపట్టి ఉంటే పరిస్థితి ఇంత తీవ్రంగా మారేది కాదన్నారు. అనాటి ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమి చ్చిందని విమర్శించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులు అప్పట్లోనే పరిశీలించి, మరమ్మత్తులు, పునరుద్దరణ చర్యలు చేపట్టాలని సూచించిన విషయాన్ని ఎంపీ గుర్తు చేశారు. అయినప్పటికీ సరైన సమయంలో చర్యలు తీసుకలేదని ఆరోపించారు. ప్రకృతి వైపరీత్యాలు ఎవరి చేతుల్లోనూ ఉండవని, అయితే వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు, పటిష్టమైన నీటిపారుదల వ్యవస్థలు అవసరమ ని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో సాగునీటిరంగంతో పాటు వైద్యం, గృహ నిర్మాణం, వ్యవసాయం, ఉపాధి రంగాలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. పంటల సాగును నిలిపి వేయాలని సూచించే ముందు రైతులకు ఎకరాకు రూ. 50 వేల చొప్పున నష్టపరిహారం ప్రకటించి చెల్లించాలన్నారు. పంటల ప్రణాళిక, సాగునీటి నిర్వహణ, పాత ప్రాజెక్టుల మరమ్మత్తులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. నిజామాబాద్ లో కీలకమైన మాదవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై ఎంపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2024 అక్టోబర్ 22న అదనపు అంచనాలు, డిజైన్ మార్పులకు సంబంధించిన ప్రతిపాదనలు పంపినప్పటికీ ఆర్థిక అనుమతుల విషయంలో జాప్యం జరుగుతుందని తెలిపారు. బ్లాక్ సాయిల్ కారణంగా పునాది డిజైన్ లో మార్పులు చేయాల్సి రావడంతో సుమారు రూ. 9 కోట్ల అదనపు వ్యయం అవసరమైందని వివరించారు. ఈ అంశంపై సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడవని, రోడ్లు, భవనాల శాఖ మంత్రితోనూ చర్చించినట్లు చెప్పారు. అయినప్పటికీ పనులు ముందుకు సాగకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. బిల్లులు పెండింగ్ లో ఉండటం, నిధుల విడుదలలో జాప్యం, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో మిగిలిన పనులు పూర్తి కాకపోవడం సమస్యగా మారాయని పేర్కొన్నారు. అర్సపల్లి ఆర్వోబి పనులు, భూ సేకరణ, పెండింగ్ బిల్లులు, మాదవనగర్ నిర్మాణ పురోగతిపై అధికారులు తక్షణమే స్పందించాలని అర్వింద్ కోరారు. రైల్వేశాఖకు సంబంధించిన పనులు పూర్తయిన చోట రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని పనులే మిగిలాయని చెప్పారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలియజేస్తామని, వచ్చే వారం మాదవ నగర్ ఆర్ వోబి అంశంపై ఆందోళన చేపడుతామని హెచ్చ రించారు. బోధన్ ఫ్లైఓవర్లు, ఇతర ఆర్ వోబిల నిర్మాణంలో ప్రతిపాదనలు, అనుమతులు, నిధుల విడుదల వేగవంతం కావాలని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప నులు పూర్తి చేయాలని సూచించారు. బీజేపీ ప్రభుత్వం వస్తే పసుపు క్వింట్ కు రూ. 50 వేల ధర సాధించి చూపిస్తామని గతంలో హామీ ఇచ్చినట్లు ఎంపీ అరవింద్ పేర్కొన్నారు. అవసరమైతే బాండ్ పేపర్ పై రాసి ఇస్తానని కూడా చెప్పినట్లు గుర్తు చేశారు. పసుపు రైతుల ప్రయోజనాల కోసం తన హామీకి కట్టుబడి ఉన్నానని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు స్రవంతిరెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మట్టిలో మాణిక్యాలకు ఘన సన్మానం

నీట్, ఎన్ఐటీ ప్రవేశాల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందనలు

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దాపురం దుర్గయ్య



సంగారెడ్డి ప్రతినిధి (సింగిడి): కష్టపడి చదివి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి నీట్, ఎన్ఐటీ ప్రవేశాల్లో సీట్లు సాధించిన విద్యార్థులను ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పోతిరెడ్డిపల్లి జెడ్పీ హెచ్ఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులను శాలువాలు, మెమెంటోలు, పూలమాలలతో సత్కరించి అభినం దించారు. కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెద్దాపురం దుర్గయ్య మాట్లాడుతూ, ఎన్నో కష్టాలను అధిగమించి పట్టుదలతో చదివి ఉన్నత స్థాయి ప్రవేశ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నిజమైన 'మట్టిలో మాణిక్యాలు' అని అన్నారు. ఇలాంటి ప్రతిభావంతులను ప్రోత్సహించడం, సన్మానించడం తమ సంఘానికి ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం నీట్, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ స్థాయి ప్రవేశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సంఘం ఆధ్వర్యంలో సన్మానిస్తామని తెలిపారు. విద్యార్థులు ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవాన్ శు భాన్ సింగ్ మాట్లాడుతూ, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కులు, రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్న త శిఖరాలకు చేరుకోవాలని సూచించా రు. ఉన్నత విద్యను పూర్తి చేసి తాము వచ్చిన సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రొఫెసర్, యూరాలజిస్ట్ డాక్టర్ ఆనంద్ మాట్లాడుతూ, కష్టపడి చదివితే జీవితంలో మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. విద్యార్థులు ఓర్పు, క్రమ శిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. విలా సాలు, ఆడంబరాలకు దూరంగా ఉంటూ వృత్తిలో నైపుణ్యం సాధించి మంచి వైద్యులుగా గుర్తింపు పొందడంతో పాటు సమాజానికి సేవ చేయాలని కోరారు. వృత్తిపరంగా ఎలాంటి సందేహాలు ఉన్నా భవిష్యత్తులో తనను సంప్రదించవచ్చని తెలిపారు. హోప్ న్యూరో హాస్పిటల్ డైరెక్టర్, సర్జన్ డాక్టర్ కృష్ణమూర్తి మాట్లా డుతూ, ప్రణాళికాబద్ధంగా చదివి సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తుల

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 25-10-2026

ఎల్‌నినో వేళ.. యాసంగిలో వరికి దూరంగా ఉండండి

ఆరుతడి పంటలతోనే అధిక లాభాలు

నీటి పొదుపుపై వ్యవసాయ శాఖ సూచనలు

మండల వ్యవసాయ అధికారి పైడితల్లి



సుల్తానాబాద్, (సింగిడి): ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యం లో రాబోయే యాసంగి సీజన్‌లో రైతులు నీటి లభ్యతను బట్టి పంటలు ఎంచుకోవాలని మం డల వ్యవసాయ అధికారి సూచించారు. నీటి వినియోగం అధికంగా ఉండే వరికి బదులుగా నువ్వులు, పెసర, మినుము, శనగ, వేరుశన గ, జొన్న, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సుల్తానా బాద్ మండల వ్యవసాయ అధికారి పైడితల్లి కోరారు.

ఆదా చేసే సాగు పద్ధతులు

మొక్కజొన్న, జొన్నపంటల్లో జోడు సాళ్ల పద్ధతి పాటించడం ద్వారా నీటిని ఆదా చేయడం తోపాటు అంతర పంటలతో అదనపు ఆదా యం పొందవచ్చు. వరి కోతల అనంతరం నేలలో తేమ ఉన్నప్పుడే దున్నకుండా నేరుగా పంటలు విత్తే జీరో టిల్లేజ్ విధానంతో పెట్టు బడి తగ్గించుకోవచ్చు. పప్పుధాన్యాల్లో విత్తన శుద్ధి, సకాలంలో ఎరువుల వినియో గం, చీడపీడల నివారణ చర్యలు చేపట్టాలని సూచి ంచారు. కీలక దశల్లో అవసరమైనంత మేరకే నీరు అందిస్తూ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా రైతులు ప్రణాళి కాబద్ధంగా సాగు చేయాలని వ్యవసాయ శాఖ కోరింది.

సింగరేణి సింహ గర్జన విజయంపై కేటీఆర్‌కు శుభాకాంక్షలు



పెద్దపల్లి, (సింగిడి): గోదావరి ఖనిలో నిర్వహించిన బీఆర్ఎస్ 'సింగరేణి సింహ గర్జన' సభ విజయవంతమైన సంద ర్భంగా పెద్దపల్లి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి, దాసరి ప్రశాంత్ రెడ్డి హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సభ విజయ వంతం కావడానికి కృషి చేసిన పెద్దపల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలను కేటీఆర్ అభినందించారు. ముఖ్యంగా దాసరి ప్రశాంత్ రెడ్డి పోషించిన పాత్రను ప్రశంసిం చారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో నాయకులు, కార్యకర్తల ఐక్యత, సమన్వయం, నిబద్ధత కీలకమని పేర్కొన్నారు.

సుల్తానాబాద్ శివాలయాన్ని సందర్శించిన దేవాదాయ శాఖ ఈఓ!

ఆలయ అభివృద్ధి, నిర్వహణ అంశాలపై కమిటీ చైర్మన్‌తో చర్చ



సుల్తానాబాద్, (సింగిడి): సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శివాలయాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వ హణాధి కారి (ఈఓ) సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ అల్లంకి సత్యనారాయణతో ఆలయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఆలయ నిర్వహణ, అభివృద్ధికి సంబంధించిన విషయాలను చర్చించినట్లు తెలిసింది. శివాలయ సందర్శనతో ఆలయానికి సంబంధించిన అంశాలపై అధికారులు, కమిటీ ప్రతినిధుల మధ్య చర్చకు అవకాశం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో వేదపండితులు వల్లకొండ మహేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులతో ప్రజలకు ఇక్కట్లు వద్దు

ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



మంచిర్యాల, (సింగిడి): అభివృద్ధి పనులు చేపట్టడం ఎంత ముఖ్యమో.. అవి పూర్తయ్యే వరకు ప్రజలకు ఇబ్బందులు కలగకుం డా చూడటమూ అంతే ముఖ్యం. బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా రాకపోకలకు ఆటంకం ఏర్పడితే నిత్యం ప్రయాణించే ప్రజలు, వాహన దారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ముఖ్యంగా పనులకు వెళ్లేవారు, విద్యార్థులు, అత్యవసర ప్రయాణాలు చేసేవారికి ఇబ్బందులు తలెత్తకు ండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. ఈ నేపథ్యంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాళ్లవాగు బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రత్యామ్నా య మార్గం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అధికారులను ఆదేశించారు. రాళ్లవాగు బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు కొనసాగుతున్నసమయంలో ప్రజలు, వాహనదారులు రాకపోక లకు ఇబ్బందులు ఎదుర్కోకుండా తాత్కాలికంగా మట్టి రహదారిని ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులకు సూచించా రు. నిర్మాణ పనుల వల్ల రాకపోకలకు అంతరాయం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. నిర్మాణ పనులు వేగంగా సాగడంతోపాటు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయ రహదారి అందుబాటులో ఉంటే ప్రయాణికులకు ఊరట కలగనుంది. ఈ కార్యక్రమంలో మేయర్ ధర్ని మధుకర్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష్, మంచిర్యాల జిల్లా ఆర్జీపీఆర్ఎస్ అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, సంబంధిత అధికారులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గని కార్మికుల సమస్యలపై కేటీఆర్ దృష్టి



మంచిర్యాల, (సింగిడి): సింగరేణి బొగ్గు గని కార్మికుల సమస్యలు.. సంస్థలో నెలకొన్న పరిస్థితులు.. కార్మికుల ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంతానికి చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో టీబీజీకెఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ పాల్గొన్నారు. సింగరేణి సంస్థ తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించడం తోపాటు వేలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తోంది. బొగ్గు ఉత్పత్తి నుంచి సంస్థ అభివృద్ధి వరకు కార్మికుల శ్రమ ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో కార్మికుల సమస్యలు, వారి హక్కులు, సంక్షేమ అంశాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. సింగరేణి ప్రాంత ప్రజలు, కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై పార్టీ నాయకత్వం సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సింగరేణి ప్రాంత నాయకులు, కార్మిక సంఘం ప్రతినిధులు ఒకే వేదికపై సమావేశం కావడం సంస్థకు సంబంధించిన అంశాలపై పార్టీ సమన్వయానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు సూచిస్తోంది. కార్మికుల సమస్యలపై పార్టీ ఎలాంటి కార్యాచరణ రూపొందిస్తుంది? వారి ప్రయోజనాల పరిరక్షణకు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుంది? అన్న అంశాలపై ఆసక్తి నెలకొంది. సమావేశంలో పాల్గొన్న నడిపెల్లి విజిత్ కుమార్‌సహా ఇతర నాయకుల పాత్ర, తదుపరి కార్యాచరణపై సింగరేణి ప్రాంతంలో చర్చకు అవకాశం ఉంది.

కౌటాల ఎమ్మార్సీలో కొమురం భీం జయంతి వేడుకలు



కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి): ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 'జల్–జంగల్–జమీన్' నినా దంతో పోరాడిన అమరవీరుడు కొమురం భీమ్ ఆశయాలు భావిత రాలకు ఆదర్శమని పలువురు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కొమురం భీమ్ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని కౌటాల మండల కేంద్రంలో విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ)లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులను కాపాడేం దుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ ంలో కౌటాల మండల విద్యాధికారి గొడం నానాజీ, ముత్తంపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గావుడే హనుమంతు, చింతలమా నపల్లి మండల విద్యాధికారి జయరాజ్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి నైతం సాయినాథ్, మండల అధ్యక్షుడు మడావి పోచాని, ఉపాధ్యక్షుడు పెందోర్ అశోక్, ఉపాధ్యాయులు మడావి రాములు, శివాజీ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా పండగ సాయన్న జయంతి వేడుకలు

పాల్గొన్న జిల్లా ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్



నిర్మల్ ప్రతినిధి, (సింగిడి): కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురువారం బహుజన సంక్షేమ పోరాట వీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో జిల్లా ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్ పాల్గొన్నారు. ముందుగా అధికారులు, ముదిరాజ్ సంఘ నాయకులతో కలిసి పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బహుజనుల అణిచివేత పై ఆనాటి కాలంలో దొరలు, భూస్వాములు, నిజాం నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న గొప్ప పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఆయనను మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం తొలిసారిగా పండుగ సాయన్న జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. ఇలాంటి మహనీయుల జీవిత విశేషాలు నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలిపారు. పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ, నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లలో, ఉద్యమాల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న అని కొనియాడారు. తెలంగాణ రాబిన్ హుడ్ గా సుపరిచితుడైన సాయన్న ప్రజలను దోచుకుంటున్న దొరలు, దేశముఖ్‌లు, అధికారులు, సంపన్నుల ఆస్తులను తీసుకొని పేదలకు పంచిపెట్టాడని తెలిపారు. నాటి నిరంకుశ నిజాం అధికారులను ప్రశ్నించి, వారిని ఎదిరించి బహుజన రాజ్యాన్ని స్థాపించడానికి ప్రయ త్నించాడని వివరించారు. పండుగసాయన్నజయంతి వేడుకలను ప్రభు త్వం అధికారికంగా నిర్వహించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ జయంతి వేడుకలలో బిసి సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ అధికారి దయానంద్, ఉపాధి కల్పన శాఖ అధికారి విజయలక్ష్మి, కార్మిక శాఖ అధికారి రాజలింగం, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ముదిరాజ్ కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, లు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకపోతే రైస్ మిల్లుల ఆస్తులు, బ్యాంకు ఖాతాలు సీజ్!

డిఫాల్టర్ మిల్లర్లకు కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరిక

రెండు, మూడు రోజుల్లో బకాయిలు చెల్లించాలి..

లేదంటే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు



పెద్దపల్లి, (సింగిడి): రైస్ మిల్లుల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యాన్ని సహిం చేది లేదని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. బకాయిలు చెల్లిం చకుండా కాలయాపన చేస్తున్న డిఫాల్టర్ రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవా లని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. రెండు, మూడు రోజుల్లోగా బకా యిలు చెల్లించకపోతే నిబంధనల ప్రకా రం ఆయా మిల్లుల ఆస్తులు, బ్యాంకు ఖాతాలను సీజ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి సంబం ధిత రైస్ మిల్లర్లు, అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా బకాయిల వసూళ్ల పురోగతిని సమీక్షించిన ఆయన, ప్రభుత్వానికి చెల్లిం చాల్సిన మొత్తాలను వసూలు చేయడం లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించా లని సూచించారు. బకాయిల చెల్లింపులో జాప్యం చేస్తున్న మిల్లర్ల వివరాలను సేకరించి, వారిపై చట్టపరమైన చర్యల కు అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

డిఫాల్టర్ల ఆస్తుల గుర్తింపునకు ఆదేశాలు

బకాయిలు చెల్లించని రైస్ మిల్లర్లకు సంబంధించినస్థిర, చర ఆస్తులతో పాటు బ్యాంకు ఖాతాల వివ రాలను సమగ్రంగా గుర్తించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నిర్దేశిత గడువులోగా బకా యిలు చెల్లించని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. అవసరమైన చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేసి, బకాయిల వసూళ్ల కు ఆటంకం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.

ఆస్తుల లావాదేవీలపైనా నిఘా

డిఫాల్టర్ రైస్ మిల్లర్లు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన ఆస్తుల లావా దేవీల వివరాలను పరిశీలించాలని కలెక్ట ర్ సూచించారు. బకాయిల వసూళ్ల కు విఘాతం కలగకుండా, చట్టబద్ధమైన పరిధిలో అవసరమైన చర్యలు తీసుకోవా లని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. బకాయిల వసూళ్లను కేవలం సమీ క్షలకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థా యిలో పురోగతి సాధించేలా సమన్వ యంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వానికి రావాల్సిన బకాయిల వసూ ళ్లలో ప్రతి అధికారి బాధ్యతాయు తంగా వ్యవహరించాలని, డిఫాల్టర్ మిల్లర్ల విష యంలో నిబంధనల మేరకు తదు పరి చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశా రు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరా ల అధికారి శ్రీనాథ్, జిల్లా మేనేజర్ శ్రీకాం త్, డీసీఓ శ్రీమాల, ఆర్డీఓ గంగయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో గండాన్ని ఎదుర్కొందాం.. తక్కువ నీటితో కూరగాయల సాగు చేపడదాం!

నీటి పొదుపు పద్ధతులతో రైతులకు మెరుగైన ఆదాయం

జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యాంప్రసాద్



పెద్దపల్లి, (సింగిడి): ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ తక్కువ నీటితో సాగయ్యే కూరగాయల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని పెద్దపల్లి జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి గడ్డం శ్యాంప్రసాద్ సూచిం చారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని, ఆధునిక సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా వర్షాభావ పరిస్థితుల్లోనూ వ్యవసాయాన్ని లాభసా టీగా మార్చుకోవచ్చని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో వర్షాభావ పరిస్థితులు తీవ్రతరం అయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని ఆయన సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా బెండ, అలసంద, గోరుచిక్కుడు, వంగ, మునగ, చిలగదుంప వంటి పంటలను సాగు చేయాలని తెలిపారు. స్థానిక వాతావర ణ పరిస్థితులకు అనుగుణంగా అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోగల సాహూ వంటి టమాటా రకాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

నీటి ప్రతి చుక్కా పంటకు ఉపయోగపడాలి

పస్తుత పరిస్థితుల్లో నీటి నిర్వహణే పంటల సాగులో కీలకమని శ్యాంప్రసాద్ స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటిని వృథా చేయకుండా, పంట అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని తెలిపారు. నీటి లభ్యతను అంచనా వేసిన తర్వాతే పంట విస్తీర్ణాన్ని నిర్ణయించుకోవాలని, నేలలో తేమను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన మేరకే నీటిని అందించాలని సూచించారు. కూరగాయల సాగులో నేల నుంచి తేమ ఆవిరైపోకుండా నిరోధించేందుకు మల్చింగ్ షీట్లను వినియోగించాలని వివరించారు. మల్చింగ్ ద్వారా నేలలో తేమ ఎక్కువకాలం నిల్వ ఉండటంతో పాటు కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించవచ్చని, తద్వారా నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

బిందు సేద్యంతో నీటి పొదుపు

సాంప్రదాయ పారుదల పద్ధతుల్లో నీటి వృథాను తగ్గిం చేందుకు బిందు సేద్యం (డ్రిప్), తుంపర సేద్యం (స్ప్రింక్ల ర్) వంటి ఆధునిక నీటి నిర్వహణ పద్ధతులను ప్రాధాన్యం గా అనుసరించాలని రైతులకు సూచించారు. ముఖ్యంగా బిందు సేద్యం ద్వారా మొక్కల వేర్లకు అవసరమైన మేరకు నీటిని అందించవచ్చని, నీటి కొరత ఉన్నప్రాంతా ల్లో ఈ పద్ధతులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. నేల స్వభావం, పంట రకం, నీటి లభ్యతను బట్టి సాగు విధానాలను ఎంచుకోవాలని, నీటిని సమర్థవ ంతంగా వినియోగించే సాంకేతికతలను అందిపుచ్చుకో వాలని కోరారు. నీటి పొదుపుతో పాటు పంటల యాజమాన్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సాగు ఖర్చులను నియంత్రించుకునే అవకాశం ఉంటుం దని వివరించారు.

ప్రత్యామ్నాయ పంటలతో ఆదాయానికి భరోసా

ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వాతావరణ మార్పుల ను దృష్టిలో ఉంచుకొని రైతులు సంప్రదాయ పంటల సాగుపైనే ఆధారపడకుండా, పరిస్థితులకు అనుగుణ మైన ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని శ్యాంప్ర సాద్ సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే కూరగా యల పంటల ఎంపిక, నీటి పొదుపు సాంకేతికతల విని యోగం, సరైన పంటల యాజమాన్యం ద్వారా రైతు లు తమ ఆదాయాన్ని కాపాడుకునే దిశగా ముందుకు సాగా లని పిలుపునిచ్చారు. పంటల ఎంపిక, సాగు విధా నాలు, నీటి నిర్వహణకు సంబంధించి మరింత సాంకే తిక సమాచారం అవసరమైన రైతులు సమీపం లోని ఉద్యా నవన శాఖ అధికారులను సంప్రదించాలని కోరారు.

రైతు సేవలకు అధికారుల ఫిదా

చిన్నకల్వల సహకార సంఘం పనితీరుపై బ్యాంకు అధికారుల ప్రశంసలు

రైతులకు రుణాలు

చిరు వ్యాపారులకు చేయూత

త్వరలో ఫంక్షన్ హాల్, బంగారు రుణాల సదుపాయం



సుల్తానాబాద్, (సింగిడి): రైతులకు రుణాలు అందిస్తూ, చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తూ, వివిధ వ్యాపార కార్యకలా పాలతో ముందుకు సాగు తున్న చిన్నకల్వల ప్రా థమిక వ్యవసాయ సహకార సంఘం పనితీరుపై జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అధికారులు సం తృప్తి వ్యక్తం చేశారు. సంఘం నిర్వహిస్తు న్న సేవ లు, రుణాల పంపిణీ, వసూళ్ల తీరును పరిశీలిం చిన అధికారులు.. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందిం చేదిశగా సాగుతున్న ప్రణాళికలను తెలుసుకున్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నక ల్వల సహకార సంఘాన్ని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజ ర్‌తో పాటు ఇతర అధికారులు సందర్శించి, సంఘం ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న వివిధ వ్యాపార కార్యకలా పాలను సమీక్షించారు. పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, చిరు వ్యాపారులకు రుణాల పంపిణీ, ఎరువులు, పురుగుమం దుల విక్రయాలు, గోదాముల నిర్వహణ, పెట్రోల్ బంకు కార్యకలాపా లను పరిశీలించారు. నిరర్థక ఆస్తుల వివరా లు, రుణాల వసూళ్ల శాతం, వరి ధాన్యం కొనుగోళ్ల నిర్వహణపై ఆరా తీశారు. సంఘం కార్యదర్శి వల్లకొండ రమేష్, పీఏసీఎస్ అభివృద్ధి వనరుల ప్రతినిధి సత్యనారా యణ సంఘం ద్వారా అంది స్తున్న సేవలు, చేపడుతున్న కార్యకలాపాల వివరాలను అధికారులకు వివరించారు.



మరిన్ని సేవలే లక్ష్యం..

రానున్న రోజుల్లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సహకారంతో సంఘం పరిధిలో ఫంక్షన్ హాల్ నిర్మాణం, బంగారు ఆభరణాలపై రుణాల సదు పాయం కల్పించేం దుకు ప్రణాళికలు రూపొం దిస్తున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు గౌరవెల్లి మురళీధర్ రావు తెలిపారు. రైతులు, సంఘ సభ్యులకు మరిన్ని ఆర్థిక సేవలు అందుబాటు లోకి తీసుకురావడంతో పాటు, సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా ముందుకు సాగుతు న్నట్లు పేర్కొన్నారు.

లక్ష్య సాధనలో అప్రమత్తత కీలకం



మంచిర్యాల, (సింగిడి): బొగ్గు ఉత్పత్తిలో లక్ష్యాలను చేరుకో వాలంటే కార్మికుల భద్రతకు పెద్దపీట వేయాలి. ప్రమాదాలకు తావులేకుండా పనులు సాగినప్పుడే ఉత్పత్తి, ఉత్పాద కతలో ఆశించిన ఫలితాలు సాధ్యమవు తాయి. ఈ దిశగా రక్షణ ప్రమాణాలను పాటిస్తూ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాల ని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కే. వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించిన ఆయన.. ఎస్సార్పీ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో ఉత్పత్తి, ఉత్పాదకత తీరును జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌తో కలిసి డైరెక్టర్ పనిప్రదేశాల ను సందర్శించారు. రోజువారీ బొగ్గు ఉత్పత్తి, కార్యకలాపాల పురోగతిని సమీక్షించారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాల కు అనుగుణంగా ఉత్పత్తిని కొనసాగిం చడంతోపాటు ఏరియా లక్ష్యాల సాధనకు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉత్పత్తి పెంపుపై దృష్టి సారిస్తూనే ఎలాంటి ఆటంకాలు, ప్రమాదాలు చోటుచేసు కోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎస్సార్పీ ఓసీపీ కార్యకలా పాల కోసం నూతనంగా కేటాయించిన లోడర్‌ను హెచ్‌ఈఎం విభాగంలో జీఎం మునిగంటి శ్రీనివాస్‌తో కలిసి డైరెక్టర్ పూజలు నిర్వహించి ప్రారంభించారు. నూతన యంత్రాల అందుబాటుతో పను ల నిర్వహణలో సామర్థ్యం పెంచుకోవాల ని, వాటిని నిర్దేశిత పద్ధతుల్లో జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. యం త్రాల నిర్వహణలో అప్రమత్తత పాటించ డం, రక్షణ నిబంధనలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చనే అంశాన్ని ఈ సందర్భం గా ప్రస్తావించారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనలో యంత్రాల సామర్థ్యంతోపాటు వాటిని నిర్వహించే సిబ్బంది నైపుణ్యం, భద్రతా ప్రమాణాల అమలు కూడా కీలకమే. ఈ నేపథ్యంలో ఉత్పత్తి పెంపు, కార్మికుల రక్షణ రెండింటికీ సమాన ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో టు జీఎం కృష్ణ ప్రసాద్, ప్రాజెక్ట్ ఆఫీసర్ సీహెచ్ వెంకటే శ్వర్లు, మేనేజర్ ఐ. శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ ఎస్. సురేష్, ప్రాజెక్ట్ ఇంజినీర్ నాగరాజు, సీనియర్ సర్వేయర్ సంపత్ రెడ్డి, ఏరియా క్వాలిటీ మేనేజర్ శ్రీధర్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



తిర్యాణి అభివృద్ధికి హోలిస్టిక్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు

మారుమూల గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

కలెక్టర్ హరిత



కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, (సింగిడి): ఆకాంక్షిత మండలమైన తిర్యాణిలోని మారు మూల గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, సాగునీరు, రహదారులు, ఉపాధి అవకాశాల కల్పనకు హోలిస్టిక్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ద్వారా చర్యలు చేపట్టను న్నట్లు కలెక్టర్ కె. హరిత తెలిపారు. గురువారం జిల్లాలోని తిర్యాణి మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆవరణలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆర్థిక సహకారంతో సీవైడీవో సంస్థ అమలు చేస్తున్న ప్రాజెక్టును అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మట్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు అవసరాల ను గుర్తించి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. సర్పంచులు స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేయాల న్నారు. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను పథకాల ను అర్హులైన వారికి అందేలా చూడాలని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాలైన లింగాపూర్, సిర్పూర్ (యు), మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంస్థ ప్రతినిధులకు సూచ

ప్రభాతనన సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 25-10-2026

రంగురంగుల పూలతో ...

టి.ఎన్.జి.ఓ. యూనియన్, అన్ని శాఖల ఉద్యోగుల ఆటపాటలతో సందడిగా మారిన ప్రాంగణం

గౌరమ్మకు పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడిన అదనపు కలెక్టర్ సంగీత



సంగారెడ్డి బ్యూరో , (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంగారెడ్డి కలెక్టరేట్ లోని అన్ని శాఖల ఉద్యోగులు, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదా య ఆటపాటలతో కలెక్టరేట్ ప్రాంగణం పండుగ శోభను సంతరిం చుకుంది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల ప్రాధాన్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పడి సంప్రదాయబద్ధంగా ఆడిపాడారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన బతుకమ్మ పాటలు వేడుకలకు మరింత ఉత్సాహాన్నితీసుకొచ్చాయి. పాటలకు అనుగుణంగా మహిళా ఉద్యోగులు నృత్యాలు చేస్తూ సంబురాల్లో పాల్గొన్నారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే ఉద్యోగులు ఒకచోట చేరి పండుగను సామూహికంగా జరుపుకో వడంతో కలెక్టరేట్‌లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ వేడుకల్లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి , టి జి ఓ జిల్లా అధ్యక్షులు డా ' వైద్యనాథ్ , జిల్లా టి.ఎన్.జి.ఓ. అధ్యక్షులు,మహిళా నాయకులు, కార్యవర్గం సభ్యులు ,కలెక్టరేట్‌లోని వివిధ శాఖల మహిళా ఉద్యోగులు , సిబ్బంది సాంస్కృతిక సారథి కళాకారులు, కలెక్టరేట్ సమీప కాలనీ మహిళలు పాల్గొన్నారు.





ఖమ్మం బడులకు మహర్దశ.. వర్సిటీకి కొత్త దిశ

ప్రభుత్వ పాఠశాలల్లో నూతన భవనాలు, మరమ్మతులకు రూ.10.12 కోట్లు ఇవ్వండి

ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి త్వరగా రెగ్యులర్ వీసీని నియమించాలి

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి



ఖమ్మం , (సింగిడి):ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడం, విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి తుమ్మల నాగే శ్వరరావు చర్యలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి యోగితా రాణాతో మంత్రి సమావేశమయ్యారు. ఖమ్మం నియోజకవర్గ పరిధి లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో నూతన భవనాల నిర్మాణం, మరమ్మతు లు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 10.12 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి రెగ్యు లర్ ఉపకులపతిని (వీసీ) త్వరితగతిన నియమించడంతో పాటు, విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బడులకు భరోసా.. విద్యార్థులకు మెరుగైన వసతులు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతను అధిగమించి, విద్యార్థులకు మెరుగైన అభ్యాస వాతావరణం కల్పించాల్సిన అవసరాన్ని మంత్రి వివరించారు. ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం మండలాల పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో అభివృ ద్ధి పనుల కోసం రూ. 10.12 కోట్లు కేటాయించాలని కోరారు. నూతన భవనాల నిర్మాణం, మరమ్మతులు, అవసరమైన విద్యా సదుపాయాల కల్పనతో పాటు డిజిటల్, ఇతర బోధ నా పరికరాలను సమకూర్చడం ద్వారా ప్రభుత్వ బడులను మరింత బలోపేతం చేయవ చ్చని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న నిధుల వనరుల ద్వారా ప్రతిపాదిత మొత్తాన్ని మంజూరు చేసి, పనులను ప్రాధాన్యంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

16 పాఠశాలలు.. 2,988 మంది విద్యార్థులకు ప్రయోజనం.

ఖమ్మం అర్బన్ పరిధిలోని ఎనిమిది, రఘునాథపాలెం మండలంలోని మరో ఎనిమిది పాఠశాలలు కలిపి మొత్తం 16 బడులను అభివృ ద్ధి ప్రతిపాదనల్లో చేర్చారు. వీటిలో 2,988 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల మెరుగుదల, విద్యా పరికరాల ఏర్పాటు తదితర పనులకు అంచనాలు రూపొందించారు. ఖమ్మం అర్బన్ పరిధిలోఎన్ఎస్ఎస్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాండురం గాపురం జడ్పీ ఉన్నత పాఠశాల, రాజేంద్రనగర్ ఉన్నత పాఠశాల, జి.ఖమ్మం ఉన్నత పాఠశాల, బాలాజీనగర్ జడ్పీ ఉన్నత పాఠశాల, కుచవల్లి ప్రాథమిక పాఠశాల, బాలాపేట (వైఎస్సార్ కాలనీ) ఎంపీపీఎస్, రాజకవీధి ప్రాథమిక పాఠశాల ఉన్నాయి. రఘునాథపాలెం మండలంలో... వి.వెంకటాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, ఏర్ల పూడి, వి.వెంకటాయపాలెం ఎంపీపీఎస్, పువ్వాడనగర్ ఎంపీపీఎస్, పాపటపల్లి, మం చుకొండ, కోయచలక, చిమ్మపూడి పాఠశాలలు ఉన్నాయి. ఈ ప్రతిపాదనలకు నిధులు మంజూరైతే ఆయా పాఠశాలల్లో వసతుల మెరుగుదలకు మార్గం సుగమం కానుంది.

వర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించాలి..

కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయ అభివ ద్ధి, సజావైన నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. విశ్వవిద్యాలయానికి రెగ్యులర్ ఉపకులపతిని త్వరగా నియమించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు విజ్ఞప్తి చేశారు. రెగ్యులర్ వీసీ నియామకంతో పరిపాలనా నిర్ణయాలు వేగవంతమై, విశ్వవిద్యాలయ అభివ ద్ధికి అవసరమైన కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.విశ్వవిద్యాలయ నాన్‌టీచింగ్ ఎంప్లారూస్ అసోసియేషన్ సెప్టెంబరు 17న సమర్పించిన వినతిపత్రాన్ని కూడా మంత్రి సంబంధిత లేఖకు జత చేశారు. అందులో ప్రస్తావించిన సమస్యలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల నుంచి ఉన్నత విద్యాసంస్థల పరిపాలన బలోపేతం వరకు విద్యారంగానికి సంబంధించిన కీలక అంశాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు

లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ వైద్య సేవలను

సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ కె.హరిత

కొమురం భీం ఆసిఫాబాద్(సింగిడి): మారుమూల ప్రాంతాల ప్రజలు లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ద్వారా అందించే ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత కోరారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ.. అక్టోబరు 16 నుంచి నవంబరు 5వ తేదీ వరకు రైలులో ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి శస్త్రచికి త్సలు సైతం నిర్వహిస్తారని పేర్కొన్నారు. కంటి, చెవి, ఎముకలు, పెదవి చీలిక, కాలిన గాయాలు, దంత సమస్యలు, ప్లాస్టిక్ సర్జరీలకు సంబంధిం చిన వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ సేవలపై విస్తృత ప్రచారం చేపట్టి, ఎక్కువ మంది ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ.. కాగజ్‌నగర్‌లో లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ద్వారా రెండోసారి వైద్య సేవలు అందించడం సంతోషకరమన్నారు. 1991లో ప్రారంభమైన ఈ సేవా కార్యక్రమం ఇప్పటివరకు వివిధ రాష్ట్రాల్లో 256 ప్రాజెక్టులను పూర్తి చేసిందని తెలిపారు. 2022లోనూ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో వైద్య సేవలు అందించారని గుర్తుచేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగేంద్ర, తహసీల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ రోహిణి, డాక్టర్ మనోహర్‌రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు : కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, (సింగిడి): ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్యం అందాలి.. చికిత్స కోసం వచ్చే పేదలకు భరోసా కలగాలి.. తల్లీబిడ్డల ఆరోగ్యానికి పెద్దపీట వేయాలి.. ఇదే లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంచిర్యాల పట్టణంలోని కాలేజ్ రోడ్డులో ఉన్నప్రభుత్వ మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని శు క్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సదుపాయాలు, వైద్య పరికరాలు, వివిధ విభాగాల పనితీరును పరిశీలించా రు. ఆసుపత్రిలోని గర్భిణుల విభాగం, చిన్నారుల చికిత్స విభాగం, ఐసీయూ గదులు, పడకలు, పిల్లల విభాగంలో ఏసీలు, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. వైద్య పరికరాలు, రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితి, బరువు, వారికి అందిస్తున్నవైద్య సేవల గురించి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. నవజాత శిశువుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని, అవసరమైన చికిత్సను ఎప్పటికప్పుడు అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రికి ప్రతిరోజూ వచ్చే రోగులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని, వైద్యులు, సిబ్బంది సమయా నికి అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు నాణ్యమైన వైద్యం అందించడంలో నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. ఆసుపత్రిలో ఇంకా అవసరమైన వైద్య పరికరాలు, ఏసీలు, ఇతర సదుపాయాల వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. మరమ్మతులకు గురైన పరికరాలు, సదుపాయాలను వెంటనే బాగుచేయించాలని ఆదేశించారు. రోగులు, వారి సహాయకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన వసతులు కల్పించాలని తెలిపారు. ఆసుపత్రి అధికారులు గుర్తించిన అవసరమైన సదుపాయాలను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆసుపత్రి ప్రాంగణంలో మద్యం సేవించి వచ్చి గొడవలు సృష్టించే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రోగులు ప్రశాంతంగా చికిత్స పొందేలా, వారి సహాయకులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డా. అశోక్‌కుమార్, ఆర్ఎంఓ డా. శ్రీధర్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో ఘనంగా 'అలయ్-బలయ్' వేడుకలు

ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నివాసంలో సందడిగా ఆత్మీయ సమ్మేళనం

సంగారెడ్డి ప్రతినిధి, (సింగిడి):నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నివాసంలో 'అలయ్-బలయ్' వేడుకలు ఘనంగా నిర్వహించా రు. పండుగ వాతావరణంలో, ఆత్మీయతకు ప్రతీకగా సాగిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ సర్పంచులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల సుధాకర్ రెడ్డిని నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. పరస్పరం ఆలింగనం చేసుకుని 'అలయ్-బలయ్' శుభాకాంక్షలు తెలుపుకున్నారు.నాయకులు, కార్యకర్తల మధ్య ఆత్మీయ పలకరింపులు, సోదరభావం వెల్లివిరియడంతో కార్యక్రమం సందడిగా సాగింది. పండుగ సందర్భంగా ఒకరినొకరు కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.

భారీగా హాజరైన పార్టీ శ్రేణులు.

ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, యువజన నాయ కులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, మాజీ సర్పం చులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి నివాసం పార్టీ శ్రేణులతో సందడిగా మారింది.



VITEEE 2027 దరఖాస్తులను ప్రారంభించిన VIT

హైదరాబాద్, (సింగిడి):వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (VIT) తమ ప్రతిష్టా త్మక బి.టెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష, VITEEE 2027 దరఖాస్తు ప్రక్రియను అధికారికంగా ప్రారంభిం చింది. ఆసక్తి గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ viteee.vit.ac.అఅ ద్వారా ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవచ్చని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. వెల్లూరు, చెన్నై, ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి మరియు మధ్యప్రదేశ్‌లోని భోపాల్ క్యాంపస్‌లలో అందించే వివిధ అండర్‌గ్రాడ్యు యేట్ ఇంజనీరింగ్ కోర్సులలో ప్రవేశాలకు ఈ ప్రవేశ పరీక్ష మార్గంగా నిలుస్తుందని పేర్కొంది. ఈ కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష 2027 ఏప్రిల్ 28 నుండి మే 2 వరకు ఒకే విడతలో జరగనుంది. దేశ విదేశాల్లోని విద్యార్థులకు పరీక్షను సులభత రం చేసేందుకు, భారతదేశంలోని 133 నగరాల తో పాటు విదేశాల్లోని 9 కేంద్రాలలో పరీక్షా కేంద్రాలను VIT ఏర్పాటు చేసిందని ఆ ప్రకటనలో వెల్లడించింది.



మోటార్ కేబుల్ వైర్లు

కోసిన దుండగులు

కోదాడ, (సింగిడి):
అనంతగిరి మండలంలోని గొండ్రియాలలో మోటార్ కేబు ల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కోశారు. గ్రామానికి చెందిన నెల్లూరు చిన్న వీరయ్య పొలం వద్ద కాలువ కట్ట సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అదే సమయంలో రైతు పొ లం వద్దకు వెళ్లడంతో దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

త్యాగాలే పోలీసు శాఖకు నిత్యస్ఫూర్తి..

అమరవీరుల సేవలు చిరస్మరణీయం!

ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యం:

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

శాంతి, సామరస్యాలతోనే సమాజ ప్రగతి సాధ్యం:

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం.

154 మంది అమరవీరులకు ఘన నివాళులు



రామగుండం,(సింగిడి):దేశ ప్రజల రక్షణ కోసం, సమాజంలో శాంతిభద్రతల స్థాపన కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించి అమరులైన పోలీసుల త్యాగాలు దేశ చరిత్రలో సువర్ణాక్షరా లతో నిలిచిపోతాయని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. అమరవీరుల త్యాగాలు ప్రతి పోలీసు అధికారి, సిబ్బందిలో కర్తవ్యనిష్ఠను, దేశభక్తిని మరింత పెంపొందించాలని పిలుపునిచ్చారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణతో పాటు శాంతిభద్రతలను కాపాడటమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, ఆర్జే-1 జీఎం లలిత్ కుమార్, ఇతర పోలీసు అధికారులు, అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అమరుల సేవలను స్మరించుకున్నారు. గత ఏడాది నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 154 మంది పోలీసు అమరవీరుల పేర్లను అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్ చదివి వినిపించారు. అనంతరం ఆర్ఐ శేఖర్ ఆధ్వర్యంలో సాయుధ పోలీసు సిబ్బంది శోకశస్త్రం నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి వీరుల త్యాగాలకు ఘనంగా నివాళు లర్పించారు. దేశ భద్రత కోసం ప్రాణాలర్పించిన వారి సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, పోలీసు చరిత్రలో అక్టోబర్ 21వ తేదీకి





విశిష్టమైన స్థానం ఉందన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో సరిహద్దు పర్యవేక్షణ విధుల్లో ఉన్న సీఆర్‌పీఎఫ్ బృందంపై చైనా బలగాలు దాడి చేయగా, ధైర్యంగా ఎదుర్కొన్న భారత జవాన్లు ప్రాణత్యాగం చేశారని వివరించారు. ఆ వీరుల త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.దేశ రక్షణ, అంతర్గత భద్రత, ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు సిబ్బంది, ఇతర భద్రతా బలగాల సేవలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. అమరవీరుల పేర్లను స్మరించుకోవడమే కాకుండా, వారు ఆశించిన లక్ష్యాల సాధనకు అంకితభావంతో పనిచేయడం నిజమైన నివాళి అని పేర్కొన్నారు.క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికీ ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసులు ముందుండాలని, ప్రతి అధికారి, సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో నిర్వర్తించాలని అన్నారు. పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సేవాభా వంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అమరవీరుల ధైర్యం, దేశభక్తి, త్యాగనిరతి పోలీసు సిబ్బందికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు.మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతలు నెలకొన్నప్పుడే అభివృద్ధి వేగవంతమవుతుందని అన్నారు. దేశ సరిహద్దుల రక్షణలో సైనిక బలగాలు కీలక పాత్ర పోషిస్తుండగా, అంతర్గత భద్రత, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని తెలిపారు.
పోలీసులు రోజులో 24 గంటలు, ఏడాదిలో 365 రోజులు ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తారని, ఈ క్రమంలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి అమరవీరుల సేవలను సమాజం ఎప్పటికీ మరచిపోకూడదని అన్నారు.పోలీసు శాఖకు సహకరించాలనుకునే ప్రతి పౌరుడు చట్టాలను



గౌరవించాలని, ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించా లని సూచించారు. నిబంధనలు ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాకుండా వారి భద్రత, సమాజ సంక్షేమం కోసమే రూపొందించబడ్డాయని వివరించారు. భయంతో కాకుండా సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ చట్టాలను పాటిస్తే ప్రమాదాలు, సమస్యలు తగ్గి, సురక్షితమైన సమాజ నిర్మాణం సాధ్యమవు తుందని తెలిపారు.శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసుల కృషి అభినందనీయమని, ప్రజలకు భద్రత కల్పిస్తూ అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంలో వారి సేవలు కీలకమని ప్రశంసించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులందరికీ ఘన నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, టాస్క్ ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్, సీసీఎస్ ఏసీపీ రవీందర్, ఏవో శ్రీనివాస్‌తో పాటు కమిషనరేట్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సీపీఓ సిబ్బంది, స్పెషల్ పార్టీ, ఏఆర్ సిబ్బంది,

సొంతూరికి సీఎం..

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
సీఎం పర్యటనకు పగడ్బందీ ఏర్పాటు చేయాలి
నాగర్ కర్నూల్ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి



నాగర్‌కర్నూల్, (సింగిడి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 20న నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా గ్రామంలో నిర్వహించనున్న దసరా ఉత్సవాలతోపాటు పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. శుక్రవారం కొండారెడ్డిపల్లిని సందర్శించిన కలెక్టర్.. ఏటీసీ కేంద్ర నిర్మాణ స్థలం, భూగర్భ మురుగునీటి శుద్ధి వ్యవస్థ, నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు



కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయంతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటనకు సంబంధించి శాఖల వారీగా చేపట్టాల్సిన పనులు, అధికారుల బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రవాణా సదుపాయాలు, పర్యటన ప్రాంగణం సిద్ధం చేయడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రతి శాఖకు కేటాయించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీకి సూచించారు.

మూడు ఏటీసీ కేంద్రాలకు శంకుస్థాపన

కొండారెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా నూతనంగా మంజూరైన మూడు ఏటీసీ కేంద్రాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో కొండారెడ్డిపల్లి సర్పంచ్ వెంకటయ్య, ఉపసర్పంచ్ వేమారెడ్డి, గ్రామ నాయకులు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసే నాయకులకే పట్టం కట్టాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
210 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, 150 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



హనుమకొండ, (సింగిడి):ప్రజలకు నిరంతరం సేవలు చేసే నాయకులకే పట్టం కట్టాలని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో అర్హత పొందిన 210 మంది లబ్ధిదారులకు ఇందిర మ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, మరో 150 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మొత్తం రూ. 1,55,00,000 (రూ. 1 కోటి 55 లక్షలు) విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబం కల అని, ఆ కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులకు ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఆడపిల్లల వివాహాలు ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన అన్నారు.

రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, ప్రజా సేవే ప్రధాన లక్ష్యంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రజల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో. కూడా చైర్మన్ గుండు సుధారాణి,మాజీ కార్పొరేటర్లు,డివిజన్ అధ్యక్షులు, నాయకులు,అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. గులను పంపిణీ చేశారు. సర్వేయర్లు పూర్తి స్థాయిలో కృషి చేస్తూ, నిబంధనల ప్రకారం పారదర్శకంగా రీ సర్వే పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, డియార్వో విజయలక్ష్మి, ఏ డి సర్వే మరియు రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, లీడ్ బ్యాంక్ మేనే జర్ జీవన్, మరియు డిప్యూటీ తహసీల్దార్లు, లైసెన్సు సర్వేయర్లు, గ్రామపాలన అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు

ఎస్ఐ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేసి బాధితులకు న్యాయం చేయాలి: విమలక్కడిమాండ్



కరీంనగర్,(సింగిడి): ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై పోలీసులు చిత్రహింసలకు పాల్పడినట్లు వస్తున్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవాధ్యక్షురాలు, తెలంగాణ ఉద్యమకారిణి విమలక్క అన్నారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో పోలీసుల వేధింపులకు గురైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జర్నలిస్టులు పొత్తూరి శేఖర్, రాతిపల్లి సంపత్‌లను శుక్రవారం కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆమె పరామర్శించారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు భావప్రకటనా స్వేచ్ఛకు విరుద్ధమని అన్నారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి, నిష్పక్షపాత విచారణ జరిపించి, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐ శ్రీకాంత్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులుగా తేలిన పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. జర్నలిస్టులు నిర్భయంగా విధులు నిర్వహించేలా ప్రభుత్వం రక్షణ కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులపై దాడి ప్రజల గొంతుకపై దాడితో సమానమని, మీడియా స్వేచ్ఛను కాపాడటం ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో నవ తెలంగాణ యువజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, జర్నలిస్టు బిజిగిరి నవీన్‌కుమార్, డీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్రనాయకులు పోతుల రమేష్, రాకేష్, శ్రీలత, వెంకటేష్, వెంకి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'డియర్ అక్షర' పుస్తకావిష్కరణ

తండ్రి తన కూతురికి అందించే అమూల్యమైన కానుక 'డియర్ అక్షర'
తెలుగు సాహిత్యంలో కొత్త ఒరవడికి నాంది పలికే రచన
డాక్టర్ ఎల్. మురళీధర్





వనపర్తి ప్రతినిధి,(సింగిడి): సాహితీ కళా వేదిక, చింతకుంట పబ్లికేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ సి.కిరణ్ కుమార్ రచించిన 'డియర్ అక్షర' పుస్తకా విష్కరణ కార్యక్రమం గురువారం రాత్రి బండారు నగర్ లోని సి.వి.రామన్ హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. పలుస శంకర్ గౌడ్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు, ప్రజా వైద్యశాల డైరెక్టర్ ఎల్. మురళీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్. మురళీధర్ మాట్లాడుతూ సమాజంలో నిత్యం చోటు చేసుకుంటున్న వివిధ పరిణామాలు, సామాజిక పోకడలను తన కూతురికి వివరిస్తూ వాటిని అర్థం చేసుకుని జీవితంలో ఎలా ముందుకు సాగాలనే విషయాలను తండ్రి లేఖల రూపంలో తెలియజేసిన విధానం ఈ పుస్తకంలో ఆకట్టుకుంటుందని అన్నారు. సుమారు వంద అంశాలపై రాసిన లేఖలు పాఠకులకు ఆలోచనాత్మక సందేశాలను అందిస్తాయని పేర్కొన్నారు. సరళమైన భాష, చక్కని రచనా శైలి పుస్తకాన్ని ఆసక్తికరంగా చదివించేలా ఉన్నాయని, తెలుగు సాహిత్యంలో ఈ రచన కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టే విధంగా ఉందని అభిప్రాయపడ్డారు.

కూతురికి తండ్రి అందించే అమూల్యమైన కానుక

సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ 'డియర్ అక్షర'లోని లేఖలు తండ్రి తన కూతురికి అందించే అమూల్యమైన కానుకలని అన్నారు. ఇందులో ప్రస్తావించిన అంశాలు ఒక్కకాలానికే పరిమితం కాకుండా వివిధ తరాలకు, అన్ని కాలాలకు వర్తించే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

రచయితకు ఘన సన్మానం

అనంతరం సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో పుస్తక రచయిత డాక్టర్ సి.కిరణ్ కుమార్‌ను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు చిన్నమ్మ తామస్, జనజ్వాల, కోళ్ల వెంకటేష్, గంధం నాగరాజు, సత్తార్ తదితరులు పాల్గొని పుస్తకంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. బైరోజు చంద్రశేఖర్, బండారు శ్రీనివాస్, ఉప్పరి తిరుమలేశ్, కురుమూర్తి, నవీన్ రెడ్డి, సురేష్, సురేందర్, కవిత, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి

జలసిరి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి: డీపీఓ



ఆలేరు, (సింగిడి):ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి తీవ్రత పెరిగే అవకాశాల నేపథ్యంలో గ్రామాల్లో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టేలా జలసిరి పనులను విస్తృతంగా చేపట్టాలని డీపీఓ సూచించారు. ఆలేరు మండలంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీపీఓ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు, కూలీల వివరాలు, పనుల గుర్తింపు తదితర అంశాలపై సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.

వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని గ్రామ పంచాయతీల్లో జలసిరి పనుల అమలుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీపీఓ తెలిపారు. ఇందులో భాగంగా ఇంకుడు గుంతలు, ఫారం పాండ్లు (వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ గుంతలు), సామూహిక ఇంకుడు గుంతలు, బోరుబావుల రీచార్జి నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా భూగర్భ జలమట్టం పెరిగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి, భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పనుల గుర్తింపు, కూలీల వివరాలపై సమీక్ష

గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించి, వాటి అమలుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. లేబర్ రిపోర్టు, జలసిరి పనుల పురోగతి, పనుల గుర్తింపు తదితర అంశాలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పనుల అమలును పర్యవేక్షిస్తూ, సంబంధిత అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో నీటి సంరక్షణ పనులను వేగవంతం చేసి, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీఓ, అరుణ, ఏపీఓ, ఈసీ, టీఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌తో వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి చర్యలు

అభివృద్ధి పనుల ప్రతిపాదనలు, డీపీఆర్‌లను వివరించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



హన్మకొండ, (సింగిడి):రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి శుక్రవారం హైద్రాబాద్ నుండి రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా హన్మకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న పాల్గొని మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ నగరంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద ప్రతిపాదించిన అభివృద్ధి పనులు, వాటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికల వివరాలను వెల్లడించారు. నగరంలో ఆర్థిక కార్యకలా పాల అభివృద్ధి, రవాణా ఆధారిత పట్టణాభివృద్ధి, ప్రాంతీ య ప్రణాళిక, పట్టణ పునరుద్ధరణ, తాగునీరు, పారిశుద్ధ్యం, నగర ప్రాంతాల పునరాభివృద్ధి వంటి కీలక అంశా లకు సంబంధించిన ప్రతిపాదనలను వివరించారు. నగర భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపా యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నీపీఓ అజిత్ రెడ్డి, సూపరిం టెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మహేందర్, రవికుమార్, సంజయ్ కుమార్, భీమ్‌రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

సంప్రదాయాల సోయగం..

ఎంపీడీవో కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు..
మహిళల ఆటపాటలతో మార్మోగిన కార్యాలయ ప్రాంగణం





సుల్తానాబాద్, (సింగిడి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో దివ్యదర్శన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు మహిళల ఆటపాటలతో సందడిగా సాగాయి. ఈ కార్యక్రమానికి డి ఎల్ పి ఓ దేవకి దేవి ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే మహిళా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి, ఐకెపి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొని రంగురంగుల బతుకమ్మలను పేర్చి, సంప్రదా య బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకు న్నారు. మహిళల కోలాహలం, పాటలతో కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎంపీడీవో దివ్యదర్శన్ రావు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మన పండుగలు, ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందరూ కలిసి ఐకమత్యంతో పండుగలను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.సంప్రదాయాల పరిరక్షణకు, మహిళల ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో ముగిశాయి.

రీ సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

లైసెన్స్డ్ సర్వేయర్లకు కిట్స్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్,(సింగిడి): భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను, లైసెన్స్డ్ సర్వేయర్లను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లకు, గ్రామ పాలన అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ఒక చారిత్రాత్మక మార్పు అని, భూ సమస్యల పరిష్కారానికి, భూ రికార్డుల ప్రక్షాళనకు ఇది ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో రీ సర్వే కోసం జిల్లా లోని మొత్తం 70 గ్రామాలను ఎంపిక చేయగా, ఇప్పటివరకు 21 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. వీటిలో 8 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తయిందని వివరించారు. మరో ఆరు గ్రామాల్లో 9(2) నోటీసులు జారీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి మండలానికి రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ బృందాల్లో డిప్యూటీ తహసీల్దార్, లైసెన్స్ సర్వేయర్లు, గ్రామ పరిపాలన అధికారులు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా లైసెన్స్డ్ సర్వేయర్లకు కలెక్టర్ మెడికల్ కిట్ తో పాటు, గొడుగు,ప్యాడ్, తదితర 12 రకాల కిట్స్ బ్యాగులను పంపిణీ చేశారు. సర్వేయర్లు పూర్తి స్థాయిలో కృషి చేస్తూ, నిబంధనల ప్రకారం పారదర్శకంగా రీ సర్వే పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదే శించారు. ఈ శిక్షణ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, డియార్వో విజయలక్ష్మి, ఏ డి సర్వే మరియు రికార్డ్స్ అధి కారి శ్రీనివాసులు,లీడ్ బ్యాంక్ మేనేజర్ జీవన్, మరియు డిప్యూటీ తహసీల్దార్లు, లైసెన్సు సర్వేయర్లు,గ్రామపాలన అధికారులు పాల్గొన్నారు.

రూ.25 లక్షలు మంజూరైనా..
సెప్టిక్ ట్యాంక్ పనులు ఎక్కడ?

ఏడాది గడిచినా ప్రారంభంకాని నిర్మాణం పనులు
దుర్వాసనతో డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వాసుల అవస్థలు
పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించాలి



వనపర్తి ప్రతినిధి,(సింగిడి):: ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అధికా రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వనపర్తి పట్టణంలోని చిట్యాల రోడ్డులో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో సెప్టిక్ ట్యాంక్ నిర్మా ణం కోసం రూ. 25 లక్షలు మంజూరై ఏడాది గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభం కాకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. ఈ పనులను పంచాయతీ రాజ్ శాఖ అధికారులు చూస్తున్నారు. నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో కాలనీలోని చాంబర్ల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు.

నిధులు మంజూరు..
పనులు మాత్రం శూన్యం!

కాలనీలో పారిశుధ్య సమస్యకు పరిష్కారం చూపేందుకు సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం కోసం రూ. 25 లక్షలు మంజూరైనప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. కాలనీలోని 19, 20, 21, 22, 23, 24, 25, 26, 27 బ్లాకులకు చెందిన 180 ఇండ్లకు సంబంధించిన సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం జరగాల్సి ఉంది. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సెప్టిక్ ట్యాంక్ నిండి నీళ్లు బయటికి వస్తూ కాలు వల పారుతుండడంతో దుర్వాసన వెదజల్లుతున్న ది. ఈ సెప్టిక్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరై ఏడాది గడిచినా కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడానికి కారణా లేమిటి? సంబంధిత అధికారులు పనుల పురోగతిని ఎందుకు పర్యవేక్షించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



దుర్వాసనతో ప్రజల నరకయాతన..

సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం పూర్తికాకపోవడంతో చాంబర్ల నుంచి దుర్వాసన వెదజల్లుతున్నట్లు స్థానికులు చెబుతు న్నారు. దీంతో కాలనీ వాసులు రోజువారీ జీవనంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుధ్య సమస్యకు సకాలంలో పరిష్కారం చూపకపోతే ప్రజారోగ్యంపై ప్రతి కూల ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. సమస్యను పరిష్కరించాల్సిన పంచా యతీరాజ్ శాఖ అధికారులు స్పందించకపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణమవుతోంది.

ప్రజల ఇబ్బందులు కనిపించడం లేదా?

ప్రజల సౌకర్యాల కోసం నిధులు మంజూరు చేయడమే కాకుండా వాటితో చేపట్టాల్సిన పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడటం కూడా అధికారులదే బాధ్యత. అయితే ఏడాది కాలంగా సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం ముందుకు సాగకపోవడం పర్యవేక్షణ లోపాలను ఎత్తి చూపుతోంది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించక పోతే సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని చర్చనీయాంశంగా మారింది. కాంట్రాక్టర్ పనిచేయకుంటే ప్రత్యామ్నాయ మార్గం వెతకాలని కాలనీవాసులు అంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు స్పందించి సెప్టిక్ ట్యాంక్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకో వాలని, కాలనీలో నెలకొన్న దుర్వాసన సమస్యకు తాత్కాలిక ఉపశమనం కల్పించడంతోపాటు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజాధనం మంజూరైనా ప్రజలకు ప్రయోజనం చేకూరకపోతే ఆ నిధుల వల్ల ప్రయోజనమేమిటన్న ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని అంటున్నారు

singidinews@gmail.com

సిన్మా సింగిడి
Cinma Singidi

ఆదివారం
25-10-2026

ఆ స్టార్ హీరోతో ఈసారి ఏకంగా...

తారా సుతారియా ఖాతాలో హ్యాట్రిక్ మూవీ..

గ్లామరస్ బ్యూటీ తారా సుతారియా వరుస పెట్టి క్రేజీ ప్రాజెక్ట్‌లు దక్కించుకుంటూ బాలీవుడ్‌లో దూసుకుపోతోంది. ఇటీవల కన్నడ స్టార్ యష్ ప్రధాన పాత్రలో నటించిన 'టాక్సిక్'తో ప్రేక్షకులను అలరించిన ఈ భామ.. తాజాగా ఓ బిగ్ ఆఫర్‌ను తన ఖాతాలో వేసుకుంది. బాలీవుడ్ హ్యాండ్‌సమ్ హీరో ఆదిత్య రాయ్ కపూర్ సరసన హీరోయిన్‌గా తారా సుతారియాను ఎంపిక చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటిస్తూ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. అత్యంత తీవ్రమైన హింస, ఎమోషన్స్, గాఢమైన ప్రేమ కథ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో తారా సుతారియా సరికొత్త రోల్‌లో మెరిసిపోనుందని టాక్.

ఇంతకుముందు 'మర్జావాన్' లాంటి మాస్ బ్లాక్‌బస్టర్ హిట్ అందించిన దర్శకుడు మిలాప్ మిలన్ జవేరీ, ప్రసిద్ధ నిర్మాత భూషణ్ కుమార్‌లతో తారా సుతారియా కాంబినేషన్ మళ్లీ కుదరడం విశేషం. అంతేకాకుండా 'ఏక్ విలన్ రిటర్న్స్' తర్వాత టీ-సిరీస్ లాంటి ప్రతిష్టాత్మక బ్యానర్‌లో తారా సుతారియా నటిస్తున్న మూడో చిత్రం ఇదే కావడం విశేషం. ఇంకా టైటిల్ ఖరారు చేసుకోని ఈ ప్రాజెక్ట్ ఒక పవర్‌ఫుల్ మ్యూజికల్ లవ్ స్టోరీగా రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇక ఇందులో తారా సుతారియా, ఆదిత్య రాయ్ కపూర్ తొలిసారిగా స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటంతో అభిమానుల్లో విపరీతమైన క్రేజ్ నెలకొంది. ఈ సినిమాలో తారా లుక్, నటన సరికొత్త స్థాయిలో ఉంటాయని టాక్. భూషణ్ కుమార్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రాన్ని ఈ ఏడాది చివర్లో సెట్స్ పైకి తీసుకెళ్లి, 2027లో గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.



నా కొడుకు కెరీర్ నా వల్లే నాశనం అయింది..

స్టార్ ప్రొడ్యూసర్ షాకింగ్ కామెంట్స్

ప్రముఖ నిర్మాత ఏ.ఎం. రత్నం తన కుమారుడు రవి కృష్ణ సినీ కెరీర్‌పై భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. '7/+ బృందావన కాలనీ'తో రవి కృష్ణకు మంచి గుర్తింపు వచ్చినప్పటికీ, ఆ తర్వాత అతడి కెరీర్‌కు సరైన ప్రణాళికతో అండగా నిలవలేకపోయి తప్పుచేశాను అని తెలిపారు. ఈ మేరకు తాజా ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. 'నిజం చెప్పాలంటే, నా పనిలో నేను ఎంత బిజీగా ఉన్నానంటే, నా కొడుకు రవి కృష్ణకు సరైన మద్దతు ఇవ్వలేకపోయాను, అలాగే అతని కెరీర్ కోసం ఎటువంటి ప్రణాళికా సిద్ధం చేయలేకపోయాను. బయటి నుంచి అతనికి సుమారు 20 నుండి 30 సినిమాల్లో నటించే అవకాశాలు వచ్చాయి. కానీ వాటిలోని కథాంశాలు అతనికి నచ్చకపోవడంతో వాటిని తిరస్కరించాడు. అలాంటి చిత్రాల్లో ఒకటి 'అరణ్య కాండం'. అయితే.. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం గారి కుమారుడు చరణ్ ఈ చిత్రంతో సంబంధం కలిగి ఉండటం, మా కుటుంబాల మధ్య మంచి స్నేహబంధం ఉండటం వల్ల ఈ సినిమా సాధ్యమైంది. ఈ చిత్ర దర్శకుడు తర్వాత జాతీయ అవార్డును కూడా గెలుచుకున్నారు. ఇందులో రవి చాలా భిన్నమైన నటనను ప్రదర్శించి, మంచి గుర్తింపు పొందాడు. ఇలాగే ఎన్నో సినిమాల కథల విషయంలో చాలా తప్పటడుగులు వెయ్యడం కారణంగా తన కెరీర్ నాశనం అయింది' అని చెప్పుకొచ్చాడు.

నా సినిమాకి కూడా హీరోల రేంజ్ కలెక్షన్లు ఇచ్చి బ్లాక్‌బస్టర్ చేయండి..

కృతి సనన్

బాలీవుడ్ యంగ్ హీరోయిన్ కృతి సనన్ ఓ పెద్ద హారర్ సినిమాతో సరికొత్త ప్రయోగం చేయడానికి రెడీ అయ్యారు. ప్రసిద్ధ నిర్మాణ సంస్థ మాడాక్ ఫిలిమ్స్ బ్యానర్‌లో ఈ సినిమా రాబోతున్నట్లు సమాచారం. భయంకరమైన అంశాలతో తెరకెక్కే ఈ మూవీ గురించి గత కొద్ది రోజులుగా వార్తలు వస్తుండగా.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో కృతి సనన్ ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు. తన రాబోయే సినిమా పూర్తిగా తన ఒక్కదాని భుజాలపైనే సాగే మెయిన్ లీడ్ ప్రాజెక్ట్ అని చెప్పారు. ఒక పెద్ద హీరో సినిమాకి థియేటర్లలో ఎలాంటి కలెక్షన్లు ఇస్తారో, తాను లీడ్ రోల్‌లో చేస్తున్న చిత్రానికి కూడా అదే స్థాయిలో వసూళ్లు ఇచ్చి బ్లాక్‌బస్టర్ చేయాలని అభిమానులను కోరారు.

ప్రేక్షకులు జెండర్ చూడకుండా మంచి కంటెంట్‌ను ఆదరించి, హీరోయిన్ సినిమాలకు కూడా భారీ ఓపెనింగ్స్ ఇస్తే పరిశ్రమలో రెమ్యునరేషన్ ఇచ్చే పద్ధతి మారడం ఖాయమని కృతి సనన్ చెప్పారు. అలాగే హీరో, హీరోయిన్ల రెమ్యూనరేషన్లలో ఉన్న వ్యత్యాసం గురించి కృతి మాట్లాడుతూ.. ఓటీటీ అందుబాటులోకి వచ్చాక మహిళల కోసం పవర్‌ఫుల్ పాత్రలు రాసే రచయితలు పెరిగారని ఆమె తెలిపారు. ప్రస్తుతం కేవలం పురుష ఆధిక్య సినిమాలే కాకుండా, కథానాయిక ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్ట్‌లు కూడా భారీగా వస్తున్నాయని అన్నారు. అయితే హీరోలతో పోలిస్తే హీరోయిన్ల పారితోషికంలో మాత్రం ఇప్పటికీ చాలా వ్యత్యాసం ఉందని, ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ మార్పు కేవలం చిత్ర పరిశ్రమ చేతుల్లోనే లేదని, థియేటర్ల నుంచి వచ్చే వసూళ్లను బట్టే బడ్జెట్, పారితోషికాలు ఆధారపడి ఉంటాయని కృతి వివరించారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737